




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



10 మంది ఇజ్రాయెల్ సజీవ – నిర్జీవ బందీలను 22న విడుదల చేస్తాం

బంగ్లాదేశ్ ప్రతిపక్ష నాయకురాలు ఖలీదాజియకు 37 కేసుల నుండి విముక్తి

ట్రంప్, శతకోటీశ్వరులకు సరికొత్త స్వర్ణయుగం

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 83 | గురువారం | 20-02-2025 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




03

## భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ దారుణ హత్య

- కత్తులతో దాడిచేసిన దుండగులు
- అక్కడికక్కడే మృతిచెందిన రాజలింగమూర్తి



03

## సాగర్ అడవిలో కార్చిచ్చు

- చెలరేగుతున్న మంటలు
- కిలోమీటర్ల మేర అడవి దగ్ధం



05

## ముడ కేసులో లోకాయుక్త క్లీన్‌చిట్

- కర్నాటక సిఎం సిద్ధరామయ్య దంపతులకు ఊరట



# ముమ్మాటికీ ప్రజావ్యతిరేకమే

- ప్రజలు, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేర్చాలి
- కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తే ఊరుకోం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల నిరసన

## బడ్జెట్‌పై కేంద్రం పునరాలోచన చేయాలి

ప్రజాపక్షం/భద్రాచలం/హనుమకొండ

కేంద్రప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ ప్రజావ్యతిరేకంగా ఉందని, ఇది పేదలు, సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేది కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. వామపక్షాల జాతీయస్థాయి పిలుపులో భాగంగా బుధవారం సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా, మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శనగా నినాదాలు చేస్తూ బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వామపక్ష పార్టీలు ప్రతిపాదించిన ప్రజల ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ఆమోదించి బడ్జెట్ ప్రవేశపెట్టాలన్నారు. కార్పొరేట్లకు, సంపన్న వర్గాలకు మేలు చేసే పద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు,

తరువాయి 12లో




మరిన్ని నిరసనల వార్తలు 9 లో

## తెలంగాణ ప్రాజెక్టులన్నింటికీ

# అనుమతులివ్వండి

- అంతర్రాష్ట్ర జలవివాదాలను సత్వరమే పరిష్కరించాలి
- కేంద్ర ప్రభుత్వానికి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి
- సీతారామ ప్రాజెక్టుకు నెలరోజుల్లో అనుమతులు వస్తాయని వెల్లడి



**తెలంగాణ రాష్ట్రానికి నీటి వాటా హక్కును సాధించేందుకు 'కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2' విచారణను వేగవంతం చేయాలి. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ నుంచి రబీ సీజన్‌లో అధిక నీటిని అక్రమంగా వాడుకుంటుంది. నీటి పంపిణీ సమానంగా ఉండేలా, అనధికారిక నీటి వాడకాన్ని నిరోధించే చర్యలు తక్షణమే తీసుకుంటామని కేంద్రం హామీనిచ్చింది.**

**– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని అంతర్ రాష్ట్ర జల వివాదాలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన నీటి ప్రాజెక్ట్‌లన్నింటికీ క్లియరెన్స్ ఇవ్వాలన్నారు. మెడిగడ్డ ఘటన ఎన్‌డిఎస్‌ఏ నివేదికను నెలాఖరులోగా అందించి, తదుపరి చర్యలకు సిఫారసు చేసేందుకు కేంద్రం సన్నద్ధమౌతోందని ఉత్తమ్ తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకు నెల రోజుల్లో అనుమతులు లభించనున్నాయని వెల్లడించారు. రాజస్థాన్‌లో మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు జరిగిన 'జాతీయ నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సు'లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సదస్సు అనంతరం ఆయన కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఆ శాఖా కార్యదర్శి దేబాశ్రీ ముఖర్జీతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో నీటిపారుదల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలు, నీటి కేటాయింపులు, అంతరాష్ట్ర వివాదాలు, ప్రాజెక్ట్‌లకు అనుమతులు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న ప్రాజెక్ట్‌లకు సున్నా వడ్డీతో

తరువాయి 2లో

## వచ్చేనెలలో బిసి, ఎస్‌సి రిజర్వేషన్‌లపై

# శాసనసభ ప్రత్యేక సమావేశం

- ఎస్‌సి వర్గీకరణపై ఒకటి, బిసి రిజర్వేషన్‌లపై రెండు బిల్లులు
- మూడవవారంలో బడ్జెట్ సమావేశం




ప్రజాపక్షం /హైదరాబాద్

బిసి రిజర్వేషన్‌ల పెంపు, ఎస్‌సి వర్గీకరణ పై రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఈ అంశాలపై వచ్చే నెల 1 నుంచి 5వ తేదీ లోపు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని యోచిస్తోంది. బిసి రిజర్వేషన్‌ల పెంపు, ఎస్‌సి వర్గీకరణ పై చట్ట బద్ధత కల్పిస్తామని ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగా అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సమావేశాలలో రిజర్వేషన్‌లకు సంబంధించి మూడు వేర్వేరు బిల్లులు ప్రవేశ పెట్టేందుకు కసరత్తు సాగుతోంది. ఎస్‌సి వర్గీకరణపై ఏక సభ్య కమీషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బిల్లు రూపకల్పనకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అసెంబ్లీ చర్చ, ఆమోదం తర్వాత ఎస్‌సి వర్గీకరణ చట్ట రూపం దాల్చనుంది. బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం

తరువాయి 2లో

## ఎల్‌ఆర్‌ఎస్‌కు

# 25శాతం రాయితీ



- ప్లాట్ కొనుగోలుదారులకు మార్చి 31 వరకు వెసులుబాటు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ఇక వేగంగా ఎల్‌ఆర్‌ఎస్ అమలు

ప్రజాపక్షం / హైదరాబాద్

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ ( లే అవుట్ రెగ్యులరైజేషన్ పథకం) అమలులో వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలు ప్రగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబులు పాల్గొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం అమలులో వేగం పెంచే కార్యక్రమంలో భాగంగా 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్లాట్ కొనుగోలుదారులకు ఈ రాయితీని మార్చి 31 వరకు వెసులుబాటు కల్పించింది. దీంతో పాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకోని వారికి, లే అవుట్‌లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు పలు వెసులుబాట్లు

తరువాయి 2లో

## ఉక్రేన్‌పై శాంతి చర్చలకు

# ఉన్నతస్థాయి బృందం

- ఆర్థిక,దౌత్య సంబంధాల మెరుగుదలకు కృషి
- రియాద్‌లో రష్యా–అమెరికా అంగీకారం



**రియాద్ :** రెండు దేశాలమధ్య దౌత్య సంబంధాలు మెరుగుపరచుకోవాలని, ఉక్రేన్‌లో యుద్ధ విరమణకు అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించాలని రష్యా–అమెరికా ప్రతినిధులు అంగీకరించారు. శాంతి చర్చలకోసం ఒక ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సౌదీఅరేబియా నగరం రియాద్‌లో రెండు అగ్రరాజ్యాల మధ్య మంగళవారం జరిగిన చర్చల్లో మైలురాయిగా నిలిచిపోయే అంగీకారం కుదిరింది. సౌదీ అరేబియా విదేశాంగమంత్రి కూడా చర్చల్లో పాల్గొన్నారు. యుద్ధ విరమణకు రష్యా ఏ మేరకు ఆసక్తిగా ఉందనే విషయం తెలుసుకోవడానికే ఈ సమావేశంతప్ప, ఉక్రేన్‌లో శాంతి ప్రక్రియ చర్చలు ప్రారంభం కాలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ఒక వివరణ ఇచ్చారు. ఐతే దౌత్య–ఆర్థిక పరమైన సంబంధాలు వృద్ధి చేసుకోవాలని అమెరికా–రష్యా ప్రతినిధులు అంగీకరించారు. రెండు దేశాలూ ప్రధానంగా మూడు లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని చర్చల అనంతరం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అసోసియేటెడ్ ప్రెస్‌కు చెప్పారు. ఉక్రేన్‌లో యుద్ధ విరమణ ప్రక్రియకు వీలుగా వాషింగ్టన్–మాస్కో దౌత్య కార్యాలయాలలో సిబ్బందిని పునరుద్ధరించాలని, శాంతిచర్చలకు ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేయాలని అంగీకరించినట్లు చెప్పారు. రెండు దేశాలమధ్య ఆర్థిక సహకారాభివృద్ధిని అన్వేషించాలని అంగీకరించినట్లు చెప్పారు. రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్‌రోవ్,

తరువాయి 12లో

# అందరూ కష్టపడాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి
- పార్టీ శ్రేణులకు బిఆర్‌ఎస్ చీఫ్ కెసిఆర్ సూచన
- ఏప్రిల్ 10 నుంచి సభ్యత్వ నమోదు, 27న భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు వెల్లడి
- పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని జోస్యం



ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు అందరూ కష్టపడాలని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కోరారు. మహిళా రిజర్వేషన్లు అమలులోనికి రానున్నాయని, నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని,అవకాశాలు మరింత పెరుగుతాయని, అందరూ సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఏప్రిల్ 10 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు, ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ మారిన పది మంది ఎంఎల్‌ఎల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని కెసిఆర్ జోస్యం చెప్పారు.పార్టీ కమిటీల ఏర్పాటుకు ఇన్‌చార్జ్‌గా మాజీ మంత్రి హరీశ్‌రావుకు బాధ్యతలను అప్పగించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెసిఆర్ అధ్యక్షతన బిఆర్‌ఎస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో కెసిఆర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఒక్క ఎంపి సీటు కూడా రాకపోవడం పట్ల సొంత పార్టీ నేతలే ప్రతికూలంగా, పార్టీ పనైపోతుందా?అనే కోణంలో మాట్లాడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం ప్రతి సంవత్సరం పెరిగిందని,కానీ ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్ర ఆదాయం పడిపోతుందని చెప్పారు. అధికారులతో ఎలా పనిచేయించుకోవాలో కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు. సిఎంపై ఇంత తొందరగా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని తాను అనుకోలేదని,పాలనపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతోందని కెసిఆర్ ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజల కష్టాలు బిఆర్‌ఎస్‌కు మాత్రమే తెలుసని, తామే వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తామని కెసిఆర్ ధీమా

తరువాయి 2లో

## ఆలోఫ్సర్స్ నరేందర్‌రెడ్డికి

# మద్దతివ్వండి

సిపిఐ, సిపిఐ(ఎం), టిజెఎస్‌లకు కాంగ్రెస్ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో జరుగుతున్న గ్రాడ్యుయేల్స్ ఎంఎల్‌సి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, విద్యా వంతులు వి.నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని సిపిఐ, సిపిఐ(ఎం), టిజెఎస్ పార్టీలను కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్ బుధవారం సిపిఐ కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు, టిజెఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌కు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి లేఖలు రాశారు. బిఆర్‌ఎస్ నియంత పాలన, బిజెపి మతతత్వ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని మూడు పార్టీలకు లేఖలో మహేశ్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. 'మీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు మీ పార్టీలు మద్దతు ఇవ్వాలని' లేఖలో మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు.

# 5 నుంచి 13 వరకు ధర్నాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించాలని 'ఎస్‌కెఎం' పిలుపు

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా మార్చి 5 నుండి 13 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించి, జిల్లా, మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహించాలని

తరువాయి 2లో




# పన్నులపై వెనక్కి తగ్గం

- ఏ దేశానికి మినహాయింపు ఇవ్వబోం
- పరస్పరం సుంకాలు విధించే విధానానికి కట్టుబడ్డాం
- భారత్ వద్ద చాలా డబ్బుంది
- 'ఫాక్స్ న్యూస్' ఇంటర్వ్యూలో డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్:** పన్నుల విషయంలో వెనక్కి తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నొక్కిచెప్పారు. భారత్‌తో సహా ఏ దేశానికి మినహాయింపు ఇవ్వబోమన్నారు. పరస్పరం పన్నులు విధించే విధానానికి అమెరికా కట్టుబడి ఉంటుందని చెప్పారు. ఈ విధానంపై తనతో ఎవరూ వాదించలేరన్నారు. స్పేస్ ఎక్స్ అధినేత ఎలన్ మస్క్‌తో కలిసి ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా

తరువాయి 12లో

## ఢిల్లీ ముఖ్యమంత్రిగా

# రేఖాగుప్తా

నేడే ప్రమాణస్వీకారం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై కొనసాగిన ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ఎన్నికయ్యారు. పలువురి పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ.. రేఖా గుప్తా వైపే బిజెపి అధిష్ఠానం మొగ్గు చూపింది. షాలిమార్‌బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేఖాగుప్తాకు ఢిల్లీ పగ్గాలు అప్పగించడం విశేషం. బుధవారం శాసనసభాపక్షం సమావేశాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో

తరువాయి 2లో

## 10 మంది ఇజ్రాయెల్ సజీవ—నిర్జీవ
# బందీలను 22న విడుదల చేస్తాం : హమాస్






**గాజా:** సజీవులైన ఆరుగురు బందీలను, నిర్జీవులైన మరో నలుగురు ఇజ్రాయెలీ బందీలను శనివారం నాడు విడుదల చేస్తామని హమాస్ ప్రకటించింది. బందీలందరినీ విడుదల చేసేందుకు హమాస్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఇజ్రాయెల్‌లో ఉన్న బందీల కుటుంబీకులు రోజువారీ ప్రాతిపదికపై ఆ దేశంలో తీవ్రస్థాయిలో నిరసన ప్రదర్శనలు చేస్తూ ప్రధాన మంత్రి నేతన్యాహూపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో రెండో విడత కాల్పుల విరమణ ఒప్పందం అమలు తంతుపై చర్చలు జరిపేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నది. ఈ తరుణంలో హమాస్ ఒక ప్రకటన చేస్తూ, శనివారం నాడు మరో విడత బందీలను విడుదల చేస్తామని ప్రకటించింది. ఇప్పటివరకూ హమాస్ నిర్జీవులైన బందీలను విడుదల చేయలేదు.అదేవిధంగా రెండో విడత కాల్పుల విరమణ ఒప్పందంలో ప్రస్తుత తీర్మానానికి విరుద్ధంగా ఒకే విడతలో ఇటు బందీలందరినీ తాము విడుదల చేస్తామని, ఇజ్రాయెల్ కూడా ఖైదీలందరినీ ఒకేవిడతలో విడుదల చేయాలని హమాస్ ప్రతిపాదించింది. మొదటి విడతగా 45 రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం జనవరి 19వ తేదీన అమలులోకి వచ్చింది. మార్చి రెండవ తేదీతో మొదటి విడత ఒప్పందం పూర్తి అవుతుంది. ఈ లోపే రెండో విడత చర్చలకు సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రెండో విడత కాల్పుల విరమణ ఒప్పందం ఈ వారంలోనే కుదురుతుందని ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి గిడియోన్ సార్ ప్రకటించారు. కైరోలో ఈ మధ్యవర్తుల సమావేశం జరుగుతున్నది. మధ్యవర్తులు చేసిన ఒప్పందానికే హమాస్ కట్టుబడి ఉందని, ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెలే ఉల్లంఘిస్తోందనీ ఈ సందర్భంగా హమాస్ ఆరోపించింది.

**గాజా పునర్నిర్మాణానికి 53 బిలియన్ డాలర్లు కావాలి:** గాజా పునర్నిర్మాణానికి 53 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని ప్రపంచబ్యాంకు అంచనావేసింది. గాజా—ప్రపంచబ్యాంకుకు చెందిన ఇంటీరి యం రాపిడ్ డ్యామేజ్ అండ్ నీడ్స్ అసెస్‌మెంట్ (ఆర్‌డిఎన్‌ఎ) ఈ మేరకు రూపొందించిన ఒక నివేదికను ప్రపంచబ్యాంకు విడుదల చేసింది. 2023, 2024 ఆర్థిక సంవత్సరాలలో పాలస్తీనా ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని ప్రపంచబ్యాంకు ఈ అంచనా నివేదికను తయారు చేసింది. రాబోయే పదేళ్ళ కాలానికిగాను 53.2 బిలియన్ డాలర్లు అవసరమనీ, మొదటి మూడు సంవత్సరాలలో ఈ పునర్నిర్మాణానికి 20 బిలియన్ డాలర్లు అవసరమని పేర్కొంది.

# సుంకాలపై భారత్‌కు మినహాయింపులేదు : ట్రంప్



**వాషింగ్టన్ :** తనతో ఎవ్వరూ వాదనలు చెయ్యలేరని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికాతో వాణిజ్యం చేస్తున్న దేశాలపై గణనీయంగా పెంచిన సుంకా ల గురించి మాట్లాడుతూ ట్రంప్ పైవిధంగా అన్నారు. భారతదేశాన్ని కూడా ఈ విషయంలో లెక్కచేసేదిలేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఆయనకు ట్రంప్ ఈ విషయాన్ని కుండబద్దలుకొట్టినట్లు చెప్పారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయం చెప్పారు. ట్రంప్, ఎలాన్‌మస్క్ ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి పా ల్గొన్న ఉమ్మడి ఇంటర్వ్యూను ఫాక్స్‌న్యూస్ ప్రసారం చేసిం ది. ఈనెల 13న నరేంద్రమోదీని వైట్‌హౌస్‌లో కలిసేముందుగా సుంకాలపై ట్రంప్ కీలక ప్రకటన చేశారు. పలు దేశా లు విధించే సుంకాలకు అనుగుణంగానే తాము కూడా ఆదేస్థాయిలో సుంకాలు వసూలు చేస్తామని ట్రంప్ చెప్పా రు. భారత్‌కు కూడా ఈ విషయంలో మినహాయింపు లేదని మోదీని కలుసుకోవడానికి ముందుగానే ట్రంప్ స్పష్టం చేశారు. తాను మోదీకి సుంకాల పెంపు గురించి చెప్పానని ఇంటర్వ్యూలో ట్రంప్ అన్నారు. సుంకాల విషయంలో తన తో ఎవరూ వాదించలేరన్నారు. ''నేను 25 శాతం సుంకం అని చెబితే వారు దారుణం అంటారు, నేను కాదంటాను, ఎందుకంటే వారు ఎంత వసూలు చేస్తే నేనూ అంతే వసూ లు చేస్తాను'' అని ట్రంప్ అన్నారు. మొదటి విడత ట్రంప్ అధికారంలో ఉండగా 2019లో భారత్‌ను ట్రంప్ ''టారిఫ్ కింగ్''గా అభివర్ణించారు. ఎలాన్‌మస్క్ కూడా మాట్లాడు తూ, ఏ దేశమైనా 100 శాతం సుంకాలు విధిస్తే, తాము కూడా 100 శాతం సుంకాలు విధిస్తామని అన్నారు. ''మీ రు ఎంత వసూలు చేస్తే మేం అంతే వసూలు చేస్తాం'' అని మస్క్ చెప్పారు.




### బంగ్లాదేశ్ ప్రతిపక్ష నాయకురాలు
## ఖలీదాజియాకు 37 కేసుల నుండి విముక్తి



**ఢాకా :** బంగ్లాదేశ్ ప్రతిపక్ష నాయకురాలు ఖలీదా జియా మొత్తం 37 కేసుల నుండి బయటపడ్డారు. అవామీలీగ్ హయాంలో షేక్ హసీనా ప్రధానమంత్రిగా ఉండగా, ఆ తర్వాత మహ్మద్‌యూనస్ ప్రభుత్వ హయాంలో ఖలీదాజియాపై దాఖలైన 37 కేసుల నుండి ఆమె విముక్తురాలయ్యారు. ఖలీదాజియా తోపాటు ఆమె కుమారుడు, బిఎన్‌పి తాత్కాలిక అధ్యక్షుడు తారిక్ రెహ్మాన్, మరో నలుగురిపై దాఖలైన జియా అనాథల ట్రస్టు అవినీతి కేసుల నుండి ఈనెల 15వ తేదీన బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు విడుదల చేస్తూ తీర్పు చెప్పింది. గత ఏడాది నవంబరులో జియా ఛారిటబుల్ ట్రస్టుకు సంబంధించిన కేసు నుండి ఆమె విముక్తురాలయ్యారు. అంతకుముందు ఈ ట్రస్టుకు సంబంధించిన అవినీతి కేసులో దిగువకోర్టు ఖలీదాజియాకు ఏడు సంవత్సరాలు జైలుశిక్ష విధించగా హైకోర్టు ఆమెను నిర్దోషిగా విడుదల చేసింది. అవామీలీగ్ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా పలు కోర్టులలో ఆమెపై దాఖలైన ఉల్లంఘన కేసులనుండి కూడా ఆమె నిర్దోషిగా బయటపడ్డారు. ఒక రాజద్రోహం కేసు నుండి కూడా ఆమె విడుదలయ్యారు. 2007లో అవినీతి వ్యతిరేక కమిషన్ ఖలీదాజియా, మరో ఏడుగురుపై దాఖలు చేసిన నికో అవినీతి కేసు నుండి వారంతా తాజాగా బుధవారంనాడు నిర్దోషులుగా బయటపడ్డారు. అవినీతి కేసులో 2018 ఫిబ్రవరి 8వ తేదీన ఆమె జైలుకు వెళ్ళారు. సరైన వైద్యచికిత్స అందకపోవడంవల్ల 2019 ఏప్రిల్‌లో ఆమె ఆరోగ్యం దారుణంగా క్షీణించింది. మొత్తం 776 రోజుల జైలు జీవితం తర్వాత కరోనా పరిస్థితులవల్ల 2020 ఏప్రిల్ 26న ఆమెను అవామీలీగ్ ప్రభుత్వం తాత్కాలిక ఉత్తర్వుల మేరకు దేశం వదిలివెళ్ళకూడదన్న షరతులపై విడుదల చేసింది. ఐతే షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత గత నెలలో ఆమె మెరుగైన చికిత్సకోసం లండన్‌కు వెళ్ళారు.

# ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తాం



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రతిజ్ఞ చేశారు. ప్రధానంగా ఖైబర్ పంఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ రాష్ట్రాలలో ఉగ్రవాదం దారుణస్థాయిలో పేట్రేగింది. పంజాబ్ వెళుతున్న ఏడుగురు ప్రయాణికులను బర్ఖాన్‌జిల్లాలో మంగళవారం రాత్రి బస్సునుండి కిందకుదింపి కాల్చి చంపిన ఘటన అనంతరం ప్రధానమంత్రి షరీఫ్ బుధవారంనాడు ఈ మేరకు పైవిధంగా ఒక ప్రకటన చేశారు. 2022లో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిన తెహ్రిక్ ఏ తాలిబన్ ఉగ్రవాదసంస్థ విస్తారంగా హింసకు పాల్పడుతున్నది. ఉగ్రవాదులు బస్సులో ప్రయాణికుల పేర్లు తనిఖీచేసి వారిని ఎంపిక చేసి మరీ హతమార్చడంపై షరీఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం నుండి ఉగ్రవాదాన్ని సంపూర్ణంగా నిర్మూలిస్తామన్నారు. బలూచిస్థాన్ ముఖ్యమంత్రి మీర్ సర్ఫరాజ్ కూడా ఈ ఘటనకు తమదే పూర్తి బాధ్యత అన్నారు. బాధిత కుటుంబాలకు తీవ్ర సంతాపం ప్రకటించారు.

**జనంపై పన్నులు వేయకుండా ఐఎంఎఫ్ లక్ష్యాలు సాధిస్తాం**

పాకిస్థాన్ ప్రజలపై తదుపరి ఎలాంటి పన్నులభారాలూ విధించకుండానే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) లక్ష్యాలను నెరవేరుస్తామని పాకిస్థాన్ ఆర్థికమంత్రి మహ్మద్ ఔరంగజేబ్ చెప్పారు. సౌదీఅరేబియోలో బ్లూంబెర్గ్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, పాకిస్థాన్ ప్రజలపై అదనంగా ఎలాంటి పన్నులభారాలూ మోపబోమన్నారు. గల్ఫ్ దేశాల్లో కొత్తగా రూపుదిద్దుకుంటున్న మార్కెట్ వ్యవస్థపై జరుగుతున్న సదస్సులో ఆయన పాల్గొంటున్నారు. అంతకుముందురోజు సౌదీఅరేబియా నాయకులతో జరిగిన సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, వ్యూహాత్మక సంబంధాలపై ఔరంగజేబ్ చర్చించారు. ఐఎంఎఫ్‌తో పాకిస్థాన్ ఏడు బిలియన్ డాలర్ల రుణ ఒప్పందం చేసుకుంది.

### బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు
## బోల్సొనారోపై కుట్ర కేసు



**బ్రెసిలియా :** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో (69) పై కుట్రకేసు నమోదైంది. 2022లో జరిగిన ఎన్నికల్లో ఆయన పరాజయం పాలయ్యారు. ఐతే ఈ ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ఆయన కుట్రకు పాల్పడ్డారని బ్రెజిల్ చీఫ్ ప్రాసిక్యూటర్ ఆయనపై ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయనపై కుట్ర కేసు నమోదైంది. ఆయన స్థానంలో ఎన్నికల్లో విజేతగా నిలిచిన లూయిస్ ఇనాసియో లులా డసిల్వాను దేశాధ్యక్ష పదవీ బాధ్యతలు తీసుకోనివ్వకుండా బోల్సొనారో అడ్డుకున్నారనీ, కుట్ర యత్నాలు చేశారని మొత్తం ఆరో ఆరోపణలపై కేసులు ఆయనపై నమోదయ్యాయి. లులా డసిల్వాకు విషం ఇచ్చి చంపేందుకు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండీ డీ మారయిస్‌ను కాల్చి చంపేందుకు ఆయన కుట్ర చేశారని కేసులు నమోదు చేశారు. ఐతే తనను రాజకీయంగా బలిపశువును చేస్తున్నారనీ, అన్యాయంగా తనపై అభియోగాలు మోపుతున్నారని బోల్సొనారో వాదించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినందుకుగాను ఆయనను ఎనిమిది సంవత్సరాలపాటు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించారు.

### పనామాలో 300 మంది
## అమెరికా బహిష్కృతులు

**పనామా:** అమెరికా వెళ్ళగొట్టిన 300 మంది వలస ప్రజలు పనామాలో ఆశ్రయం పొందుతున్నారు. వీరందరినీ పనామా ప్రభుత్వం ఒక హోటల్‌లో ఉంచింది. ఐతే వీరిని పనామా ప్రభుత్వం నిర్బంధించిందని వచ్చిన వార్తలను పనామా భద్రతామంత్రి ఫ్రాంక్ అబ్రెగో ఖండించారు. ఇటీవల అమెరికా చేసుకున్న ఒప్పందం మేరకు వీరిని ఎక్కడికీ కదలకుండా పనామా ప్రభుత్వం మర్యాదలు చేస్తూ హోటల్‌లో అక్రమ వసల ప్రజలకు బస ఏర్పాటు చేసింది. వీరిలో ఎక్కువమంది ఆసియా దేశాలకు చెందినవారే. ఇరాన్, భారత్, నేపాల్, శ్రీలంక, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, చైనా తదితర దేశాలకు చెందినవారు వీరిలో ఉన్నారు. ఐతే అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా వారిని తరలించేందుకు బయటకు వెళ్ళకుండా పనామా ప్రభుత్వం వారిని కాపలా కాస్తోంది. ఐతే వీరిలో 40 శాతంమంది వలస ప్రజలు తమ తమ సొంత దేశాలకు వెళ్ళేందుకు ఇష్టపడటంలేదని అబ్రెగో చెప్పారు. కానీ వారంతా హోటల్ రూములలో ఉండిపోయి సహాయం చెయ్యాలంటూ అందరికీ సందేశాలు పంపిస్తున్నారు. వారికి వైద్య సహాయం ఇస్తున్నామని, ఆహారం ఇస్తున్నామనీ, అమెరికాతో తమకున్న ఒప్పందం ప్రకారం తమ విధులు నిర్వహిస్తామని, వీరిని పోషించే బాధ్యత తమదైనాగానీ, నిధులు మాత్రం అమెరికా ప్రభుత్వమే సమకూరుస్తోందని ఫ్రాంక్ అబ్రెగో చెప్పారు. వీరందరినీ వారి వారి దేశాలకు పంపేందుకు ఒక వంతెనలాగా తాము పాత్ర నిర్వహించేందుకు పనామా ప్రభుత్వం అంగీకరించింది. వారికి పోలీసు కాపలా ఉంచామని, వారు గదులలోంచి బయటకు వెళ్ళేందుకు ఎలాంటి అనుమతీ లేదని, ఐతే కఠిన నిబంధనలు వారిపై విధించలేదని చెప్పారు.

## తాత్కాలిక భవనంలో పాఠశాల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టిసావర్గాం పంచాయతీ దుబ్బగూడలో దాజీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వెంటనే స్థానికంగా అందుబాటులో ఉన్న తాత్కాలిక భవనంలో పాఠశాల నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని విద్యా శాఖాధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ''బడి షెడ్డులో సగం.. గుడిలో సగం'' అని దాజీనగర్ ప్రభుత్వ పాఠశాల పరిస్థితిపై వచ్చిన వార్తలపై సిఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. దాజీనగర్ ప్రభుత్వ పాఠశాల పరిస్థితిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. కనీస వసతులు లేని చోట పాఠశాల తరగతి గదుల నిర్వహణపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అదిలాబాద్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దాజీనగర్ ప్రభుత్వ పాఠశాల పరిస్థితిపై పూర్తి నివేదిక తెప్పించుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దుబ్బగూడ పాఠశాలకు సంబంధించి శాశ్వత ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ప్రత్యేక సమావేశం (మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్ల కు బిల్లు, విద్యా, ఉద్యోగాల్లో కూడా బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు రెండు బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. మొత్తం మూడు బిల్లుల ముసాయిదా రూప కల్పనలో అధికారులు ఇప్పటికే తలమునకలు అయ్యారు. త్వరలోనే కేబినెట్ భేటీ ఏర్పాటు చేసి ముసాయిదాకు తుది రూపు ఇచ్చి, తదుపరి రోడ్ మాప్ ఖరారు చేయనుంది. అసెంబ్లీ ఆమోదం తర్వాత మూడు చట్టాలను కేంద్ర ఆమోదం కోసం రాష్ట్రప్రభుత్వం పంపనుంది. కాగా, మార్చి మూడో వారంలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

## 13 వరకు ధర్నాలు (మొదటి పేజీ తరువాయి)

సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఎస్‌కెఎం రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, పశ్య పద్మ, వి.ప్రభాకర్, జక్కుల వెంకటయ్య, కెచ్చెల రంగయ్య, ఆర్.వెంకట్ రాములు, నాగిరెడ్డి, కొండల్, నరసింహలు తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించిందని, మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను తీసుకురావడం అన్యాయమని వారు విమర్శించారు. పశ్య పద్మ మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లును రైతు సంఘాలతో చర్చించకుండా పార్లమెంటులో ప్రవేశపెట్టబోమని రాతపూర్వకంగా హామీ ఇచ్చి హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులలో కోత విధించిందని, ఎరువుల సబ్సిడీని తగ్గించిందని, ధరల స్థిరీకరణ నిధిని పెంచలేదని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతాంగానికి ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. టి.సాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు ప్రజాసంఘాలు, మేధావులు భాగస్వాములు కావాలని కోరారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని, పార్లమెంటులో దానిని వ్యతిరేకించాలని కోరుతూ రాష్ట్రంలో ఉన్న ఎంపిలకు, ఎంఎల్‌ఎలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో సేకరిస్తున్న భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పని పద్మ సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ప్రభులింగం, మదన్ రెడ్డి, బి.రాము, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలోకి వస్తామని కెసిఆర్ పగటికలలు

### గులాబీ భాస్ ఒక సీజనల్ పొలిటీషియన్
### కెసిఆర్ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''మళ్ళీ అధికారంలోకి వస్తామని బిఆర్‌ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు పగటి కలలు కంటున్నారు. కెసిఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్. సుమారు 14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న వ్యక్తికి అభివృద్ధి ఎలా కనబడుతుంది'' అని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. బిఆర్‌ఎస్ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీపై కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్లు ఫాంహౌస్ దాటని కెసిఆర్ దొర అధికారంపై పగటికలలు కంటున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోగానే తనకు పదేళ్లు అధికారం కట్టబెట్టిన ప్రజలను మరిచిపోయి అజ్ఞాతంలోకి వెళ్లిన కెసిఆర్‌కు 14 నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి ఏ విధంగా కనబడుతుందని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ అని, ఎన్నికలప్పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారని, 14 నెలల నుంచి ఫాంహౌస్ దాటని ఆయన స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మేడిగడ్డ కుంగినప్పుడు గాని, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు గాని ఆయనకు ప్రజలు గుర్తుకురాలేదని, శాసనసభలో కీలకమైన తీర్మానాలు, కులగణన, ఎస్‌సి వర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం కూడా కెసిఆర్ హాజరుకాలేదని మంత్రి విమర్శించారు. తెలంగాణ ప్రజలు కష్టపడి కెసిఆర్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెడితే, ఆయన ఏనాడు ప్రజాతీర్పును గౌరవించలేదని, అసెంబ్లీ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షనేత అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలని, కానీ కెసిఆర్ తాను ప్రజలకు జవాబుదారీ కాదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారన్నారు. కెసిఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమన దిశలోకి తీసుకెళ్లారు, పదేళ్లలో ఆయన చేసిన నిర్వాకాలను తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 14 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని సవివరంగా కెసిఆర్ ముందుంచుతామన్నారు. కాంగ్రెస్ భవిష్యత్ గురించి కాకుండా ముందుగా కెసిఆర్ తన భవిష్యత్తు, తన పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుంటుందని మంత్రి సూచించారు. కెసిఆర్ భవిష్యత్తుపై గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, పార్లమెంటు తీర్పే భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంటుందన్నారు. కెసిఆర్ త్వరలో ఉప ఎన్నికలు వస్తాయని అంటున్నారని, ఐదేళ్ళ వరకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశమే లేదని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బిఆర్‌ఎస్ ఉనికి ఉండదని, అందుకే కెసిఆర్ ఇలాంటి సమాచారాన్ని ఇస్తున్నారన్నారు. కేవలం బిఆర్‌ఎస్ కార్యకర్తలను ఉత్తేజ పర్చడానికే కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, ఆయనకు చిత్తశుద్దే లేదని, చిత్తశుద్ధి ఉంటే ప్రతిపక్ష నాయకునిగా అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలు చర్చించే వారన్నారు.

## రేఖాగుప్తా..! (మొదటి పేజీ తరువాయి)

సిఎల్‌పి లీడర్‌గా రేఖా గుప్తాను ఎన్నుకున్నారు. ఆమె గురువారం మధ్యాహ్నం 12.35 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. చాలా సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి రాగా.. ముఖ్యమంత్రి పదవి కోసం కీలక నేతలు పోటీపడ్డారు. పర్వేష్ వర్మ సైతం ముఖ్యమంత్రి రేసులో నిలిచారు. అలాగే, జితేంద్ర మహాజన్ సైతం ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడ్డారు. ఇక చివరకు సామాజిక సమీకరణలు, ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం ఉన్న బినోయ్ సామాజిక వర్గానికి చెందిన రేఖ గుప్తా వైపు అధిష్టానం మొగ్గు చూపినట్లు సమాచారం. డిప్యూటీ సిఎంగా ప్రవేశ్ వర్మ, విజేంద్ర గుప్తాను అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నుకోనున్నట్లు సమాచారం. రేఖాగుప్తా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్ బాగ్ అసెంబ్లీ స్థానం గెలుపొందారు. ఆమె గతంలో ఢిల్లీ మేయర్‌గా పోటీ చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కొనసాగారు. ఢిల్లీ పీతంపురా కౌన్సిలర్.. ఆ తర్వాత మేయర్‌గా పని చేశారు. గతంలో ఎమ్మెల్యేగా, ఎంపిగా పని చేసిన అనుభవం లేకపోయినా.. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నది. విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టి.. సిఎం స్థాయి వరకు ఎదిగారు. పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్‌బీ కార్పొరేటర్‌గా పని చేశారు. షాలీమార్ బాగ్ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బిజెపి నుంచి పోటీ చేసి.. ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో పరాజయం పాలయ్యారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో బందనకుమారిని 29వేల ఓట్లకుపైగా తేడా ఓడించి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. రేఖా గుప్తా ప్రస్తుతం ఢిల్లీ బిజెపి ప్రధాన కార్యదర్శిగా, బిజెపి మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. ఆమె 1974లో హర్యానాలోని జింద్ జిల్లాలోని నంద్‌గఢ్ గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి. రేఖ కుటుంబం 1976లో ఢిల్లీకి మకాం మార్చింది. రేఖ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య ఢిల్లీలోనే పూర్తి చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో.. ఆమె దౌలత్ రామ్ కళాశాలలో కార్యదర్శి ఎన్నికల్లో గెలుపొందారు. 1995—96లో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. రేఖగుప్తా ఎల్‌ఎల్‌బి పూర్తి చేశారు. 2003—04లో ఆమె బిజెపి యువ మోర్చా ఢిల్లీ యూనిట్‌లో చేరి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2010లో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్ బాగ్ స్థానం పోటీ చేసి ఓడిపోయారు.

## అనుమతులివ్వండి (మొదటి పేజీ తరువాయి)

50 సంవత్సరాల వేసులుబాటుతో రుణాలు అందించే అంశాన్ని కేంద్రం పరిశీలనలో ఉందన్నారు.. పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (పిఆర్‌ఎల్‌ఐఎస్),సీతారామ సాగర్ ప్రాజెక్ట్, సమ్మక్క సాగర్ ప్రాజెక్టలకు నిధులు మంజూరు చేయాలని, పిఆర్‌ఎల్‌ఐఎస్‌ను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, పూర్తి నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశామన్నారు. దీనిపైన కేంద్ర కార్యదర్శి ముఖర్జీ స్పందిస్తూ తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం నుండి సున్నా శాతం వడ్డీతో 50 ఏళ్ల రుణ విరామంతో నిధుల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపినట్టు ఉత్తమ్ వివరించారు.మూసీనది శుద్ధి, పునరుద్ధరణ, గోదావరిమూసీ లింక్ అభివృద్ధికి సహాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, ఈ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను గుర్తించి తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీనిచ్చినట్టు ఉత్తమ్ తెలిపారు. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) నిర్వహిస్తున్న మెడిగడ్డ ప్రాజెక్ట్ ఘటనపైన విచారణ ఒక సంవత్సర కాలంగా కొనసాగుతుందని, తక్షణమే దీనిపైన నివేదికను విడుదల చేసి, తదుపరి చర్యల కోసం సిఫార్సులను అందించా లని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం సూచించిన విధంగా, వరల్డ్ బ్యాంక్ సహకారంతో అందిస్తున్న డ్యామ్ రిహా బిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (డిఆర్‌ఐపి) నిధులను నాగార్జునసాగర్,శ్రీశైలం ఆనకట్టల మరమ్మతులకు, అలాగే తెలంగాణలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నదీ పరిరక్షణ, మట్టి నిక్షేపాల తొలగింపునకు వినియోగించాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. సాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తవ్వడానికి రెండు రోజుల రాజస్థాన్ సదస్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు.

**నల్లగొండ, ఖమ్మం రబీ పంటనీటిని అక్రమంగా వాడుకుంటున్నారు:** నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలకు చెందిన పూర్వ నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో రబీ పంటను కాపాడేందుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వ జోక్యం అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. భవిష్యత్తులో వివాదాలను నివారించడానికి, పారదర్శకతను మెరుగుపరచడా నికి శ్రీశైలం,నాగార్జున సాగర్ ఆనకట్టల్లో, అలాగే కృష్ణానదిపై మొత్తం 35 ప్రాంతాల్లో టెలిమెట్రీ వ్యవస్థలను అమలు చేయాలన్నారు. ఈ వ్యవస్థలు నీటి వినియోగాన్ని రియల్‌టైమ్‌లో గమనించేందుకు, కేటాయించిన వాటాను పాటించేలా చేయడంలో ఉపయోగపడతాయన్నారు.

## అందరూ కష్టపడాలి (మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. అక్టోబర్, నవంబర్‌లో బిఆర్‌ఎస్ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. త్వరలోనే మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అనుబంధ సంఘాల పటిష్టత కోసం సీనియర్ నాయకులతో సబ్ కమిటీలు వేయనున్నట్లు కెసిఆర్ తెలిపారు.

**డబ్బాలొద్దు..వాస్తవాలు చెప్పండి..?**

కాగా ఈ సమావేశంలో కెసిఆర్ ప్రసంగం ముగిసిన తర్వాత ఆయన పలువురు నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు నాయకుల మాట్లాడగా ' డబ్బాలు కొట్టవద్దని. వాస్తవాలను చెప్పాలని''వారికి కెసిఆర్ సూచించినట్టు సమాచారం. అనంతరం పార్టీ బలోపేతానికి, ప్రస్తుతం చేయాల్సిన కార్యచరణపై పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కాగా సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఉద్యమ చరిత్ర, బిఆర్‌ఎస్ పార్టీ ప్రస్థానంపై వ్యాసాలు, డాక్యుమెంటరీలను రూపొందించాలని కెసిఆర్ సూచించారు. ఇదిలా ఉండగా ఏడు నెలల విరామం తరువాత కెసిఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చారు.

**ఏడాది పాటు బిఆర్‌ఎస్ రజతోత్సవాలు : కెటిఆర్**

బిఆర్‌ఎస్ రజతోత్సవాలను ఒక సంవత్సరం పాటు నిర్వహించాలని నిర్ణయించినట్టు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కెటి.రామారావు వెల్లడించారు. ఈ ఉత్సవాల నిర్వహణ నిమిత్తం ఉద్యమకారులు, పార్టీ ముఖ్య లతో పలు కమిటీలను వారం రోజుల్లో ప్రకటిస్తామన్నారు. బిఆర్‌ఎస్ కార్యవర్గ విస్తృత సమావేశ వివరాలను కెటిఆర్ బుధవారం మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్ రెండో వారంలో హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్ ప్రతినిధుల సమావేశాన్ని, ఏప్రిల్ 27న బహిరంగ సభను నిర్వహిస్తామని, దీనికి సంబంధించి తేదీ, వేదికను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఒక వైపు రజతోత్సవ సంబరాలను నిర్వహిస్తూనే పార్టీ నిర్మా ణం, ప్రజా పోరాటాలను చేస్తామన్నారు. తాగునీరు, కరెం టు సమస్య, విద్య, వైద్యం అందించడంలో జరుగుతున్న లోపాల పై పార్టీ సమావేశంలో విస్తృతంగా చర్చించినట్టు ఆయన వివరించారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించేందుకు రాష్ట్ర ప్రభు త్వం కేంద్రంతో పోరాడకుంటే బిఆర్‌ఎస్ తరఫున తమ కార్యచరణను ప్రకటిస్తామని అన్నారు. ఎనిమిది మంది బిజెపి ఎంపిలు ఉన్నప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నయా పైసా తీసుకురాలేదని మండిపడ్డారు. ఈ ఏడాది మొత్తం బిఆర్‌ఎస్ విస్తృత కార్యక్రమాలలోనిమగ్నమవుతోందన్నారు.కాంగ్రెస్ పార్టీకి బిసిల పట్ల నిజంగానే ప్రేమ ఉంటే 42 శాతం రిజర్వేషన్ ను ఎలా ఇస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## 25 శాతం రాయితీ (మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు. ఒక లే అవుట్‌లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి, మిగిలిపోయిన 90 శాతం ప్లాట్ లకు ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్‌కు అవకాశం కల్పించారు. వీరు కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31 లోగా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటే 25 శాతం రాయితీ కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు. పేద ప్రజలు, గత నాలుగు సంవత్సరాల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం గురించి ఎదురు చూస్తున్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఈ పథకాన్ని రోజువారీగా సమీక్షించి నిర్ణయించారు.ఎల్‌ఆర్‌ఎస్ అమలులో భాగంగా పలు వెసలుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం క్రమబద్ధీకరణ వర్తించదని, వీటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రులు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజేషన్ కోసం సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దనే చెల్లింపులు చేసి ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పురపాలక పట్టణ అభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకలే కమ్యూనిస్టులు

గత ప్రభుత్వ బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లించాలి

వార్డు స్థానం నుంచి ఢిల్లీ వరకూ బలోపేతం కావాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** చట్టసభల్లో కమ్యూనిస్టులే ప్రశ్నించే గొంతుకలుగా గళం విప్పుతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో బుధవారం సిపిఐ మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డు స్థానం నుంచి ఢిల్లీ వరకు సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. సిపిఐ ఆవిర్భవించి 99 ఏళ్లు గడిచిందని, అన్ని పార్టీలకు కమ్యూనిస్టులే దిక్సూచి అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం గంపై చట్టసభల్లో ఎంపి, ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేస్తున్నారని, ఇంకా రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరస్తులు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించడంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోతుందన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని రూ.146లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని విమర్శించారు. ప్రజలను చైతన్య పరిచేందుకు సిపిఐ అనుబంధ సంఘాలు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆదాయం తగ్గుముఖం పట్టిందని, పన్నులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యలో వచ్చే ఆదాయంతోనే సంక్షేమ పనులకు నిధులు కేటాయించడం బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నందున లౌకిక ప్రజాస్వామ్యవాదులైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిపిఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జగిత్యాల జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, ఎఐటియుసి జిల్లా నేత కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షు డు బ్రాహ్మణపల్లి యుగంధర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, మండల సహాయ కార్యద ర్శి కన్నం సదానందం, తాడవేణి రవి, లక్ష్మ ణ్, పిట్టల తిరుపతి, రామస్వామి, రాజేశ్వరి, రజిత తదితరులున్నారు.

## రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఎ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులివ్వాలి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఎ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో విఆర్ఎ జెఎసితో చర్చలు జరిపి జిఓ నెంబర్ 81, 85 విడుదల చేసిందని, ఆ జిఓల ప్రకారం 20,555 మంది విఆర్ఎలలో డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్‌గా, ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్‌గా, పదవ తరగతి లోపు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేట్స్, రెవెన్యూ శాఖతో పాటు, మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యా, వైద్య తదితర శాఖల్లో ఉన్న ఖాళీల్లో 16,758 మంది విఆర్ఎలను ప్రభుత్వం సర్దుబాటు చేసిందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. వయసు పైబడి ఎలాంటి విద్యార్హతలు లేని 3,797 మంది విఆర్ఎ వారసులకు ప్రభుత్వం ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. 20,555 మంది చేసే రెవిన్యూ పనులను ప్రస్తుతం 3,797 మంది విఆర్‌ఎలు చేస్తున్నారని, వయస్సు రీత్యా అనారోగ్యంపాలైన తండ్రుల స్థానంలో వారి వారసులు కొందరు విఆర్ఎలుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నూతన ప్రజా ప్రభుత్వంలో వయస్సు పైబడిన విఆర్ఎల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చి దళిత, బలహీనవర్గాలకు చెందిన అట్టడుగువర్గాల విఆర్ఎల కుటుంబాలను ఆదుకోవాలని చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




# హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం

తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేసింది. యూనియన్ ఏడు రోజులు నిరవధిక సమ్మెకు ప్రభుత్వం దిగివచ్చి హమాలీ రేట్లు పెంచుతూ జిఓ విడుదల చేసిన నేపథ్యంలో పోరాట విజయోత్సవ సభ బుధవారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సభకు సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మునీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య అధ్యక్షత వహించగా, ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ప్రసంగించారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులు ప్రతి రెండేళ్లకు ఒకసారి హమాలీ రేట్లు పెంచేందుకు అంగీకరించినా గత ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కివేశాయని విమర్శించారు. అన్ని మండల పాయింట్లలలో సొంత గోదాములు నిర్మించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని కోరారు. మండల పాయింట్లలలో సొంత గోదాములు కట్టి మంచినీరు, విశ్రాంతి గదులు, మరుగు దొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాల్‌రాజ్ మాట్లాడుతూ హమాలీ కార్మికులు సమ్మె చేస్తుంటే సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సమ్మెను అనిచివేసేందుకు వలస కార్మికులను తీసుకొచ్చి అన్ని మండల పాయింట్లలలో పనిచేయించే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. చట్ట ప్రకారం 14 రోజుల ముందు సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేసే ఆ సమ్మెను అనిచివేసే ప్రయత్నం చేయటం కూడా నేరమే అవుతుదని వారు తెలిపారు. హమాలీ కార్మికుల 7 రోజుల సమ్మె తర్వాత పెరిగిన హమాలీ రేట్లు కొన్ని కార్మిక సంఘాలు సమ్మె చేయకుండా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండి కార్మిక ద్రోహులుగా నిలబడ్డారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి. ఇమ్రాన్, యూనియన్ జిల్లాల నాయకులు బాల్‌రాజ్ (కామారెడ్డి), గోర నర్సింహ్మా (యాదాద్రి భువనగిరి), దేవేందర్ (నిజామాబాద్), రమణయ్య(కొత్తగూడెం), అఫ్రోజ్ (అదిలాబాద్), సత్యనారాయణ (మంచిర్యాల), రమేష్ (ములుగు), పుండరి (నిర్మల్), వెంకన్న (నల్గొండ), జకరయ్య(మహబూబాబాద్ ) తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్

బిసి హక్కుల సాధన సమితి డిమాండ్




**ప్రజాపక్షం / హైదరాబాద్:** దేశ జనగణనలో ఓబిసి కులగణన జరపాలని, చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఐక్య పోరాటాలు నిర్వహించాలని బిసి హక్కుల సాధన సమితి పిలుపునిచ్చింది. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సమితి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయ నాయుడు, కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, నేదునూరి రాజమౌళి, లొడంగి శ్రవణ్‌కుమార్, బొడ్డుపల్లి కృష్ణ, ఏశాల అశోక్, సిహెచ్. దశరథ్, పెరుగు కుమార్, చింతకింది కుమారస్వామి, విజయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా శాసనసభ సమావేశాలు నిర్వహించి జనాభా ప్రాతిపదికన బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదించి కేంద్రానికి వెంటనే పంపాలని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించి చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధాని మోదీ బిసి అని మాటిమాటికి చెప్పే రాష్ట్ర బిజెపి నాయకులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిసిల డిమాండ్స్‌ను ఆమోదించనట్లయితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో ప్రకటించిన బిసి డిక్లరేషన్ లోని హామీలన్నింటిని అమలు చేయటనట్లయితే బిసిల విశ్వాసనీయతను కోల్పోవలసి వస్తుందని హెచ్చరించారు.

# మాజీ కౌన్సిలర్ భర్త దారుణహత్య

కత్తులతో దాడి చేసిన దుండగులు

అక్కడికక్కడే మృతి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు కౌన్సిలర్ నాగవల్లి సరళ భర్త నాగవల్లి రాజలింగమూర్తిని గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. ఈ ఘటన బుధవారం పట్టణంలోని రెడ్డి కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... భూపాలపల్లి మెయిన్ రోడ్డులోని ద్విచక్ర వాహనంపై లింగమూర్తి వెళ్తుండగా టిబిజికెఎస్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి విచక్షణ రహితంగా హత్య చేశారు. దాంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని హుటాహుటిన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజలింగమూర్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నాగవెల్లి రాజలింగ మూర్తి సామాజిక కార్యకర్తగా అనేక సమస్యలపై ఉద్యమించేవాడని, అదే విధంగా రాష్ట్రంలో సంచలనం రేపిన కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేసు వేసి సంచలనం సృష్టించిన వ్యక్తిగా ఆయనకు పేరు ఉంది. మృతునికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయనను ఎవరు హత్య చేశారనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దుండగులు ఎవరు, ఎక్కడి ప్రాంతంలో వారు అనేది తెలియాల్సి ఉందని, హత్యకు కారణమైన దుండగులను వెంటనే గుర్తించి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నరేష్ కుమార్ తెలిపారు.



# సాగర్ అడవిలో కార్చిచ్చు

- ఇంకా చెలరేగుతున్న మంటలు..
- కిలోమీటర్ల మేర సగం అడవి దగ్ధం...
- స్పందించని అధికారులు



**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మునిసిపాలిటీ పరిధిలోని స్థానిక పైలాన్ కాలనీ వద్ద ఉన్న చింతలపాలెం రోడ్డు నుంచి పైలాన్ కాలనీ వరకు ఉన్న నాగార్జునసాగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం నుంచి ఒక కిలోమీటరు మేర ప్రాంతం వరకు కార్చిచ్చు అలుముకుంది దీనితో సుమారు 20 ఎకరాల్లో అటవీ ప్రాంతం సగానికి పైగా దగ్ధం అయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం బుధవారం ఉదయం అకస్మాత్తుగా చింతలపాలెం రోడ్డు నుంచి పైలన్ కాలనీ వద్ద ఉన్న సమీపంలోని అడవిలో మంటలు వ్యాపించాయని అవి బుధవారం సాయంత్రం వరకు కొనసాగుతూనే ఉన్నాయని ఇప్పటివరకు ఎవరూ స్పందించలేదని తెలిపారు.అప్పటికే 20 ఎకరాల్లో సగానికి పైగా చెట్లతోపాటు ఏపుగా పెరిగిన ఎండుగడ్డి కాలిపోయింది వాటికి అతి సమీపంలోనే పక్క ఊర్లకు కరెంటు సప్లై చేసే హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు వైర్లు ఉండటంతో గాలి వాటం ఎక్కువగా ఉండటంతో మంటలు అక్కడి వరకు వ్యాపిస్తే పెనుముప్పు తప్పేటట్టు లేదు. మూగ జీవాలను మేపడానికి అటవీ ప్రాంతంలోకి వచ్చిన వ్యక్తులు సిగరెట్, బీడీలను కాల్చివేయడంతో ఈ సంఘటన జరిగి ఉండవచ్చని అడవిలో గతంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడూ జరగలేదని, ఇలా జరగటం ఇదే మొదటి సారి అని స్థానికులు తెలిపారు పరిస్థితి అదుపులోకి తీసుకువస్తామని అటవీశాఖ అడవిలో చెలరేగిన మంటలపై తమకి ఇప్పటివరకు ఎవరూ సమాచారం ఇవ్వలేదని, బుధవారం సాయంత్రం స్థానికులు సమాచారం ఇవ్వటంతో వెంటనే ఘటనా స్థలికి బయలుదేరి మంటలను అదుపులోకి తీసుకొస్తామని అన్నారు.

# ఛత్రపతి శివాజీ ప్రగతిశీల, లౌకిక పాలకుడు

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అన్ని మతాలను ఆదరించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ అత్యంత ప్రగతిశీల, లౌకిక పాలకుడని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి నరసింహ కొనియాడారు. మొఘలులపై అనేక యుద్ధాలను చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ యుద్ధం కేవలం రాజకీయ యుద్ధం అని, దీనికి మతంతో సంబంధం లేదని, ఆయన లౌకిక భావాలు కలిగిన రాజు అని, ఎప్పుడు ముస్లింలపై యుద్ధాలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. శివాజీ చరిత్రను నాశనం చేయడానికి, వక్రీకరించడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి కుట్రలు పన్నుతూ శివాజీ ముస్లిం వ్యతిరేక రాజుగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 395 జయంతి ఉత్సవాలు సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఈ.టి.నరసింహతోపాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శి బి.స్టాలిన్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం తదితరులు ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇటి నరసింహ మాట్లాడుతూ శివాజీ రాజు కేవలం హిందూ రాజు అయినందునే ప్రజాదరణ పొందలేదని, ఆయన ప్రాధాన్యత సామాన్య ప్రజల సంక్షేమం అయినందునే ప్రజాదరణ పొందారని నరసింహ వివరించారు. శివాజీ న్యాయం కోసం పోరాడారని, మహిళలకు భద్రత కల్పించారని, స్వరాజ్య కల సాకారం కావడానికి కులం, మతంతో సంబంధం లేకుండా సంక్షేమం కోసమే పాటుపడ్డారని నరసింహ వివరించారు. శివాజీ చరిత్రలో, ఆయన ఆలోచనలలో, ఆచరణలో చాలా ఉందని, ఆయన లక్ష్యం, విజయాల వెనుక అన్ని మతాలకు చెందిన స్ఫూర్తిదాయక శక్తులు ఉన్నాయని, ఇవన్నీ సరిగ్గా అర్థం చేసుకుని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఇటి.నరసింహ కోరారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర




రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగ హామీల అమలుకు నిధులు కేటాయించాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** దేశంలో బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం, యుజిసి ప్రతిపాదనలతో విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి, కాషాయికరీణ, ప్రైవేటీకరణ చేసే కుట్రలను విద్యార్థులను తిప్పికొట్టాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగ హామీల అమలుకు నిధులు కేటాయించాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వని, తెలంగాణ యువతకు కేంద్రం నుండి ఎలాంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించని తెలంగాణ విద్యార్థి, యువత పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నా బిజెపిని పట్టభద్రుల ఎన్నికల్లో విద్యార్థులు, యువత ఏకం అయి ఓడించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా జనరల్ బాడీ సమావేశం కుర్ర రాకేష్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో జరుగగా, ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రజా ప్రభుత్వం ఏర్పడి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. అలా గే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటు వంటి గురుకులాలు పక్క భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కేజిబివి పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలన్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా కుర్ర రాకేష్, నూతన జిల్లా కార్యదర్శిగా మంద అనిల్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు పెండెల ఆదిత్య, మల్యాల శ్రీజ, పుట్టి సాత్విక్, సహాయ కార్యదర్శులు మల్లమరి జాషువా, పెంట భరత్, కుక్కల నివాస్, కమిటీ సభ్యులు మేఘన, మమత, అఖిల, రేవతి, దొంతి, అరుణ్, పల్లి శ్రీకాంత్, రామ్, నవదీప్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయవాదికి ఐఎఎల్ నివాళి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** హైకోర్టు న్యాయవాది పసునూరు వేణుగోపాలరావు హైకోర్టులో గుండెపోటుతో కుప్పకూలి మరణించడం పట్ల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్) దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. హైదరాబాద్ చింతల్‌కుంటలోని ఆయన నివాసంలో వేణుగోపాలరావు భౌతికకాయానికి ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, నాయకులు కె.వి.ఎల్. నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వేణుగోపాలరావు నిబద్ధత కలిగిన, అనుభవశాలి అయిన న్యాయవాది అని కొనియాడారు. తాను నల్లగొండ, మిర్యాలగూడలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న రోజుల్లో అక్కడ కోర్టుల్లో న్యాయవాద వృత్తిలో ఉండేవారని, బార్ అసోసియేషన్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, అందరితో వివాదరహితంగా వ్యవహరించేవారని గుర్తు చేశారు. ఆయన ఆకస్మిక మరణానికి ముందు రోజే తాము కలుసుకున్నామని, మరుసటి రోజు మరణించడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. వేణుగోపాల్ రావు కుటుంబసభ్యులకు ఐఎఎల్ పక్షాన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# శివాజీ జయంతి ఉత్సవాల్లో అపశృతి

విద్యుద్ఘాతానికి గురై ఒకరు మృతి

సిద్ధిపేట జిల్లా జబ్బాపూర్‌లో విషాదఛాయలు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో భాగంగా వర్గల్ మండలం జబ్బాపూర్‌లో అపశృతి చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసి కాషాయ రంగు జెండా ఎగరవేయటానికి లింగ ప్రశాంత్ (22)తో పాటు మరి కొంత మంది యువకులు ఏర్పాట్లు చేశారు. కాగా ఉదయం 11:35 గంటలకు జెండాను ఇనుము పైపుకు కట్టి లింగ ప్రశాంత్, వల్లపు బన్నీ, కొంతం వేణు , కొంతం కనక రాజు, లింగ గణేష్, దెశెటి కరుణకర్, లింగ మహేష్ తదితరులు జెండా పైపు పట్టుకుని పైకి లేపగా, ఇనుము పైపు ప్రమాదవశాత్తూ దగ్గరలోని విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో వారు విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే వీరిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, లింగ ప్రశాంత్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్ర గాయాలకు గురైన కరుణాకర్‌ను మెరుగైన చికిత్స కోసం స్థానిక నాగమునయ్య ఆస్పత్రికి తరలించారు. మిగతా వారి ఆరోగ్యము నిలకడగా ఉందని ఎస్ఐ కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొనగా, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

NIT No. 10/CTO/GHMC/2024-25 'ఇ' ప్రకటన తేది: 19.02.2025

పని పేరు: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జిహెచ్ఎంసిలోని పారిశుద్ధ్యం, ఎంటమాలజీ మరియు పశువైద్య విభాగాల అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వ్యక్తిగల రక్షణ పరికరాల (పిపిఇ) కిట్ల సేకరణ (ప్యాకేజ్ 1 నుండి 14 వరకు). బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది & సమయం: 20.02.2025న ఉ.11.00గం.ల నుండి, ఆఖరి తేది & సమయం: 01.03.2025న ఉ.11.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఒ/ఒ. చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, 4వ అంతస్తు, జిహెచ్ఎంసి, హెడ్ క్వార్టర్, ట్యాంక్ బండ్, హైదరాబాద్. శ్రీ ఎస్.శ్రీనివాస్, జిహెచ్ఎంసి. సంప్రదించవలసిన మొబైల్ నం. 9704456422. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 10420-PP/CL/ADVT/1/2024-25, Date: 19-02-2025

ప్రజాపక్షం
గురువారం, ఫిబ్రవరి 20

# ప్రమాదం అంచున న్యాయవ్యవస్థ!

కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల గౌరవంగానీ, న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసంగానీ లేదని మరోసారి రుజువైంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తునే ఉంది. హడావుడిగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి) నియామకాన్ని చేపట్టడమే నిదర్శనం. సిఇసితోపాటు మరో ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు (ఇసి)ను ఎంపిక చేసే ప్యానెల్‌లో ఎవరెవరు ఉండాలన్న ప్రశ్నకు ఇంకా సమాధానం లేదు. 2023 డిసెంబర్‌లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్షన్ కమిషన్ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సుప్రీం కోర్టు ఈ కేసును మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది. అయితే, సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎలక్షన్ ప్యానెల్ కూర్పుపై సుప్రీం కోర్టు ధర్మాసనం విచారిస్తున్నప్పటికీ, సిఇసి, ఇసి నియామకాలపై మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఏమనుకోవాలి? భారత ప్రభుత్వమే న్యాయ వ్యవస్థను గౌరవించకపోవడం చట్టవ్యతిరేక శక్తులను ప్రోత్సహించడం కాదా? భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)లో నియామకాలను ఖరారు చేసే ప్యానెల్‌లో ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) ఉండాలని 2022లో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసినప్పటికీ, కేంద్రం ఖాతరు చేయలేదు. పైగా, సిజెఐ స్థానంలో, కేంద్ర మంత్రికి అవకాశం కల్పించే చట్టంతో న్యాయ వ్యవస్థను అపహాస్యం చేసింది. 2022లో కేసు విచారణలో ఉన్నప్పుడే సిఇసి పదవిని అరుణ్ గోయల్‌కు అప్పగించింది. 2024లో, రాజీనామా చేసిన గోయల్, రిటైరైన మరో కమిషనర్ స్థానాల్లో ఇద్దరిని నియమించింది. కోర్టును పట్టించుకోకుండా, ఇష్టానుసార నిర్ణయాలు తీసుకోవడం మోదీ ప్రభుత్వానికి అదే మొదటిసారి కాదు... ఆఖరు అసలే కాదు. తాజాగా, సిఇసి, ఇసి నియామకంపై తొందర వద్దని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీసహా పలువురు చేసిన సూచనలను పెడచెవిన పెట్టింది. అభ్యంతరాలను బుట్టదాఖలు చేసింది. ఎన్నికల కమిషన్ వంటి అత్యంత ప్రధానమైన వ్యవస్థల్లో ప్రభుత్వాల జోక్యం, ఆధిపత్యం ఉండకూడదని రాజ్యాంగం స్పష్టం చేసినప్పటికీ, వాటి స్వాతంత్ర్యాన్ని హరించే చర్యలకు పాల్పడుతున్నది. కేంద్రం వైఖరి రాజ్యాంగానికి, న్యాయ వ్యవస్థకు సవాళ్లు విసురుతున్నది. సిఇసి రాజీవ్ కుమార్ పదవీ విరమణ నేపథ్యంలో, ఆ స్థానానికి జ్ఞానేష్ కుమార్‌ను, ఇసిగా వివేక్ జోషిని ఎంపిక చేసి, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు మోదీ సర్కారు గండికొట్టింది. ఇసిఐలో నిర్ణయాలు 2:1 నిష్పత్తితో ఆమోదం పొందితేనే అమలవుతాయి కాబట్టి, ప్రజాస్వామ్యం అంటే ఇదేనని మోదీ, ఆయన భజన బృందం ఘనంగా ప్రకటిస్తునే ఉన్నారు. రాజ్యాంగ ఉల్లంఘన జరగనే లేదని వితండ వాదం చేస్తున్నారు. ప్యానెల్‌లో ప్రధాని ఒక సభ్యుడు... ప్రధాని ఎంపిక చేసిన కేంద్రమంత్రి మరో సభ్యుడు. మూడో సభ్యుడు ప్రతిపక్ష నేత. ఇలాంటి సందర్భంలో ఎవరి నిర్ణయాలు అమలవుతాయో... ఎవరి అభ్యంతరాలు అటకెక్కుతాయో వివరించాల్సిన అవసరం ఏముంది? కానీ, ప్రభుత్వం మాత్రం అదే నిజమైన ప్రజాస్వామ్యమని వాదించడం విడ్డూరం. రాజ్యాంగ విలువలకు కట్టుబడి సాగుతున్న పాలనగా అభివర్ణించుకోవడం దారుణం. రాజ్యాంగ వ్యవస్థలను గౌరవిస్తున్నామని ప్రకటనలు గుప్పించడం దుర్మార్గం. విచారణ ముగిసే వరకూ సవరించిన చట్టం ఆధారంగా నియామకాలు జరపరాదన్న కోర్టు ఆదేశాలు పాటించాలనే కనీస మర్యాద కూడా ప్రభుత్వానికి లేదు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటి ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు వెళుతున్నది. న్యాయ స్థానాలు ఇచ్చిన తీర్పులను బేఖాతరు చేస్తూ, రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరిస్తున్నది. న్యాయ వ్యవస్థను ప్రమాదం అంచుకు నెట్టేస్తున్నది. మోదీ రాజ్యంలో జరుగుతున్న రాజ్యాంగ విధ్వంసానికి, స్వయం ప్రకటిత విధానాల అమలుకు సిఇసి నియామకమే నిదర్శనం. ఇలాంటి ప్రభుత్వం దేశాన్ని ఏ మార్గంలో నడిపిస్తుంది? ఏ ప్రమాదకర తీరాలకు చేరుస్తుంది?

> ఎన్నికల కమిషన్ వంటి అత్యంత ప్రధానమైన వ్యవస్థల్లో ప్రభుత్వాల జోక్యం, ఆధిపత్యం ఉండకూడదని రాజ్యాంగం స్పష్టం చేసినప్పటికీ, వాటి స్వాతంత్ర్యాన్ని హరించే చర్యలకు పాల్పడుతున్నది. కేంద్రం వైఖరి రాజ్యాంగానికి, న్యాయ వ్యవస్థకు సవాళ్లు విసురుతున్నది.

# ట్రంప్, శతకోటీశ్వరులకు సరికొత్త స్వర్ణయుగం

నిస్సిమ్ మన్నత్తుక్కారెన్
ప్రొఫెసర్, అంతర్జాతీయ అభివృద్ధి అధ్యయనాల విభాగం
డల్హౌసీ యూనివర్సిటీ, కెనడా

డొనాల్డ్ ట్రంప్ తొలి విడత పాలనాయంత్రాంగం అమెరికా చరిత్రలోనే అత్యంత సంపన్నమైనది, కాగా రెండవ విడత దానిని తలదన్నింది. ఆ వర్గం మొత్తం సంపద విలువ 460 బిలయన్ డాలర్లు. అందులో 16మంది శతకోటీశ్వరులు. ప్రజాస్వామిక రాజకీయాలలో కేవలం 0.0001 శాతం జనాభాకు, దాని రాజకీయ, ఆర్థిక నిర్ణయాలపై అపరిమిత నియంత్రణ ఉంది. అది కుబేరుల కూటమి లక్షణాలను సంతరించుకుంది. ఉన్నతస్థాయిలోని ఒక్క శాతం మందికి ఇప్పటికే 31శాతం సంపదపై ఆధిపత్యం కలిగిన సమాజంలో మనం ఉన్నాం.

ప్రజాస్వామ్యంలో లాబీయింగ్(పైరవీ)ద్వారా, తమ తరపున ప్రాయోజిత అభ్యర్థుల ద్వారా అత్యంత సంపద్వంతులు తరచుగా ప్రభుత్వ విధానాలను పరోక్షంగా ప్రభావితం చేస్తుంటారు. 2024 అమెరికా ఎన్నికలలో సంపన్న కుటుంబాలు సుమారు 2 బిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చాయి. కానీ, కుబేరులే పరిపాలనా యంత్రాంగంలో ప్రత్యక్ష భాగస్వాములుగా మారితే అది రాజకీయ శక్తికి భిన్నమైన పరిమాణాన్ని అందిస్తుంది. ఉదాహరణకు ట్రంప్ ప్రచారానికి 250 మిలియన్‌ల డాలర్లు ఖర్చు చేసిన ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలాన్ మస్క్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీని కట్టబెట్టారు. రాజకీయాలతో అనుబంధం ఉన్న శతకోటీశ్వరులకు, ప్రజాస్వామ్యానికి మధ్య ప్రతికూల సంబంధం ఉంటుందని పరిశోధనలు స్థిరపరిచాయి.

> అమెరికా ప్రభుత్వంతో మస్క్ 100 వ్యాపార కాంట్రాక్టులు కలిగి ఉన్నారు. ఆయన కంపెనీలపై 11 ఫెడరల్ ఏజెన్సీలు చేపట్టిన 30 దర్యాప్తులు ట్రంప్ ఆజ్ఞలతో నిలిచిపోయాయి. కార్మిక వర్గాల అంతస్ఫోటనం, సంపద కేంద్రీకరణ అనేది రెండు (రిపబ్లిక్, డెమొక్రటిక్) పార్టీల పాలనలో సర్వసాధారణమే. ట్రంప్ ప్రచారానికి 14 మంది శతకోటీశ్వరులు విరాళాలు ఇవ్వగా, కమలా హ్యారీస్‌కు 21 మంది ఇచ్చారు.

## ప్రజలపై ప్రభావం

ప్రభుత్వంలో చేరేందుకు ఒక పౌరుడికి సంపద కలిగి ఉండటమే ఆటంకంగా మారకూడదు. కానీ, అమెరికా నైతిక చట్టాలు, ఆర్థిక వివరాల వెల్లడి వంటివి ఉన్నప్పటికీ పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు అవకాశం ఉంటుంది. ట్రంప్ ప్రభుత్వంలో వాణిజ్య కార్యదర్శి (మంత్రి)ఒక ఆర్థిక సేవల సంస్థకు సిఇఒ. ఆర్థిక కార్యదర్శి ఒక పెట్టుబడి నిధి నిర్వహణ సంస్థకు అధిపతి. నాసా అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల్లో ఆద్యుడు. పేపాల్(నగదు బదిలీ సంస్థ) మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ "వైట్ హౌజ్ ఎ.ఐ., క్రిప్టో జార్" విభాగానికి నేతృత్వం వహిస్తున్నారు.

ప్రజా ప్రయోజనం, మార్కెట్‌లకు మధ్య ప్రాథమికంగానే పొసగదు. "రోజుకు 14 మిలియన్ డాలర్లు సంపాదించే వ్యక్తి ...లక్షలాది అమెరికన్‌లకు 1,976 డాలర్లు(సగటు నెల సామాజిక భద్రత చెల్లింపు)ఎంత ముఖ్యమో గమనంలోకి తీసుకోగలడా?" అని ఒక పరిశోధకుడు ప్రశ్నించారు. 6.75 ట్రిలియన్‌ల అమెరికా బడ్జెట్‌లో 2 ట్రిలియన్‌ల మేరకు కోత విధిస్తానని వాగ్దానం చేసిన మస్క్, బడ్జెట్ కోతల ద్వారా "కొద్దిపాటి తాత్కాలిక కష్టాలు" ఉంటాయని అన్నారు. ఇది బాధాకరమైన పరిహాసం.

అమెరికా ప్రభుత్వంతో మస్క్ 100 వ్యాపార కాంట్రాక్టులు కలిగి ఉన్నారు. ఆయన కంపెనీలపై 11 ఫెడరల్ ఏజెన్సీలు చేపట్టిన 30 దర్యాప్తులు ట్రంప్ ఆజ్ఞలతో నిలిచిపోయాయి.

అమెరికాలో అత్యున్నత స్థాయి 1 శాతం కుబేరులకు, ప్రజలకు మధ్య పన్నులు, ఆర్థిక నియంత్రణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాల విషయంలో కీలకమైన తేడాలు ఉన్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. జనాభాలో 87 శాతం మంది సాధారణ పౌరులు మంచి పబ్లిక్ స్కూళ్ళకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని భావిస్తుండగా, ఉన్నతస్థాయిలోని 1 శాతం మందిలో 35 శాతమే అలా ఆలోచిస్తున్నారు.

ప్రజానుకూల విధానాలపై ఉన్నత శ్రేణి సంపన్నుల ప్రభావం తరచూ వినాశకరంగా ఉంటుంది. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ నినాదం "డ్రిల్, బేబీ, డ్రిల్"(క్రూడ్ ఆయిల్ వెలికితీత)కు అనుగుణంగానే, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగింది. ఆయన తొలి విడతలో విధించిన పన్నుల కోతలు, ఉద్యోగ చట్టం ద్వారా కార్పొరేట్‌లకు, హెచ్చు సంపద కలిగిన వ్యక్తులకు పన్ను లబ్ధి చేకూరింది. ఈ చర్యలు ఆదాయం, సంపద అసమానతలతో పాటు ప్రభుత్వ లోటును కూడా పెంచాయి. ట్రంప్ తొలి విడతలో వైద్య ఆరోగ్యరంగంలో ఒబామా ప్రవేశపెట్టిన అందుబాటులో ఆరోగ్య సంరక్షణ చట్టాన్ని నిర్వీర్యం చేయటం వల్ల ఆరోగ్య బీమా చేయించుకోని అమెరికన్‌ల సంఖ్య పెరిగేందుకు కారకులయ్యారు.

రోనాల్డ్ రీగల్ హయాంలో మార్కెట్ శక్తులకు సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చిన నయా ఉదారవాద పెట్టుబడిదారి విధానాలు ప్రారంభమైన తరువాత, ఆవిష్కృతమైన సామాజిక ఆర్థిక మార్పులకు వ్యక్తీకరణ ట్రంప్. ఫలితాలు కళ్ళకు కనబడుతున్నాయి. సంక్లిష్టతల శాస్త్రవేత్త పీటర్ టర్చిన్ ఇలా పేర్కొన్న డెకామిలియనీర్ల (10మిలియన్ డాలర్లు కలిగిన కుటుంబాలు)సంఖ్య విస్ఫోటనం చెంది, 1983లోని 66 వేల నుంచి 2019లో 6,93,000లకు పెరిగాయి. ఇది "సంపన్నుల అధిక ఉత్పత్తికి" దారి తీసింది. రాజ్యాధికారం కోరుకునే సంపన్నుల సంఖ్యను పెంచింది. ఎకనామిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం 1945 నుంచి 1973వరకు కార్మికులలో అత్యధికుల వేతనాలు ఉత్పాదకతకు అనుగుణంగా పెరిగేవి. కాగా, 1973 నుండి 2013 వరకు ఒక మోస్తరు కార్మికుడి పరిహారం 9 శాతం పెరగగా, ఉత్పాదకత 74 శాతం పెరిగింది. అదేకాలంలో మధ్య తరగతి వేతనాలు స్తబ్ధుగా ఉన్నాయి.

తక్కువ వేతన కార్మికుల వేతనాలు 5శాతం తగ్గగా, అత్యంత అధిక వేతన కార్మికుల వేతనాలు 41శాతం పెరిగాయి. 1965లో 350అతి పెద్ద అమెరికా పబ్లిక్ సంస్థల సిఇఒలు, ఆ సంస్థల్లోని సాధారణ కార్మికుడికంటే 20రెట్లు అధికంగా సంపాదించేవారు. కాగా, 2000 తొలినాళ్ళ నాటికి వారు సాధారణ కార్మికుని కంటే 383 రెట్లు అధికంగా వేతనం పొందారు. నిజవిలువ పరిభాషలో ఫెడరల్ కనీస వేతనాలు 2013 కంటే 1968లోనే ఎక్కువగా ఉండేవి.

## ఉభయపక్షాల అంశం

కార్మిక వర్గాల అంతస్ఫోటనం, సంపద కేంద్రీకరణ అనేది రెండు (రిపబ్లిక్, డెమొక్రటిక్) పార్టీల పాలనలో సర్వసాధారణమే. ట్రంప్ ప్రచారానికి 14మంది శతకోటీశ్వరులు విరాళాలు ఇవ్వగా, కమలా హ్యారీస్‌కు 21 మంది ఇచ్చారు. ట్రంప్ మొదటి మంత్రివర్గం విలువ 6.2బిలియన్ల డాలర్లు కాగా, బరాక్ ఒబామా రెండవ మంత్రివర్గం విలువ 2.8బిలియన్ల డాలర్లు. ట్రంప్ హయాంలో కార్పొరేట్ లాభాలు 2 ట్రిలియన్‌లను చేరుకోగా (2012 నుండి అవి 1.8 ట్రిలియన్‌లకు అటూఇటుగా ఉండేది), 2024లో జో బైడెన్ హయాంలో చుక్కలను తాకేలా 3.17 ట్రిలియన్‌ల డాలర్లకు చేరాయి. కార్మిక వర్గంలో మెజారిటీ ట్రంప్‌కు ఓటెయ్యగా, కాలేజీ గ్రాడ్యుయేట్‌లలో అత్యధికులు హ్యారిస్‌కు ఓటేశారు.



ఆర్థికపరమైన బలహీనుల ఆగ్రహాన్ని ట్రంప్ తనకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ ఆగ్రహానికి వర్ణ విద్వేషం తోడై, ఫాసిస్టు రాజకీయ ఊహలు కరుడుగట్టే విధంగా చేశాయి. రిచర్డ్ రోర్టీ అనే తత్వవేత్త 1998లోనే ఇలా ఊహించారు: "నగర శివారు ప్రాంతాల్లో లేని ఓటర్లు వ్యవస్థ విఫలమైందనే నిర్ణయానికి వచ్చి, తాము ఓటేసేందుకు శక్తివంతమైన వ్యక్తికోసం వెతకటం ప్రారంభిస్తారు.. గడిచిన 40సంవత్సరాలలో నల్లజాతీయులు, గోధుమ వర్ణ అమెరికన్‌లు, స్వలింగసంపర్కులు సాధించుకున్న ప్రయోజనాలు తుడిచిపెట్టుకుపోతాయి. .." చైనాలో 36 శాతం, రష్యాలో 21శాతం మాదిరిగా కాకుండా అమెరికాలో కేవలం 3.5శాతం మంది శతకోటీశ్వరులే రాజకీయాలలోకి ప్రవేశించారు. కానీ, పురాతన ప్రజాస్వామ్యం, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశం ధనస్వామ్యీకరణ పొందితే, అమెరికా తీరాల అవల కూడా హానికరమైన పరిణామాలను చవి చూడాల్సి వస్తుంది.

(ది హిందూ సౌజన్యంతో..)

# సామాజిక న్యాయం విశ్వవ్యాప్తం కావాలి!

డిజిటల్ ప్రపంచంలో ఆర్థిక పరిపుష్టి, సామాజిక న్యాయాలతోనే సుస్థిర సమగ్రాభివృద్ధి సుసాధ్యం అవుతుంది. ఇవి సాకారం కావడానికి పేదరిక నిర్మూలన, మానవ హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వం, నిరుద్యోగ సమస్యను అధిగమించడం, సామాజిక భద్రత, ఆర్థిక అసమానతల తొలగింపు, జనాభా నియంత్రణ, నిరక్షరాస్యత నిర్మూలన లాంటి ప్రధాన అంశాలు దోహదపడతాయని నమ్మిన ఐరాస, అంతర్జాతీయ కార్మిక సంస్థలు 2009 నుంచి ప్రతి ఏడాది 20 ఫిబ్రవరిన ప్రపంచ సామాజిక న్యాయ దినోత్స వం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ సోషల్ జస్టిస్) పాటించడం ఆనవాయితీగా వస్తోంది. సామాజిక న్యాయం సిద్ధించడానికి అందరికీ పని కల్పించడం, సామాజిక రక్షణ, రాజ్యాంగ హక్కుల కల్పన, సమసమాజ స్థాపనలకు చర్యలు తీసుకోవాలని సభ్య దేశాలకు ఐరాస ఐఎల్‌ఓ సూచిస్తున్నది. విద్యార్థి దశనుంచే పేదరిక నిర్మూలన, మానవ హక్కుల పరిరక్షణ ప్రాధాన్యం, గ్లోబల్ పౌరసత్వం లాంటి సున్నిత అంశాల పట్ల విద్యాలయాల్లోనే అవగాహనలు కల్పించాలని ఐరాస సిఫార్సు చేస్తోంది.

**ప్రపంచ సామాజిక న్యాయదినం-2025 ఇతి వృత్తం:** ప్రపంచ సామాజిక న్యాయ దినం 2025 ఇతివృత్తంగా సమ్మిళిత సాధికారత : సామాజిక న్యాయ అంతరాలను పూడ్చడం (ఎంపవరింగ్ ఇన్‌క్లూజన్ : బ్రిడ్జింగ్ గ్యాప్ ఫర్ సోషల్ జస్టిస్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అందరూ ఆర్థికంగా బలోపేతం అయినపుడు సహజంగానే సామాజిక న్యాయం వైపు అడుగులు పడతాయి. ప్రపంచవ్యాప్తంగా 2 బిలియన్లు, అందులో 40 కోట్ల యువత(15 29 ఏండ్ల వయస్సు) కడు పేదరికంలో మగ్గుతున్నారని, వీరిలో సగానికి పైగా పేదలకు పని కల్పన జరగడం లేదని తేలింది. దాదాపు 26 కోట్ల అంతర్జాతీయ వలసదారులు, అందులో 44 శాతం వరకు మహిళలు ఉన్నారని ఐఎల్‌ఓ అంచనా వేసింది. అర్హతకు తగిన పని, పనికి తగిన వేతనం లభించని సమాజంలో సామాజిక అన్యాయాలు, హింసాత్మక ఘటనలు రాజ్యమేలుతాయని మనకు తెలుసు.

**సామాజిక న్యాయ అవరోధాలు:** మానవ హక్కుల ఉల్లంఘనలు, కృత్రిమ సామాజిక అవరోధాలు, కులమత విద్వేషాలు, లింగ/ఆర్థిక అసమానతలు, వలస కూలీల ధీన పరిస్థితులు, దివ్యాంగుల సమస్యలు లాంటి సమస్యలకు సరైన సమాధానాలు సూచించగల సమాజంలో సామాజిక న్యాయం వర్ధిల్లుతుంది. కులం, మతం, వర్గం, వర్ణం, జాతి, పేదరికం, నిరుద్యోగం, ప్రాంతం, లింగం, సంస్కృతి సంప్రదాయాలు లాంటివి అవరోధంగా ఉన్నంతకాలం సామాజిక న్యాయం ఎండమావి అవుతుందని, వీటితో అశాంతి, అసహనాలు రెచ్చిపోయి హింస ప్రత్యక్షం అవుతుందని తెలుసుకోవాలి. ప్రపంచ మానవాళి మధ్య సామాజిక న్యాయం, సంఘీభావం, సమానత్వం, సామరస్యం నెలకొన్నపుడు మాత్రమే విశ్వశాంతి కపోతం స్వేచ్ఛగా విహరించగలుగుతుందని తెలుసుకోవాలి.

అందరికీ సమసమాజం, సమగ్రాభివృద్ధిలో మనందరం అనే భావనలతో ప్రభుత్వాలు పథకాల పావులు కదుపుతూ, ఉద్యోగ ఉపాధులు పెరిగి సామాజిక న్యాయం అనే ప్రతిఫలం సిద్ధించడం జరుగుతుంది. అజ్ఞా నం, పేదరికం, అన్యాయం కోరలు చాచినపుడు సామాజిక శాంతి కొరవడుతుంది. అన్యాయాన్ని సహించిన సమాజం భారీ మూల్యమే చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఆర్థిక అసమానతలు తొలగినపుడు సామాజిక న్యాయ దేవత ప్రతిష్ట జరుగుతుందని గమనించి అందరం సామాజిక న్యాయాన్ని బలపరుచుదాం.

# ఒబేసిటీ భారత్... ఎట్లా?

ప్రపంచాన్ని చుట్టుముట్టుతున్న పలు అనారోగ్య సమస్యల్లో స్థూలకాయం (అధిక బరువు) ముందు వరుసలో వచ్చిచేరింది. ఈ సమస్యకు ప్రధాన కారణం మన జీవనశైలి ఆహారపు అలవాట్లు అని గ్రహించాలి.. అమెరికాకు ప్రధాన శత్రువు ఒబేసిటీ అని మన అందరికీ తెలిసిందే. తరువాత స్థానంలో చైనా నిలవ గా, మన దేశం ఒబేసిటీలో మూడవ స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది .. మనదేశంలో పౌష్టికాహారంలేక అనేకమంది పేద, మధ్య తరగతి ప్రజలు, పిల్లలు అధిక బరువుతో బాధపడుతుంటే, మరి కొందరు పోషకాహారం ఎక్కువై అనగా ధనిక వర్గాల ప్రజలు ఈ ఒబేసిటీ తో బాధపడుతున్నారు. బియమ్‌ఐ (బాడీ మాస్ ఇండెక్స్) 30.0 ఉంటే స్థూలకాయుడుగా పేర్కొనవచ్చు. ప్రస్తుతం మన దేశంలో ఎనిమిది శాతం జనాభా అంటే సుమారు 10కోట్ల మంది స్థూలకాయంతో బాధపడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. సుమారు 1.40కోట్ల మంది పిల్లలు అధిక బరువుతో సతమతమవుతున్నారు. కేరళలో 65.4 శాతం, పంజాబ్‌లో 62.5శాతం, తమిళనాడులో 57.9శాతం, ఢిల్లీ 59శాతం మంది అధిక బరువుతో బాధపడుతున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. అధిక బరువు తగ్గించుకోవడానికి గత ఏడాది 2024లో జరిగిన 'వెయిట్ లాస్ సర్జరీలు' 2లక్షలు జరిగినట్లు సమాచారం. అంటే ఎంత వేగం గా అధిక సంఖ్యలో ఒబెసిటీ పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.. ముఖ్యంగా మనదేశంలో పిల్లలు అధిక బరువుతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం వ్యాయా మం లేకపోవడం. చదువు, ఇంటర్నెట్‌లో ఎక్కువ సమ యం గడపడం వల్ల అధిక బరువు బారిన పడుతున్నా రు. ఉదయం 7 గంటలకు భుజాన బుక్స్ బ్యాగ్ వేసుకొని వెళ్ళిన పిల్లలు రాత్రి 8 గంటలకు ఇంటికి చేరుకుంటున్న తరుణంలో ఆటలకు, క్రీడలకు సమయం లేక వారిలో ఒబెసిటీ పెరుగుతుంది. దీనికి తోడు సుగర్ కంటెంట్ పదార్థాలు ముఖ్యంగా చాక్లెట్స్, ఐస్ క్రీమ్‌లు, ఫాస్ట్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్స్ తినడం వల్ల అధికసంఖ్యలో ఒబెసిటీ పెరుగుతుంది.. అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. కీళ్ల నొప్పులు, మానసిక, శారీరక





అనారోగ్యాలు, కొన్ని సందర్భాల్లో గుండె పోటుకి గురై తనువులు చాలిస్తున్న పరిస్థితి. ఇకనైనా తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో, ఆరోగ్యం సం రక్షణ కోసం, ఆహారం అలవాట్లుపై శ్రద్ధ తీసుకోవాలి.

ఇక ప్రతీ వస్తువు ఆన్లైన్‌లో అందుబాటులోకి రావడంతో కనీసం వస్తువులు, కూరగాయలు వంటివి కొనడానికి కూడా చాలామంది బయటకు వెళ్ళకపోవడం వలన అధిక బరువు పెరుగుతుంది. ఫిజికల్ యాక్టివిటీ పూర్తిగా తగ్గిపోయింది. 1990 నుంచి 2024 మధ్య కాలంలో ఒబెసిటీ బాధితుల సంఖ్య సుమారు నాలుగు రెట్లు పెరిగిం ది. ప్రోటీన్ పౌడర్లు, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల అధిక బరువుతో బాధపడుతున్నారు అని గ్రహించాలి. పిజ్జాలు బర్గర్లు, నాన్ వెజ్ ఆహారం, ఆయిల్ ఫుడ్స్, బేకరి ఫుడ్స్ అధిక బరువుకి కారణం అని గ్రహించాలి..

మితంగా ఆహారం తీసుకోవడం. శరీరానికి వారానికి 6 నుంచి 12 గంటల ఉపవాసం చేయడం మంచిది అని కొంతమంది అంటున్నారు. జంక్ ఫుడ్స్, ఫ్రైడ్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్స్ తగ్గించాలి.. అదే సమయంలో మనదేశంలో పేదరికం నిర్మూలనకు, పిల్లలకు, పేదలకు పౌష్టికాహారం అందించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలి. ప్రతీఒక్కరూ శారీరక శ్రమ, ముఖ్యంగా రోజూ కొంత సమయం వ్యాయామం, క్రీడలు, ఆటలు ఆడటం చేయాలి. అవసరం మేరకు ఇంటర్నెట్, ఆన్లైన్ వాడాలి. 'ఒబేసిటీ రహిత భారత్'గా భారత్ అవతరించాలి అని ఆశిద్దాం.

**ఐ.ప్రసాదరావు,** 6305682733

# ర్యాగింగ్ రక్కసిని పక్కకు నెట్టేయాలి

కేరళలోని కొట్టాయంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులపై సీనియర్లు ర్యాగింగ్ చేసారు. హాస్టల్ గదుల్లో వివస్త్రలను చేసి, ప్రైవేట్ భాగాలపై గాయాలు కలిగించడానికి డంబెల్స్ ఉపయోగించి తీవ్రమైన శారీరక వేధింపులకు గురిచేసి క్రూరంగా హింసించారు. ఈ విషయం విన్న ప్రజలందరూ ఒక్కసారి తుళ్ళిపడ్డారు.

**ర్యాగింగ్ - రూపాలు:** కొత్తగా కాలేజీలో చేరిన విద్యార్థులతో స్నేహాన్ని బలపరుచుకునే విధానాన్ని మరచి సాటి విద్యార్థులను హింసకు గురిచేసి వాటిని చూసి పాశవిక ఆనందాన్ని పొందుతూ ఒక్కోసారి సాటి విద్యార్థులను చావుదాకా తీసుకెళుతున్నారు అక్కడి సీనియర్లు. ర్యాగింగ్ వందలాదిమంది అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. వేలాదిమంది తెలివైన విద్యార్థుల కెరీర్‌ను నాశనం చేసింది. విద్యాసంస్థల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను మానసికంగా, శారీరకంగా వేధించడం లేదా అణచివేయడాన్ని ర్యాగింగ్ అంటారు. 'మాట్లాడడం లేదా వ్రాయడం ద్వారా ఇతర విద్యార్థులను ఆటపట్టించేలా ప్రవర్తించడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం. క్రమశిక్షణా రాహిత్యంతో కూడిన ఏదైనా క్రమరహిత ప్రవర్తన' అని 1999లో విశ్వ జాగృతి కేసు విషయంలో సుప్రీం కోర్టు ర్యాగింగ్‌ను నిర్వచించింది. ఇది మానవ హక్కుల దుర్వినియోగానికి పరాకాష్ఠ. ర్యాగింగ్ అనేది శారీరక, మానసిక, లైంగిక వేధింపులతో సహా అనేక రూపాలలో ఉంటుంది.

**తమిళనాడు మొదటిది:** డెబ్భైవ దశకం చివరిలో ఒక ప్రాంతీయ ఇంజినీరింగ్ కళాశాలలో ఇద్దరు ఫ్రెషర్లు మరణించిన తరువాత కేంద్ర ప్రభుత్వం దేశంలో ర్యాగింగ్‌ను నిషేధిస్తూ మొదటిసారి నోటిఫికేషన్‌ను జారీ చేసింది.మద్రాస్ విశ్వవిద్యాలయం అప్పటి వైస్ ఛాన్సలర్ కుమారుడు నవరసుపై అదే కళాశాలలో సీనియర్ విద్యార్థి జాన్ డేవిడ్ దాడి చేయడమే కాకుండా తన పాదరక్షలను విప్పి నాకమని బలవంతం చేశారు. అతను అలా చేయడానికి నిరాకరించడంతో అతన్ని హింసాత్మకంగా కొట్టి చంపారు. ఈ కేసు ఆధారంగా 1997లో తమిళనాడు రాష్ట్రం దేశంలోనే మొట్టమొదటి ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని ఆమోదించింది.

**కట్టడికి కమిటీలు:** ర్యాగింగ్‌ను అరికట్టేందుకు విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకాలను జారీ చేయాలని విశ్వ జాగృతి మిషన్ దాఖలు చేసిన పిల్‌పై సుప్రీం కోర్టు 1999లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌ని కోరింది. 'ప్రొఫెసర్ కెపియస్ ఉన్ని' ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ర్యాగింగ్‌పై చట్టాలు తీసుకురావాలని, అడ్మిషన్ రద్దు నుంచి లక్ష రూపాయల వరకు జరిమానాతో పాటు శిక్షలు విధించాలని పేర్కొన్నారు. వసతిగృహా ల్లో వార్డెన్‌లు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ర్యాగింగ్‌ను అరికట్టడంలో విఫలమైన సంస్థలను మూసెయ్యాలని కూడా సూచించారు. 2007 ఆర్. కె. రాఘవన్ కమిటీ నివేదిక ర్యాగింగ్‌ను మానసిక వ్యాధిగా అభివర్ణించింది. దాని నిషేధం, నివారణ చర్యల అమలు రెండింటినీ సిఫార్సు చేసింది. ర్యాగింగ్‌కు పాల్పడే వ్యక్తులపై తీసుకోగల చర్యలను, దీనిని అరికట్టడంలో విఫలమైన సంస్థలపై సాధ్యమయ్యే చర్యలను సూచించడం మొదలైన పలు కీలక అంశాలను స్పృశిస్తూ ర్యాగింగ్‌కు మానసిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సహా అనేక అంశాలు ఉన్నాయని, ఇది ఉన్నత విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. పాఠశాల దశ నుంచే మానవీయ విలువలను పెంపొందించడంలో మన వైఫల్యం ర్యాగింగ్‌గా పరిగణించ బడుతుందని పేర్కొంది. క్యాంపస్‌లలో ర్యాగింగ్ కేసుల పెరుగుదల సమస్యను పరిష్కరించడానికి యుజిసి ఉన్నత విద్యా సంస్థల్లో ర్యాగింగ్ ముప్పును అరికట్టడానికి కొన్ని నిబంధనలను 2009లో తీసుకువచ్చింది. ఈ నిబంధనలను అన్ని ఉన్నత విద్యా సంస్థ లు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. ర్యాగింగ్ చేసిన వారు దోషులుగా తేలితే వారి పై తీసుకోవలసిన చర్యలను సూచించింది. అవి తరగతులకు హాజరుకాకుండా సస్పెన్షన్లు చేయొచ్చని, స్కాలర్‌షిప్ లేదా ఫెలోషిప్, ఇతర ప్రయోజనాలను ఉపసంహరించుకోవచ్చని, పరీక్షలకు హాజరు కాకుండా డిబార్ చేయొచ్చని, పరీక్షల ఫలితాలను నిలిపేయొచ్చని, సంస్థ నుండి బహిష్కరణ తత్ఫలితంగా నిర్ణీత వ్యవధిలో ఏదైనా ఇతర సంస్థలో ప్రవేశం నుండి డిబార్ చేయడం వంటివి ఉన్నా యి.

> చట్టాలు ప్రధానంగా ర్యాగింగ్ మూల కారణాలు, ప్రవర్తనలను పరిష్కరించడం కంటే దానిని నిషేధించడంపై దృష్టి పెడుతున్నాయి. ఫలితంగా ర్యాగింగ్ సంఘటనలను నిరోధించడంలో విఫలమవుతున్నాయి. విద్యా సంస్థలు తమ ర్యాగింగ్ నిరోధక ప్రయత్నాలను 'ర్యాగింగ్ నిరోధక' నోటీసులను ప్రదర్శించడం, అండర్‌టేకింగ్‌లను పొందడం వంటి లాంఛనాలకే పరిమితం చేస్తున్నాయి. ఇవి ర్యాగింగ్‌ను సమర్థవంతంగా నిరోధించలేకపోతున్నాయి. యుజిసి 2009



నిబంధనలు, మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికారులు కఠినంగా అమలు చేయకపోవడం వల్ల క్యాంపస్ వాతావరణాలు అసురక్షితంగా మారుతున్నాయి.

**తెలుగు రాష్ట్రాలలో నిషేధం:** ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1997లో ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టింది. విద్యాసంస్థలు, కళాశాలలు, విద్యను బోధించే ఏ సంస్థ అయినా, విద్యార్థి వసతి గృహం, ట్యుటోరియల్ కాలేజీ, రోడ్లు, బస్సులు ఆగే ప్రాంతం, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, వైద్యశాల వంటి ప్రదేశాలలో ర్యాగింగ్ జరపటం నేరంగా పేర్కొంది. ర్యాగింగ్ సందర్భం లో మరణించటం జరిగిన లేదా ఆ విద్యార్థి ఆత్మహత్యకు లోనైనా నేరస్తునికి జీవిత ఖైదు లేదా 10సంవత్సరాల వరకు జైలుశిక్ష, 50,000రూపాయలవరకు జరిమానా విధింపబడతాయని తెలిపింది. చట్టాలు ప్రధానంగా ర్యాగింగ్ మూల కారణాలు, ప్రవర్తనలను పరిష్కరించడం కంటే దానిని నిషేధించడంపై దృష్టి పెడుతున్నాయి. ఫలితంగా ర్యాగింగ్ సంఘటనలను నిరోధించడంలో విఫలమవుతున్నాయి. విద్యా సంస్థలు తమ ర్యాగింగ్ నిరోధక ప్రయత్నాలను 'ర్యాగింగ్ నిరోధక' నోటీసులను ప్రదర్శించడం, అండర్‌టేకింగ్‌లను పొందడం వంటి లాంఛనాలకే పరిమితం చేస్తున్నాయి. ఇవి ర్యాగింగ్‌ను సమర్థవంతంగా నిరోధించలేకపోతున్నాయి. యుజిసి 2009 నిబంధనలు, మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికారులు కఠినంగా అమలు చేయకపోవడం వల్ల క్యాంపస్ వాతావరణాలు అసురక్షితంగా మారుతున్నాయి.

**పరిష్కారాలు :** విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ర్యాగింగ్ గురించి అవగాహన కలిగించాలి. విద్యాలయాల్లో 'యాంటీ ర్యాగింగ్ టీమ్' లను ఏర్పాటు చేయాలి. సీనియర్లు, జూనియర్లకు వేరువేరుగా హాస్టల్ సౌకర్యం కల్పించాలి. సున్నితమైన ప్రదేశాలలో సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలి. కళాశాలలో చేరినప్పుడే విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి ర్యాగింగ్‌కు సంబంధించి అఫడవిట్ తీసుకోవాలి. యాదృచ్ఛికంగా తనిఖీలు నిర్వహించాలి. విద్యార్థులు కూడా యాంటీ ర్యాగింగ్ సెల్స్, హెల్ప్‌లైన్ నంబర్లు, కౌన్సెలింగ్ సెంటర్లు మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి.

**అందరి సహకారం అవసరం:** విద్యార్థులు, విద్యా సంస్థల అధికారులు, తల్లిదండ్రులు, మనస్తత్వవేత్తలు, పౌరసమాజం, న్యాయ నిపుణులు, స్థానిక అధికారులు, రాజకీయ ప్రతినిధులు, సామాజిక సంస్థలు, మీడియా సమిష్టి కృషితో ర్యాగింగ్‌ను నిరోధించవచ్చు. దీన్ని అరికట్టడానికి చట్టాలు, విద్యా సంస్థల భాగస్వామ్యం, సమాజంలో నైతిక బాధ్యత అవసరం. ప్రతి విద్యార్థి సురక్షితమైన వాతావరణంలో చదువుకునే హక్కును కాపాడటం మనందరి కర్తవ్యం.

**జనక మోహన రావు దుంగ,** 8247045230

# భవిష్యత్తులో ఎన్నికల ఫలితాలకు మీదే బాధ్యత

- కాంగ్రెస్ ముఖ్య నేతలకు ఖర్గే హెచ్చరిక
- బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి
- ఓటర్ల జాబితాలో అక్రమాలను అడ్డుకోవాలని పిలుపు




**న్యూఢిల్లీ:** భవిష్యత్తులో రాష్ట్రాలలో జరిగే ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ ఉన్నతస్థాయి నాయకులకు స్పష్టం చేశారు. ఇక్కడ ఇందిరా భవన్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీలో అగ్ర కార్యనిర్వాహకులతో సమావేశమయ్యారు. గత వారం నియమించబడిన వారితో సహా ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లు హాజరయ్యారు. ఖర్గే మాట్లాడుతూ... రాష్ట్రాలలో పార్టీ ని బలోపేతం చేసుకునేందుకు, భవిష్యత్తులో జరిగే ఎన్నికల ఫలితాలకు జవాబుదారీగా ఉండాలన్నా రు. సైద్ధాంతికంగా బలహీనమైన ఫిరాయింపుదారుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. కాంగ్రె స్ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నవారిని, ప్రతికూల పరిస్థితులలో కూడా మనతో పాటు నిలబడే వారి ని ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. పార్టీలో మరికొన్ని మార్పులుంటాయని ఖర్గే సూచనప్రాయంగా చెప్పారు. కొన్ని మార్పులు ఇప్పటికే జరిగాయని, మరికొన్ని త్వరలో రానున్నాయని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సీనియర్ నా యకులు ప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపా ల్, జైరాం రమేష్, వివిధ రాష్ట్రాలలోని ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లు హాజరయ్యారు. ఖర్గే మాట్లాడుతూ... ఓటరు జాబితా తారుమారు అంశాన్ని ప్రస్తావించారు. ఎన్నికలలో ఇది పెద్ద ఎత్తున జరుగుతోందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కూడా లోక్‌సభలో దీని గురించి ఒక ప్రశ్నను లేవనెత్తారని ఆయన పేర్కొన్నారు. 'మన పార్టీ మద్దతుదార్ల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నారని మీరందరూ గ్రహించారు. లేదా పేరును తీసివేసి పక్కనే ఉన్న మరో బూత్‌లో జోడిస్తారు. ఎన్నికలకు ముందు బిజెపి కొత్త పేర్లను చేర్పిస్తుంది. ఈ రిగ్గింగ్‌ను ఎలాగైనా ఆపాలి' అని ఖర్గే నొక్కి చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం గతంలో సుప్రీం ప్రధాన న్యాయమూర్తిని సిఇసి ఎంపిక కమిటీలో కూడా చేర్చారని, కానీ మోదీ ప్రభుత్వం సిజెఐని కమిటీ నుండి తొలగించిందని ఖర్గే ఎత్తి చూపారు. 'దేశ ప్రధాన న్యాయమూర్తి నిష్పాక్షికతను కూడా ప్రభుత్వం విశ్వసించడం లేదు. ఈ విషయం సుప్రీంకోర్టులో విచారణకు రావాల్సి ఉంది, కానీ ప్రభుత్వం అంతకు ముందే కొత్త సిఇసిని ప్రకటించింది. అటువంటి ఎంపిక కమిటీ వల్ల ఉపయోగం ఏమిటి? ఇక్కడ మీరు ప్రతిపక్ష నాయకుడిని సర్టిఫికేషన్ కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారా?' అని రాహుల్‌జీ కూడా ప్రశ్నించారని ఖర్గే పేర్కొన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సమస్యల్ని కూడా ఖర్గే లేవనెత్తారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, నిత్యావసధరలను నియంత్రించడంలో మోదీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆయన అన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియూసి) ముఖ్యమైన విభాగమని... పార్టీ పునర్నిర్మాణంలో వారిని కూడా పాల్గొనేలా చేయాలని ఖర్గే అన్నారు. తొలుత ఢిల్లీ ప్రజలు మార్పునకు ఓటు వేశారన్నారు. ఈ ఎన్నికల్లో వనరులు లేకపోయినా మంచి పోరాటం చేయడంలో రాష్ట్ర నాయకత్వం బాగా పనిచేసిందని ప్రశంసించారు. కేంద్రంలోని మోదీసర్కారును విమర్శిస్తూ... అమెరికా నుండి బహిష్కరించబడిన భారతీయులకు జరుగుతున్న అవమానాన్ని ఆపడం లో ప్రధాని విఫలమయ్యారన్నారు. 'అమెరికా ఆర్థిక విషయాలలో కూడా మనల్ని తీవ్రంగా బాధపెడుతోంది. వారు మనపై రివర్స్ టారిఫ్ విధించారు. ప్రధాన మంత్రి దానిపై కూడా నిరసన కూ డా వ్యక్తం చేయలేదు. వారు మనపై బలవంతంగా నష్టపరిచే ఒప్పందాన్ని విధిస్తున్నారు. దీనిని మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా అంగీకరిస్తోంది. ఇది స్పష్టంగా భారతదేశానికి, భారత ప్రజలకు అవమానం' అని ఖర్గే పేర్కొన్నారు. ''జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'' కార్యక్రమం రాబోయే ఒక సంవత్సరం పాటు కొనసాగుతుందని పేర్కొంటూ... దీని కింద పాదయాత్రలు, కూడళ్లలో సమావేశాలు, చర్చా కార్యక్రమాలు వంటి కార్యకలాపాలను చేపట్టాలని ఖర్గే తెలిపారు. కానీ అలాంటి ప్రతి కార్యక్రమ లక్ష్యం పార్టీ సాధికారతగా ఉండాలని ఖర్గే స్పష్టం చేశారు.

# విద్యపై యోగి నిర్లక్ష్యం

## హిందూ, ముస్లిం అజెండాకే పరిమితం: అఖిలేశ్




**లక్నో:** విద్య విషయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) అధినేత అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. కీలక అంశాలను వదిలేసి ప్రాంతాల పేర్ల మార్పునకే యోగి యంత్రాంగం పరిమితం అయిందా అంటూ ఎద్దేవా చేశారు. కుంభమేళా నిర్వహణపై విమర్శల వేళ యోగిపై అఖిలేశ్ నిప్పులు చెరిగారు. అలహాబాద్, ఫైజాబాద్ పేర్లను బిజెపి ప్రభుత్వం మార్చడం వివాదాస్పదం కావడం విదితమే. క్రికెటర్ మహమ్మద్ షమీ కూడా కుంభమేళాకు హాజరయ్యారని, ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానం ఆచరించారని, వివక్ష లేదని యోగి అన్న మాటలను తీవ్రంగా ఖండించారు. మీకు పేర్లు మార్చడం అలవాటు సరే క్రికెటర్ పేరు కూడా మార్చేస్తారా అంటూ ఎక్స్‌లో దుయ్యబట్టారు. పుణ్యస్నానం ఆచరించినది మహమ్మద్ కైఫ్ కాగా సీఎం... షమీ పేరు చెప్పడంపై అఖిలేశ్ వ్యంగ్యంగా స్పందించారు. ఇప్పటికే నకిలీ వీడియోలతో యోగి సర్కార్ ప్రచారం చేస్తూ... కుంభమేళాను అడ్డుపెట్టుకొని ప్రయోజనాలు పొందాలని చూస్తోందని విపక్షాలు ఇప్పటికే విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలాఉంటే రాష్ట్రంలో విద్య ప్రమాణాలు పడిపోతున్నాయని అఖిలేశ్ అన్నారు. అసెంబ్లీలో అవధి, బ్రజ్, భోజ్‌పురి, బుందేలి, ఆంగ్లంతో పాటు ఉర్దూని అనువాద భాషలో చేర్చాలని డిమాండ్ చేశారు. దీనిపై అసెంబ్లీలో యోగి మండిపడ్డారు. మౌల్వీలను తయారు చేయడానికే ఉర్దూని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. దీంతో అఖిలేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యను, రాష్ట్ర ప్రగతిని నిర్లక్ష్యం చేస్తున్నారని బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయనన్నారు. దేశవ్యాప్తంగా 11 లక్షల ప్రాథమిక పాఠశాలలు మూతపడగా వాటిల్లో అత్యధికం యూపీకి చెందినవేనని చెప్పారు. మూసేసిన పాఠశాలల్లో ఎన్ని ఇంటర్మీడియట్ పాఠశాలలు తెరిచారు? పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్‌పై శ్రద్ధ పెట్టారా? విద్య నాణ్యతను ఎలా మెరుగుపరిచారు? అంటూ యోగిని అఖిలేశ్ నిలదీశారు. హిందూ ముస్లిం తప్ప మాట్లాడేందుకు ఏమీ లేదా అంటూ యోగి తీరును అఖిలేశ్ తీవ్రంగా ఖండించారు.

# మీడియా చాలా బాధ్యతగా వ్యవహరించాలి:సుప్రీం

**న్యూఢిల్లీ :** మీడియాలో కీలకస్థానాలలో పనిచేసేవారు ఏదైనా ప్రకటనలు, వార్తలు అభిప్రాయాలు ప్రచురించేముందు బాధ్యత, అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని బుధవారం సుప్రీంకోర్టు సూచించింది. అంతేకాకుండా వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన హక్కును తప్పనిసరిగా పాటించాలని న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్దివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం హితవు పలికింది. ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలో మీడియాకు ఉన్న శక్తి విశేషమైన వేగంతో ప్రజల మనోభావాలు, అవగాహనలను వేగంగా ప్రభావితం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ధర్మాసనం పేర్కొంది. బిడ్, హామర్‌లలితకళల వేలందారులు వేలం వేయబోయే కొన్ని పెయింటింగ్‌ల ప్రామాణికతలపై పరువునష్టం కలిగించేలా వ్యవహరించారని ఆరోపించిన ఆంగ్ల దినపత్రిక 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఎడిటోరియల్ డైరెక్టర్, జర్నలిస్టులపై దాఖలైన కేసును కొట్టివేసినప్పుడు బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. భారతదేశంలోని ఆర్టికల్ 19(1)ఎ ప్రకారం స్వేచ్ఛగా మాట్లాడే హక్కు, భావ వ్యక్తీకరణ హక్కు చాలా ముఖ్యమైనదని గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉన్నదని మేం నొక్కి చెప్పాం. అదే సమయంలో మీడియాలో కీలక స్థానాలలో ఉన్న వ్యక్తులు, రచయితలు, ఏదైనా ప్రకటనలు, వార్తలు లేదా అభిప్రాయాలను ప్రచురించే ముందు చాలా జాగ్రత్తగా, భాధ్యతగా వ్యవహరించాలని మేం పునరుద్ఘాటిస్తున్నాం అని బెంచ్ ఫిబ్రవరి 18నాటి తీర్పులో చెప్పింది. ఆంగ్లరచయిత బుల్వర్ లిట్టన్‌ను ఉటంకిస్తూ 'కత్తికంటే కలం అత్యంత శక్తివంతమైనది' అని తెలిపింది. విస్తారమైన పరిధిని బట్టి ఒక కథనం మిలియన్లమందిని ప్రతిధ్వనిస్తుందని, వారి నమ్మకాలను, తీర్పులను రూపొందించగలదని అత్యున్నత న్యాయస్థానం ధర్మాసనం వెల్లడించింది. తమపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ప్రారంభించడాన్ని సవాల్ చేస్తూ తమ పిటిషన్‌ను కొట్టివేసిన కర్నాటక హైకోర్టు ఉత్తర్వులపై జర్నలిస్టులు దాఖలుచేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఐపిసి సెక్షన్ 499 (పరువు నష్టం)ఐపిసి సెక్షన్ 500(పరువునష్టం కోసం శిక్ష) కింద అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదుదారు (ఆర్ట్ ఆక్షన్ హౌస్) అన్ని ప్రముఖ వ్యక్తులచే ముద్రించబడిన, ప్రచురించబడిన, ప్రసారం చేయబడిన వార్తల కారణంగా పాఠకులు ఫిర్యాదుదారుని అనుమానంతో చూడటానికి కారణమయ్యారని ఇది బహిరంగ వేలం ద్వారా విక్రయించబడుతుందని , ఒక అన్యాయమైన, నిరాధారమైన ప్రజాభిప్రాయాన్ని పెంపొందించిందని ఆరోపించారు.

# రైల్వే జాబుల కుంభకోణం.. అధికారులపై 'సిబిఐ' కేసు

**న్యూఢిల్లీ:** రైల్వే ఉద్యోగాల భర్తీకి సంబంధించి తాజాగా మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కుంభకోణంలో రైల్వే ఉద్యోగాలతోపాటు ప్రధానంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడానికి లంచం తీసుకున్న కేసులు బయటపడ్డాయి. ఈ కేసులో ఇప్పటికే సీబీఐ అనేక మంది రైల్వే అధికారులపై కేసు నమోదు చేసింది. వదోదర, ముంబై సహా ఇతర ప్రాంతాల రైల్వే అధికారులపై కేసులు రికార్డయ్యాయి. ఈ కేసులో అంకుష్ వాసన్, సంజయ్ కుమార్ తివారీ, నీరజ్ సిన్హా , ముకేశ్ మీనా వంటి రైల్వే అధికారుల పేర్లు బయటకొచ్చాయి. వీరు అభ్యర్థుల నుంచి భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు తేలింది. సీబీఐకి అందిన సమాచారం ప్రకారం 10 మంది అభ్యర్థులు లంచం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో వారిని పట్టుకున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి అధికారులు రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ లావాదేవీలు నగదు రూపంలో కాకుండా బంగారం రూపంలో జరగడం విశేషం. పశ్చిమ రైల్వే నిర్వహించనున్న కమిటీ డిపార్ట్‌మెంల్ పరీక్షలో ఎంపిక కోసం లంచం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న 10 మంది అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని అంకుష్ వాసన్... సంజయ్ కుమార్ తివారీని ఆదేశించినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. ముకేశ్ మీనాతో టచ్‌లో ఉండి, అలాంటి అభ్యర్థులు ఎంత మంది సిద్ధంగా ఉన్నారో కనుక్కోమని, తద్వారా వారి నుంచి డబ్బు తీసుకోవచ్చని సంజయ్‌తో అంకుష్ చెప్పాడు. ఇప్పటికే ఐదుగురు అభ్యర్థుల నుంచి తాను డబ్బు తీసుకున్నట్లు ముకేశ్ మీనా తాను అంగీకరించారు. ఆ తరువాత వారు వసూలు చేసిన లంచాన్ని ముకేశ్ మీనా నేరుగా తివారీకి అందజేస్తామన్నారు. ఆ తర్వాత అంకుష్ వాసన్, ఎస్కే తివారీ మధ్య దీనిపై చర్చ జరిగేది. నేరం చేసినట్లు అధికారులు ఒప్పుకోవడంతో సీబీఐ ఈ కేసుకు సంబంధించి మరింత సమాచారాన్ని అధికారుల నుంచి రాబడుతోంది. ఈ స్కాంలో కేవలం రైల్వే అధికారులే కాకుండా, విభిన్న రైల్వే విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా భాగస్వాములు కావచ్చని అనుమానిస్తున్నారు. మరికొంత మందిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

# సిద్ధరామయ్య దంపతులకు ఊరట

## 'ముడా' కేసులో లోకాయుక్త క్లీన్‌చిట్



**బెంగళూరు:** కర్నాటకలో రాజకీయ దుమారం రేపిన ముడా భూముల కేటాయింపు కేసులో కర్నాటక సిఎం సిద్ధరామయ్య దంపతులకు లోకయుక్త పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు. సిద్ధరామయ్య, ఆయన సతీమణి పార్వతికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు బుధవారం తుది నివేదికను హైకోర్టుకు సమర్పించినట్లు దర్యాప్తు అధికారి తెలిపారు. ఎ1నుంచి ఎ4వరకు ముడా భూముల కేటాయింపు సంబంధించిన ఆరోపణల కేసులో వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని ఫిర్యాదుదారు స్నేహమయి కృష్ణకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ముడా కేసులో సీఎం సిద్ధరామయ్య, ఆయన సతీమణి పార్వతి, ఆయన బావమరిది మల్లికార్జున స్వామితోపాటు భూ యజమాని దేవరాజు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 138 రోజుల పాటు విస్తృత దర్యాప్తు జరిపిన తర్వాత ఈ నివేదికను సమర్పించారు. బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల పత్యేక కోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2024లో లోకాయుక్త ప్రారంభించిన దర్యాప్తునకు మైసూరు లోకాయుక్త పోలీసు సూపరింటెండెంట్ టిజెఉదేష్ నేతృత్వం వహించారు. అధికారులు, రాజకీయనాయకులు, రిటైర్డు అధికారులతోపాటు సిఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి వంటి కీలక వ్యక్తులతో సహా 100 మందికి పైగా వ్యక్తులను విచారించారు. మొత్తంగా వివాదాస్పద ఆస్తి, స్థల కేటాయింపులు ,నోటిఫికేషన్ ప్రక్రియలకు సంబంధించిన 3వే పేజీలకు పైగా పత్రాలను పరిశీలించినట్లు లోకాయుక్త వర్గాలు తెలిపాయి.
గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ సిఎం సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతి ఇచ్చిన తర్వాత సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా కోర్టు గత సంవత్సరం సెప్టెంబర్ 27న సిద్ధరామయ్య, మరో ము గ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది.

**ముడా కుంభకోణం ఇదే...**

మైసూరు పట్టణాభివద్ధి ప్రాధికార సంస్థ(ముడా) భూముల కేటాయింపుల వివాదంలో ఖరీదైన భూములు తన భార్య పార్వతికి దక్కేలా సిద్ధరామయ్య కుట్ర చేశారని సమాచార హక్కు చట్టం కార్యకర్తలు టీజే అబ్రహం, ఎస్‌పి ప్రదీప్, స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర గవర్నర్ ఏకంగా ముఖ్యమంత్రిపై విచారణ చేపట్టేందుకు అనుమతి ఇవ్వటం కర్నాటక రాజకీయల్లో సంచలనం సష్టించింది. కాగా, సిద్ధరామయ్య భార్య పార్వతికి మైసూరులోని కేసరే గ్రామంలో 3 ఎకరాల భూమి ఉంది. దాన్ని ఆమె సోదరుడు మల్లికార్జున్ ఆమెకు బహుమతిగా ఇచ్చారు. అయితే ఈ భూమిని అభివద్ధి కోసం ముడా స్వాధీనం చేసుకుంది. పరిహారం కింద 2021లో పార్వతికి దక్షిణ మైసూరులోని ప్రధాన ప్రాంతమైన విజయ నగర్‌లో 38,283 చదరపు అడుగుల ప్లాట్‌ను ప్రభుత్వం కేటాయించింది. పరిహారం కింది ఇచ్చిన ప్లాట్ మార్కెట్ విలువ కేసరేలో ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న భూమికంటే ఎక్కువ అని బీజేపీ ఆరోపించింది. దీంతో ముడా కుంభకోణం తెరపైకి వచ్చింది.

# ఆ నీళ్లు తాగేందుకు ఒకే:యోగి



**లక్నో:** విసర్జితాల కారణంగా ప్రయాగ్‌రాజ్‌లో పలు చోట్ల నదీ జలాలు కలుషితమయ్యాయంటూ వస్తున్న ఆరోపణలను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. నదీ జలాలపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. నదీ జలాలు స్నానాలకే కాకుండా తాగేందుకూ అనుకూలంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ప్రయాగ్‌రాజ్‌లోని గంగానదిలో ప్రమాదకర స్థాయిలో 'ఫేకల్ కోలిఫాం' బ్యాక్టీరియా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)... జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నివేదికపై బుధవారం అసెంబ్లీలో యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న మహాకుంభమేళా సందర్భంగా ఇప్పటికే 56.25 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేసినట్లు చెప్పారు. స్నానాలు చేసిన భక్తులు, ప్రముఖులు అక్కడి ఏర్పాట్లను ప్రశంసించినట్లు చెప్పారు. సనాతన ధర్మం, మా గంగ, దేశం, మహాకుంభ్‌పై నిరాధార ఆరోపణలు చేసినా, నకిలీ వీడియోలు ప్రదర్శించినా 56 కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ఆడుకున్నట్లేనని వ్యాఖ్యానించారు.

# అమెరికా 'ఎస్ఇసి' అభ్యర్థన మోదీ అంగీకరిస్తారా?



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే అదానీ సమస్యను వ్యక్తిగత విషయంగా ప్రకటించినందున ఆయన వ్యాపారాలపై దర్యాప్తు చేస్తున్న అమెరికాకు చెందిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) అభ్యర్థనను ఆయన అంగీకరిస్తారా కాంగ్రెస్ బుధవారం ప్రశ్నించింది. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీ, సాగర్ అదానీపై ఫిర్యాదును అందజేయడానికి తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, భారత అధికారుల సహకారం కోసం అభ్యర్థించినట్లు ఎస్ఇసి న్యూయార్క్‌లోని ఫెడరల్ న్యాయమూర్తికి చెప్పిన నేపథ్యంలో కాంగ్రెస్ ఈ వాదన తెరపైకి తెచ్చింది. గౌతమ్ అదానీ, అతని సహచరులు కొందరు అమెరికా చట్టాలను ఉల్లంఘించారని ఫిర్యాదులు అందజేయడానికి భారత్‌లోని మోదీ ప్రభుత్వం సహాయం కోరినట్లు ఎస్ఇసి న్యూయార్క్ జిల్లా కోర్టుకు తెలియజేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇంఛార్జ్) జైరాం రమేశ్ తెలిపారు. ''మోదానీ సమస్యను ప్రధాని ఇప్పటికే వ్యక్తిగత విషయంగా ప్రకటించారు. ఆయన ఎస్ఇసిని ఒప్పిస్తారా? అని 'ఎక్స్' వేదికగా రమేశ్ ప్రశ్నించారు. గత వారం వాషింగ్టన్‌లో డోనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో అదానీకి సంబంధించిన అంశం చర్చల్లో ఉందా అనే ప్రశ్నకు, మోదీ ఏమన్నారంటే... ''భారత్ ప్రజాస్వామ్య దేశం. మా సంస్కృతి 'వసుధైక కుటుంబకం' మేము మొత్తం ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా పరిగణిస్తాము. ప్రతి భారతీయుడు నావాడని నేను నమ్ముతున్నాను. రెండు దేశాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నాయకులు ఎప్పుడూ అలాంటి వ్యక్తిగత సమస్యలను చర్చించరు'' అని సమాధానమిచ్చారు. గౌతమ్ అదానీ, సాగర్ అదానీపై తన ఫిర్యాదును అందించడానికి చేసిన ప్రయత్నాలకు సంబంధించి ఎస్ఇసి మంగళవారం న్యూయార్క్‌లోని డిస్ట్రిక్ట్ కోర్టులో న్యాయమూర్తి నికోలస్ గరౌఫిస్‌కు తాజా పరిస్థితి నివేదించింది.

# మార్చి 19న విచారిస్తాం.. ఇసిల నియామకాలపై సుప్రీం



**న్యూఢిల్లీ:** ఎన్నికల కమిషనర్ల నియామక చట్టానికి సంబంధించి సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. ఈ ఫిర్యాదులపై మార్చి 19న విచారిస్తామంటూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)ని తొలగించడం, ప్రత్యేక చట్టం ద్వారా కేంద్ర మంత్రిని కేంద్రం నియమించడం విదితమే. దీనిపై సుప్రీం కోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం వీటిని అత్యవసరంగా విచారించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్లు (ఇసిలు) నియామకానికి తెచ్చిన కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పటిషన్లను మార్చి 19న విచారిస్తామని, ఈలోగా విచారించేందుకు తేదీలు లేవని తెలిపింది. విచారణ సమయంలో పిటిషనర్ ఎన్‌జీవో 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. కొత్త చట్టం ప్రకారంసిఇసి, ఇసిల నియామకం జరిగినట్లు కోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ఆలశ్యం చేయొద్దని కోరారు. ఇది కీలకమైన కేసు అని, ఎక్కువ సమయం కూడా తీసుకోదన్నారు. పిటిషనర్లకు ఒక గంట సమయం ఇస్తే సరిపోతుందని అన్నారు. అయితే ధర్మాసనం ఆయన మాటలను బేఖాతరు చేస్తూ మార్చి 19వ తేదీకి ముందు దీనిపై విచారించేందుకు సమయం లేదని ఖరాఖండీగా చెప్పేసింది. ఇదిలావుంటే, విచారణ ప్రారంభమైన కాసేపటికే రాజ్యాంగ ధర్మాసనం ముందు హాజరు కావాల్సి ఉందని చెప్పి విచారణను వాయిదా వేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. ప్రతి కేసులో వాయిదా కోరడం సరికాదని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అభ్యంతరం తెలిపారు. సొలిసిటర్ జనరల్ అందుబాటులో లేకపోతే.... 17 మంది న్యాయాధికారులు ఉంటారని, వాయిదా అవసరం ఏమిటని ప్రశ్నించారు. ధర్మాసనం జోక్యం చేసుకుని సొలిసిటర్ జనరల్ ఎప్పుడు అందుబాటులో ఉంటారో చెప్పాలని కోరింది. వాదనల అనంతరం విచారణను వాయిదా వేసింది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం నియామకాలపై 2023లో సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సిఇసి, ఇసిల ఎంపిక కోసం ఏర్పాటు చేసే ప్యానల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తిని చేర్చాలని పేర్కొంది. ప్రధాని, ప్రతిపక్ష నేత, సిజెఐ ఆ ప్యానల్‌లో ఉండాలి కానీ కేంద్రం ఆ తీర్పును పట్టించుకోకుండా సిజెఐని మినహాయించింది. ఆయన స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చింది. ఈ మేరకు కొత్త చట్టం తెచ్చింది. దాని ప్రకారమే నియామకాలు జరుగుతున్నట్లు తెలిపింది. దీంతో కొత్త చట్టం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా...ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉందని, కేంద్రం పెత్తనం పెంచుతోందని సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

# సంకెళ్లతో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన



**గాంధీనగర్:** సరైన పత్రాలు లేని వలసదారులైన భారతీయులను అమెరికా ప్రభుత్వం అమానవీయంగా స్వదేశానికి పంపింది. అమెరికా చర్యపై ప్రధాని నరేంద్రమోదీ మౌనం వహించడం పట్ల ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఖైదీలు మాదిరిగా భారతీయులకు సంకెళ్లు వేసి స్వదేశానికి పంపడం వంటి చర్యకు వ్యతిరేకంగా గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన చేశారు. బుధవారం గాంధీనగర్‌లోని అసెంబ్లీ వెలుపల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. భారతీయుల పట్ల ఈ అగౌరవాన్ని భారతదేశం సహించదంటూ నినాదాలు చేశారు. కాగా, తాజాగా 112 మంది భారతీయుల్ని అమెరికా విమానం ద్వారా అమత్‌సర్‌కి చేర్చింది. గతంలో ఫిబ్రవరి 5వ తేదీన మొదటిసారి భారతీయ వలసదారుల్ని అమత్‌సర్‌కి చేర్చిన సంగతి తెలిసిందే.

# ఆ భూమి కొనుగోలులో అక్రమాల్లేవ్

## కేంద్ర మంత్రి కుమారస్వామి స్పష్టీకరణ



**బెంగళూరు :** నాలుగు దశాబ్దాల క్రితం తాను కొనుగోలు చేసిన భూమిలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం స్పష్టం చేశారు. రామనగర జిల్లాలో తనకు చెందిన భూమిని రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేస్తుండటంతో ఆయన వ్యాఖ్యలు చేశారు. తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొంటూ జేడీ(ఎస్) నాయకుడు... రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కూడా విమర్శలు చేశారు. 'నేను 40 సంవత్సరాల క్రితం భూమిని కొనుగోలు చేశాను. నలభై సంవత్సరాలుగా, సర్వేలు, దర్యాప్తులు చాలాసార్లు జరిగాయి. నేను దానికి సిద్ధంగా ఉన్నాను. 40 సంవత్సరాలుగా ఫిర్యాదుదారులు లేరు. ఇప్పుడు అకస్మాత్తుగా అవి ఎలా బయటపడ్డాయి?' అని కుమారస్వామి ప్రశ్నించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 198687 లోనే కాంగ్రెస్ నాయకుడు సీఎం లింగప్ప, జిల్లా పంచాయతీ సభ్యుడు రామచంద్ర, ఆ భూమిని అక్రమంగా కొనుగోలు చేశారని ఆరోపిస్తూ అప్పటి ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి, హోం మంత్రి ఇతరులకు ఒక పిటిషన్ సమర్పించారని ఆయన ఎత్తి చూపారు. 'నా దగ్గర అన్ని పత్రాలు ఉన్నాయి. ఇప్పటి వరకు నాకు హైకోర్టు నుంచి ఎటువంటి నోటీసు రాలేదు. నా ఆధీనంలో ఉన్న భూమిని సర్వే చేయడానికి అధికారులు వస్తున్నారని తెలుసుకున్న తర్వాత, నేను ప్రిన్సిపల్ కార్యదర్శి, డిప్యూటీ కమిషనర్‌ను ప్రశ్నించాను. ఆ తర్వాత వారు నోటీసు ఇచ్చారు. నేను సర్వేకు అనుమతి ఇచ్చాను. వారు ఏ అంతర్జాతీయ సంస్థ ద్వారానైనా సర్వే చేయించుకోవచ్చని కూడా చెప్పాను' అని అన్నారు. ఎవరు ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారో, ప్రభుత్వ భూములను ఇతరులు ఎలా అక్రమంగా స్వాధీనం చేసుకున్నారో తన వద్ద డాక్యుమెంటరీ ఆధారాలు ఉన్నాయని చెప్పారు. 'కానీ నేటి వ్యవస్థలో, తార్కిక ముగింపును చేరుకోలేం' అని అన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం రామనగర జిల్లాలోని బిడడి హుబ్లీలోని కేతగనహల్లి వద్ద కుమారస్వామి వ్యవసాయ భూమిని సర్వే నిర్వహించారు. కుమారస్వామి 14 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని సామాజిక కార్యకర్తలు ఆరోపించారు. హైకోర్టు రెవెన్యూ శాఖను నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

# 24న పిఎం కిసాన్ నిధులు జమ




**న్యూఢిల్లీ:** అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎంకిసాన్ పథకం 19వ విడత నిధుల విడుదలకు తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 24న రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. బీహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులు విడుదల చేయనున్నారు. 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనున్నట్లు అధికారులు వెల్లడించారు. పీఎం కిసాన్ నిధులు అందుకోవాలంటే అర్హులైన రైతులు ఎన్‌పీసీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాను కలిగిఉండాలి. ఇకేవైసీ చేసి ఉండాలి. ఒకవేళ పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన స్టేటస్ తెలుసుకోవాలన్నా, పీఎం కిసాన్ జాబితాలో మీ పేరు ఉందో, లేదో చూడాలన్నా సంబంధిత వెబ్‌సైట్‌లో చూసుకోవడానికి అవకాశం ఉంది. ఆయా వివరాలు పొందడానికి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్/ ఆధార్ నంబర్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. పీఎం కిసాన్ మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉంది.

# మీ సొమ్మేమన్న ఇస్తున్నరా?: ఉదయనిధి




**చెన్నై:** తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ కేంద్ర ప్రభుత్వంపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తమిళనాడుకు రావాల్సిన సమగ్రశిక్ష అభియాన్ రూ.2190 కోట్ల నిధులు తామేమీ అడుక్కోవడం లేదన్నారు. 'మేమేమీ మీ తండ్రి సంపాదించిన సొమ్ము అడగడం లేదు. మాకు హక్కుగా రావాల్సిన నిధులే అడుగుతున్నాం. తమిళనాడు ప్రజలు కట్టే పన్ను డబ్బులనే మేం అడుతున్నాం. బీజేపీ బెదిరింపులకు భయపడేదే లేదు. తమిళనాడుపై హిందీని రుద్దాలని చూస్తున్నారు. రాష్ట్రంలోని రెండు భాషల పాలసీ ప్రస్తుతం ప్రమాదంలో పడింది. ఈ విషయంలో ఫాసిస్టు బీజేపీపై పోరాడేందుకు ప్రతిపక్షం అన్నాడీఎంకే మాతో కలిసి రావాలి. తమిళనాడు ప్రజలను బీజేపీ రెండో శ్రేణి పౌరులుగా మార్చాలని చూస్తోంది' అని ఉదయనిధి మండిపడ్డారు. జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) కింద మూడు భాషల పాలసీని అమలు చేసేదాకా తమిళనాడుకు సమగ్ర శిక్ష అభియాన్ కింద నిధులు ఇచ్చేది లేదని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల స్పష్టం చేసిన నేపథ్యంలో ఉదయనిధి స్పందించారు.

# మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

## కశ్మీర్ విద్యార్థిని కొట్టిన సీనియర్లు

**బెంగళూరు:** మరో మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ సంఘటన వెలుగులోకి వచ్చింది. జమ్మూకశ్మీర్‌కు చెందిన జూనియర్ విద్యార్థిని సీనియర్లు కొట్టారు. అతడ్ని హింసించటంతోపాటు బలవంతంగా క్షమాపణలు చెప్పించారు. స్థానికులమైన తాము అతడి భవిష్యత్తును భయానకం చేస్తామని హెచ్చరించారు. కర్నాటకలోని విజయపుర జిల్లాలో ఈ ఘటన జరిగింది. స్థానిక అల్ అమీన్ మెడికల్ కాలేజీలో జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్‌కు చెందిన హమీమ్ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఫిబ్రవరి 18న సాయంత్రం ఆ కాలేజీ ఆవరణలో 2019, 2022 బ్యాచ్‌ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. క్రికెట్ ప్లేయర్ అయిన హమీమ్ ఆ మ్యాచ్ చూసేందుకు అక్కడకు వెళ్లాడు. అయితే బౌండరీ లైన్ బయట ఉండాలని ఒక సీనియర్ విద్యార్థి ఆదేశించాడు. సీనియర్ల క్రికెట్ మ్యాచ్ చూడటాన్ని నిలదీశారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పారు. నిరాకరించిన హమీమ్‌పై ర్యాంగింగ్‌కు పాల్పడ్డారు. పాటలు పాడాలని, డ్యాన్స్ చేయాలని బలవంతం చేశారు. కారులోకి ఎక్కించేందుకు ప్రయత్నించారు. మరోవైపు సీనియర్ల ర్యాగింగ్‌ను రికార్డ్ చేసేందుకు హమీమ్ ప్రయత్నించాడు. దీంతో అతడిని మరింతగా హింసించారు. ఆ రాత్రి సుమారు ఎనిమిది మంది సీనియర్లు హమీమ్ హాస్టల్ గదికి వెళ్లారు. దారుణంగా కొట్టారు. బలవంతంగా క్షమాపణలు చెప్పించారు. 'నువ్వు ఇంకా నాలుగు సంవత్సరాలు ఇక్కడ ఉండాలి. మేం స్థానికులం. నీ జీవితాన్ని ఎంత భయంకరంగా మార్చగలమో ఊహించుకో' అని అతడిని బెదిరించారు. ఇకపై కాలేజీలో క్రికెట్ ఆడకూడదని హెచ్చరించారు.



## ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం ఉండొద్దు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** రానున్న వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో మంచి నీటి సరఫరా పై మిషన్ భగీరథ ఎస్‌ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంచి నీటి సరఫరా పరిస్థితిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లడుతూ జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాలలో ఉన్న చేతి పంపులు, సింగల్ ఫేస్ మోటర్లు, త్రీఫేస్ మోటర్లు, ఓపెన్ వెల్స్ అన్నీ కూడా పనిచేయునట్లు చూసుకోవలసిన బాధ్యత పంచాయతీ సెక్రటరీలకు ఎంపీలకు ఉన్నదని చెప్పడం జరిగినది. ఫిబ్రవరి 1న యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామని, దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమం చీఫ్ ఇంజనీర్ లలిత, జడ్పీ సీఈఓ శోభారాణి, మిషన్ భగీరథ ఎస్‌ఈ కృష్ణయ్య, ఈఈ కరుణాకరన్, ఈఈ లక్ష్మి నారాయణ, డీపీవో సునంద, డిఇలు, డిఎల్‌పిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడిఓలు, యంపిఓలు, ఏఈలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొర్రీలు లేకుండా రైతుభరోసా

సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(గరిడేపల్లి) :** సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,ఎటువంటి కొర్రీలు లేకుండా రైతులందరికీ ఇస్తానన్న రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని సిపిఐ పార్టీ గరిడేపల్లి మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల పరిధిలోని గానుగబండ లోని రైతువేధిక వద్ద సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవో త్రివేణికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండవ సంవత్సరం గడుస్తున్నా రైతులకు పెట్టుబడి సహాయం క్రింద ఇస్తానన్న 15వేల రూపాయలను ఇప్పటి వరకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరించాలని లేకపోతే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాకతప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య,కుందూరు వెంకటరెడ్డి,ఏఐవైఎఫ్ నాయకులు,పంగ సైదులు,మెండే లింగరాజు,షేక్ ఖాసీం,రామాచారి,రామచంద్రయ్య,షేక్ పెద్ద ఖాసీం,పసుపులేటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం రహదారిపై రైతుల ధర్నా



**ప్రజాపక్షం/నూతనకల్:** ఎస్ఆర్ఎస్‌పి ఆయకట్టు పరిధిలో సాగుచేసిన పంట పొలాలు నీరు అందక ఎండిపోతుండడంతో బుధవారం మండలంలోని సూర్యాపేటదంతాలపల్లి రహదారి ఎర్రపహాడ్ ఎక్స్ రోడ్డు వద్ద రైతులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మద్ది సంజీవరెడ్డి, దేవిరెడ్డి మల్లారెడ్డి, బయ్య ముత్యాలులు మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్‌పి నీటిపై ఆధారపడి తాము వరి పంటను సాగు చేశామని తెలిపారు. కాల్వ ద్వారా నీరు చివరి ఆయకట్టు వరకు రాకపోవడంతో తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టదశలో ఉన్న పొలాలకు నీరు అందకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. బోర్లు, బావుల ద్వారా తమ పంటలను కాపాడుకుందామన్న అవికూడ అడుగంటడంతో తమ పంటపొలాలను కాపాడలేకపోతున్నామన్నారు. అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సాగునీరు అందించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతులు సాబాది మల్లారెడ్డి, బద్దం లింగారెడ్డి, బయ్య అశోక్, జక్కుల వెంకన్న, సైరెడ్డి వీరారెడ్డి, ఆకుల సతీష్, యాసా సూరారెడ్డి, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

## లింగన్నను దర్శించుకున్న మల్టీజోన్-2 ఐజి సత్యనారాయణ



**ప్రజాపక్షం/చివ్వెంల:** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర సందర్భంగా బుధవారం మల్టీజోన్2 ఐజి సత్యనారాయణ లింగన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ట్రస్టుబోర్డు సభ్యులు, దేవాదాయశాఖ అధికారులు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

**పోలీసులు సేవలు భేష్..** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరలో పోలీసుల సేవలు భేష్‌గా ఉన్నాయని మల్టీజోన్2 ఐజి సత్యనారాయణ అన్నారు. ఐదు రోజుల పాటు జాతరలో విధులు నిర్వహిస్తున్న పోలీసులను ఆయన అభినందించారు. అనంతరం జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్‌తో కలిసి జాతరలో పోలీస్ బందోబస్తు, జాతర సరళిను పరిశీలించారు. పోలీస్ కంట్రోల్ సెంటర్‌ను చూసిన ఆయన పార్కింగ్, వాహనాల మళ్లింపు, సిబ్బంది భోజన వసతి, సిసి కెమెరాల నిఘా, హెల్ప్ లైన్ సెంటర్, క్రైం డైటెక్షన్ టీమ్స్‌పై చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి రవి, రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ పాల్గొన్నారు.

**పెద్దగట్టు లింగన్నను దర్శించిన ఎమ్మెల్యే మందుల సామేల్**



పెద్దగట్టు శ్రీ లింగమంతుల స్వామిని బుధవారం తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి జ్ఞాపిక ను అందజేశారు.

# రూ. 60కోట్లతో పెద్దగట్టు అభివృద్ధి చేస్తాం

బిఆర్ఎస్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాపై వివక్ష
అందుకే గత ఎన్నికల్లో 11 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు
మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరొందిన శ్రీ లింగమంతుల స్వామి(పెద్దగట్టు)ను రూ. 60కోట్లతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్ల, భవనాలు, సినీఫోటోగ్రాఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర సందర్భంగా దురాజ్‌పల్లి పెద్ద గట్టుకు ఆలేరు, నకిరేకల్, మిర్యాలగూడ శాసన సభ్యులతో విచ్చేసి లింగన్న, చౌడమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, దేవాదాయశాఖ అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ళ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి కుంటుపడిందన్నారు. నాటి పాలకులు పూర్తిగా విస్మరించడంలో గత ఎన్నికల్లో 11 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కూడా కోల్పోయారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో 2లక్షల కోట్ల అవినీతి జరిగిందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడతోనే నీటిని విడుదల చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఎస్ఆర్ఎస్‌పి కాల్వలను తవ్వి గోదావరి జలాలను అందించినట్లు తెలిపారు. ఎస్ఎల్‌బిసి సొరంగం పనులను గత పదేళ్ళ కాలంలో కెసిఆర్ ప్రభుత్వం విస్మరించడంతో తమ ప్రభుత్వం అధికారంలో రాగానే సొరంగం పనులు పునః ప్రారంభించామన్నారు. శ్రీశైలం ఎడమ కాల్వ సొరంగం పనులు పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కృష్ణజలాలను మళ్లించి సస్యశ్యామలంగా మారుస్తామన్నారు. ఎంఎల్‌సి కవిత పెద్దగట్టు లింగన్నను దర్శించుకున్న సందర్భంగా కాంగ్రెస్ పాలనపై చేసిన అవాకులు చవాకులలో పసలేదన్నారు. రాష్ట్రంలో 20 ఏళ్ళు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పిసిసి సభ్యులు కొప్పుల వేణారెడ్డిలు ఉన్నారు.

## సాగునీరు లేక ఎండుతున్న వరిపైరు

తాగునీరు లేక మండల ప్రజల తీవ్ర ఇబ్బందులు..

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా రైతులు వరి నార్లు వేసుకొని వరి పండిస్తున్న నేపథ్యంలో ప్రకృతి కరుణించక ఈ సారి కొద్దిపాటి వర్షాలు రావడం జరిగిందని ఇది కాకుండా నవాబు పేట రిజర్వాయర్ నుండి బిక్కేరు వాగు ద్వారా అయిన నీరు అందితే ఈ సారైన మంచి పంట పండుతుందనే ఆశతో రైతన్న ఎదు రుచూస్తున్న తరుణంలో తీరా కొన్ని గ్రామాలకు మాత్రమే రిజర్వాయర్ నుండి నీరు రావడంతో మిగిలిన గ్రామాలలోని రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయిందని రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అప్పులు తెచ్చి పంట పండిస్తున్న రైతున్నకు నీరు సకాలంలో వర్షాలు, పడక ప్రభుత్వాలు నీరు అందించక తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. గుండాల మండల వ్యాప్తంగా ఉన్న కుంటలు, చెరువులు నీరు లేక అడుగండిపోయాయని గోదావరి జలాలతో వాటిని నింపి మండలంలోని రైతన్నలకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ఎండా కాలం ప్రారంభం కాకముందు నీటి ఎద్దడి మొదలైందని తక్షణమే ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య స్పందించి అధికారులతో చర్చించి ప్రజలకు, రైతులకు నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు

# ఆడ పిల్లలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆడపిల్లలు సమాజంలో సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు రుతుక్రమంపై అవగాహన సదస్సును పట్టణంలోని రైతువేదికలో నిర్వహించగా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆడ పిల్లలు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే తగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడబ్లువో కృష్ణవేణి, సీడీపీవో మమత, బీఆర్‌బీ కోఆర్డినేటర్ హరిత, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో శేషగిరిశర్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతావాణి, సుచరిత, గీత, అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి...కలెక్టర్**

రానున్న వేసవిలో మండలంలో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో తాగునీటి ఎద్దడిపై సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రజలకు నీటిని అందించాలంటే సుమారు 6836900 లీటర్లు అవసరం ఉంటుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేసి ప్రతిరోజు నీటిని అందించాలన్నారు. నీటి ఎద్దడి లేకుండా చూడాలని, గ్రామపంచాయతలీల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఇక్కడే పరిష్కరించాలని, మేజర్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## బైక్ నుంచి రూ.2 లక్షలు చోరీ



**ప్రజా పక్షం/ హాలియా:** హాలియాలోని ఎస్బిఐ బ్యాంకు నుంచి 2 లక్షల రూపాయలు విత్ డ్రా చేసుకొని వస్తున్న వ్యక్తి బైక్ నుంచి 2 లక్షల రూపాయలు చోరీకి గురైన సంఘటన బుధవారం హాలియాలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు హాలియా ఎస్ఐ సతీష్ రెడ్డి తెలిపిన ప్రకారం పెద్దవూర మండలం తెప్పలమడుగు గ్రామానికి చెందిన కొండలు అనే వ్యక్తి బుధవారం ఉదయం హాలియాలోని ఎస్ బీ ఐ బ్యాంకు నుంచి 2 లక్షల రూపాయలు విత్ డ్రా చేసుకున్నాడు. విత్ డ్రా చేసుకున్న డబ్బులను తన బైక్ లో ముందు పెట్టుకుని దేవరకొండ రోడ్డులోని వెంకటేశ్వర ఫర్టిలైజర్ వద్ద బైక్ ఆపి షాపులోకి వెళ్ళినట్టు తెలిపారు. అయితే కొండల్ డబ్బులను విత్ డ్రా చేసుకొని బ్యాంకు నుంచి వస్తున్న విషయాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు కొండల్ ని అనుసరించి ఆయన వెంట వెళ్లారు. కొండల్ దేవరకొండ రోడ్ లో గల వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాప్ వద్ద బైక్ ఆపి షాపులోకి వెళ్ళినట్లు తెలిపారు. తిరిగి బైకు వద్దకు వచ్చి చూడగా అందులో డబ్బులు చోరీకి గురైనట్లు కొండల్ గుర్తించారు. దీంతో వెంటనే బాధిత వ్యక్తి కొండల్ హాలియా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చెప్పారు. అయితే సిసి ఫుటేజీలో ఎరుపు నలుపు రంగు గల పల్సర్ బైక్ పై ఇద్దరు వ్యక్తులు వెళుతున్న చిత్రాలు అందులో నిక్షిప్తమయ్యాయి. ఈ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు.

## స్వర్ణవిమాన గోపుర మహాకుంభాభిషేకాలు ప్రారంభం

**ప్రజాపక్షం/ యాదగిరిగుట్ట:** శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వర్ణవిమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ ప్రతిష్టామహోత్సవాలు షురూ అయ్యాయి. ఇవాళ తెల్లవారు జామున ప్రధానాలయ ముఖ మంటపంలో స్వస్తి వాచనం, పుణ్యాహవచనం, విష్వక్సేన ఆరాధన, రిత్విక్ వరణం, మృత్సంగ్రహణం, రక్షాబంధనంతో ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. అనంతరం లక్ష్మి సమేత నారసింహుడిని ప్రత్యేక అలంకారంలో ప్రధానాలయం నుంచి యాగశాల వరకు తిరువీధి సేవ చేపట్టి యాగశాల ప్రవేశం గావించారు. అనంతరం అఖండ దీపారాధన, సద్యాంకు రార్పణ, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, అగ్ని ప్రతిష్ట పూజలు చేసి పాంచరాత్ర ఆగమ శాస్త్రం పద్ధతుల్లో పంచకుండాత్మక సుదర్శన నృసింహ యాగానికి అంకురార్పణ చేశారు. 108 మంది రుత్వికుల మంత్రోచ్చారణల, పారాయణీకుల వేదపారాయణాల నడుమ ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. 23న ఉదయం స్వర్ణమయమైన స్వామివారి దివ్యవిమాన గోపురానికి, సుదర్శన చక్రానికి మహాకుంభ సంప్రోక్షణ చేయనున్నారు.



# గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధికి సమష్టి కృషి

అధికారులతో సమీక్ష చేపట్టిన జిల్లా కలెక్టర్ సంతోష్



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి :** గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వనరులను వినియోగించుకుని గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు.బుధవారం గద్వాల మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పౌరుల ప్రాథమిక అవసరాలను తీర్చడమే లక్ష్యంగా మున్సిపల్ సిబ్బంది పని చేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 37 వార్డులపై రెవెన్యూ,పారిశుధ్యం, మెప్మా అకౌంట్స్, ఇంజనీరింగ్ వంటి విభాగాల వారీగా సమీక్ష నిర్వహించి, ప్రతి అంశంపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు.మున్సిపల్ ఆదాయం పెంచుకునే విధంగా వార్డుల వారీగా ఆస్థి,భూమి, దుకాణాల అద్దె వసూళ్లను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. అకౌంట్స్ వివరాలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు.వార్డులలో పారుశుద్యాన్ని మెరుగుపర్చాలన్నారు. విద్యుత్, త్రాగునీరు వంటి అన్ని విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వార్డులలో చేపట్టిన పనులను స్వయంగా పరిశీలిస్తానని,త్వరలో సమీక్ష సమావేశం నిర్వహిస్తానన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,మున్సిపల్ కమిషనర్ దశరధ్,వార్డు అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇవిఎంల స్ట్రాంగ్ రూంకు పటిష్ట భద్రత**

ఇవిఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సంతోష్ తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమును జిల్లా కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాధారణ తనిఖీలో భాగంగా ఈవిఎంలను పరిశీలించారు.అదే విధంగా భద్రతా నిర్వహణను,రికార్డులు,సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు ఇమ్మాన్యుయేల్,బిఆర్ఎస్ నాయకులు తిరుమల్,రహమన్, గద్వాల తహశీల్దార్ మల్లికార్జున్,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు పక్కా ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని ఇమాంపేట సమీపంలో ఉన్న మిషన్ భగీరథ నీటిశుద్ధి 95ఎంఎల్‌డి కేంద్రాన్ని ఆయన నీటి పారుదలశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నీటి శుద్ధికేంద్రం పరిధిలోని రెండు మున్సిపాలిటీలు సూర్యాపేట, కోదాడతో పాటు చిలుకూరు, కోదాడ రూరల్, అనంతగిరి, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్, సూర్యాపేట రూరల్ పరిధిలోని గ్రామాల్లోని ఆవాసాలన్నింటికి మిషన్ భగీరథ తాగునీరు నిరంతరం అందించాలన్నారు. నీటి సరఫరాపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకోని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కరుణాకర్ రెడ్డి, ఇంట్రా ఈఈ శ్రీనివాసరావు, డిపిఓ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మిషన్ భగీరథ డిఇ రాజేందర్, భూక్య పాండు నాయక్ పాల్గొన్నారు.

**వ్యవసాయానికి విడతలవారిగా సాగునీరు అందించాలి**

ఎస్ఆర్ఎస్‌పి ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ సాగు పంటలకు విడతల వారిగా సాగునీరు అందిచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని దాస్‌తండ సమీపంలోని ఎస్ఆర్ఎస్‌పి డిబిఎం71ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఆ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తూ సాగునీరు సరఫరా చేయాలన్నారు. మొదటి మూడు రోజులు ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, సూర్యాపేట రూరల్ మండలాలకు తదుపరి మూడు రోజుల పాటు మోతె, పెన్‌పహాడ్, నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని పంట భూములకు సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. డిబిఎం 22 ద్వారా మోతె మండలానికి సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదలశాఖ సిఈ రమేష్ బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ శ్రీనివాసరావు, డిఇ రమేష్, ఎఈలు భూక్యా పాండు నాయక్, ఉదయ్, లింగయ్య పాల్గొన్నారు.

# సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఈ నెల 23న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవమునకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నందున పకడ్బందీగా పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతూ పర్యవేక్షణ చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం యాదగిరిగుట్ట దేవస్థాన కార్యాలయంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ హనుమంత రావు, అడిషనల్ డిసిపి లక్ష్మి నారాయణ, ఆలయ ఈఓ భాస్కరరావు, సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన నిర్వహించే స్వామివారి బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతున్న నేపథ్యంలో పూర్తి భద్రత కల్పించాలని పోలీస్ శాఖ అధికారులకు ఆదేశించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. భోజన వసతి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు కేటాయించిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. విఐపి, వివిఐపిలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుండి దేవాలయానికి ఎక్కువ మంది భక్తులు వస్తారని, దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లను సక్రమంగా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. భద్రత ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలను పర్యవేక్షిస్తూ, ప్రోటోకాల్ ప్రకారంగా అన్ని ఏర్పాట్లు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని, ఆలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఆలయ పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. ఎమర్జెన్సీ సేవలను అందుబాటులో ఉంచాలని, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, సిపిఆర్ చేసే వైద్యులను కూడా అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. సూదుర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ వారు అదనపు బస్సులు నడపడంతో పాటు, రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూడాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా, జనరేటర్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. 23వ తేదీన జరిగే మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ భారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఏసిపి రమేష్, మండల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పికట్ల బాలకృష్ణ మృతి పట్ల సంతాపం



ప్రజాపక్షం/జూలూరుపాడు:హమాలి వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) పాపకొల్లు సీనియర్ నాయకులు అప్పికట్ల బాలకృష్ణ మృతి పట్ల సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారి పార్థీవదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఆయన మృతి పట్ల సిపిఐ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు,నరాటి ప్రసాద్, కంచర్ల జమ్మలయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వాసుపత్రులను తనిఖీ చేసిన రాష్ట్రస్థాయి టాస్క్ ఫోర్స్ బృందం



ప్రజాపక్షం/కల్లూరు:కల్లూరు లోని ప్రభుత్వఆసుపత్రులను రాష్ట్రస్థాయి టాస్క్ ఫోర్స్ బృందం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు మెడికల్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ టాస్కోర్స్ టీం ఖమ్మం జిల్లా శశి, అసోసియేట్ ప్రొఫెసర్ టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు పీహెచ్సీ మరియు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సలహాలు సూచనలు చేస్తూ వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, సాధారణ కానుపులు పెంచాలని, ఆసుపత్రి సేవలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో పొందుపరచాలని, ఫార్మసీ మరియు వ్యాక్షన్, నిల్వలను గదులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. డాక్టర్స్ దుమ్మా కొడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ సీతారాం, వైద్య విధాన పరిషత్ కల్లూరు కేంద్రం అధికారి రమేష్, పిహెచ్సి అధికారి నవ్యకాంత్ మౌనిక, శృతి, వైద్యులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగళ్ల సీతారామకృష్ణ(39) అనే యువకుడు బైక్ ఢీ కొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. నాగళ్ల సీతారామకృష్ణ కొంత కాలంగా సత్తుపల్లి పట్టణంలో ఎల్జీ షోరూం నందు వృత్తి రీత్యా ఎలక్ట్రిషన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున వాకింగ్ ముగించుకొని ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో మంచు బాగా పడటంలో వెనుక నుండి వచ్చిన టూ వీలర్ బైక్ బలంగా ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాలు కాగా, ఈ ప్రమాదంలో సంఘటన స్థలం వద్దనే తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోక సముద్రంలో మునిగిపోయారు. మిత్రులు శ్రేయోభిలాషులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## వరద బాధితులకు కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మున్నేరు వరద ముంపు బాధితులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ సారథ్యంలో నిర్మాణ్ ఫౌండేషన్, హెచ్ఎస్‌బిసి ఐటి వింగ్ ఆర్థిక సహకారంతో బుధవారం బైపాస్ రోడ్డు నందు గల కృష్ణా ఫంక్షన్ హాల్‌లో మున్నేరు వరద ముంపు బాధితులకు ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు చేతుల మీదుగా 200 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, నాళం సతీష్, అస్రీఫ్, దొబ్బల సురేష్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి సమ్మె నాటి కేసు కొట్టి వేత

ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ : 2020 సంవత్సరంలో ఆర్టిసి కార్మికుల సమ్మె సందర్భంగా నమోదైన కేసును బుధవారం ఖమ్మం ఫస్ట్ ఎడిషన్ జడ్జ్ రజని కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. ఆర్టిసి సమ్మె 55 రోజులు సాగిన సందర్భంలో మహిళా కండక్టర్ నీరజ ఖమ్మంలో తన నివాసంలో ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీలు, వాటి అనుబంధ సంఘాల నేతలు నీరజ మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలపై 124/2020 సెక్షన్ క్రింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కేసును కొట్టివేశారు. ఈ కేసులో సిపిఐ నాయకులు బాగం హేమంతరావు, సిపిఎం నాయకులు పోతినేని సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఐటియుసి నాయకులు మంద వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు చోటా బాబా, తాజుద్దీన్ తదితరులు ఉన్నారు. కేసును సీనియర్ న్యాయవాదులు ఓరుగంటి శేషగిరిరావు, ఏడునూతల శ్రీనివాసరావు లు వాదించారు.

## 22న న్యాయవాదులకు అవగాహన తరగతులు

ప్రజాపక్షం/ఖమ్మం లీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో ఈనెల 22న న్యాయవాదులకు కృత్రిమ మేధస్సు, క్రాస్ ఎగ్జామినేషన్ ఇన్ క్రిమినల్ కేసెస్ అనే అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు లు తెలిపారు. డిపిఆర్‌సి భవనంలో ఉదయం 10 గంటలకు ఈ అవగాహన తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పైన పేర్కొన్న అంశాలను బోధించడానికి ప్రముఖ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి, బెక్కం భగత్‌సేన్ హాజరవుతారని వారు తెలిపారు.

## రూ.11 లక్షలు విలువ చేసే గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఒరిస్సా నుంచి మహరాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని స్థానిక రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని కేసున మోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్ సిఐ ఎన్ అంజలి తెలిపారు. మహారాష్ట్ర లోని సెలు తాలుకా కేతిబ్‌మోహల్ల గ్రామానికి చెందిన షేక్ నసిరుద్దీన్ ఒరిస్సా రాష్ట్రం మాల్కాన్‌గిరిలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి మహరాష్ట్రలోని ముంబైలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు గంజాయిని తరలిస్తున్నాడు. బరంపురంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి టికెట్టు లేకుండా మహరాష్ట్రకు బయలు దేరాడు. టికెట్ లేకపోవడంతో టికెట్ కలెక్టర్ పట్టుకుని ఖమ్మంలో దింపివేయడంతో రెండవ నెంబర్ ప్లాట్‌ఫామ్ పై అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అతడిని గుర్తించిన రైల్వేజె.సురేష్ సిఐ అంజలి ఆదేశాల మేరకు దాడిచేసి పట్టుకున్నాడు. అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించి అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో రూ.11,58,000 విలువ చేసే 46 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి కాజీపేట కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు జిఆర్‌సి సిఐ అంజలి తెలిపారు.

# కబ్జాచెరలో ఆర్‌అండ్‌బి స్థలం,పంటకాలువ

*గదులు నిర్మాణం చేసుకొని అద్దెకుఇస్తున్న వైనం* ఆ షాపుల్లోని వ్యర్థాలతో కలుషితమవుతున్న నీళ్లు, వెదజల్లుతున్న దుర్గంధం* మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన గ్రామస్థులు* ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్ అధికారుల చోద్యం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:ఖమ్మంరూరల్ మండలం లోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలో గల సత్యనారాయపురంలో ఆర్‌అండ్‌బి స్థలంతో పాటు పంట కాల్వ కబ్జాకు గురవుతున్నాయి. ఆక్రమణదారులు గదులను ఏర్పాటు చేసి యాథచ్ఛగా రెంట్లకు ఇచ్చుకుంటున్నారు. ఇందులో నుంచి వస్తున్న వ్యర్థాలతో నీరు కలుషితమై దుర్గంధం వెదజల్లుతుండటంతో గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఖమ్మం,కొరవి రహదారిపై షాపులు ఉండటంతో గ్రామంలోని ప్రధాన రహదారి గుండా వచ్చే వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినప్పటికీ అర్‌అండ్‌బి,ఇరిగేషన్‌శాఖల అధికారులు తొలగింపులో మినిమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గ్రామస్థులు ఫిర్యాదును సైతం అందజేశారు.

**కబ్జాకు గురవుతున్న పంట కాల్వ...**

రైతుల పొలాలకు సాగర్ నుంచి నీటినందించే కాల్వ యథేచ్ఛగా కబ్జాకు గురవుతుంది. పల్లెగూడెం నుంచి వచ్చే ఈ కాలువ కింద రెడ్డిపల్లి, సత్యనారాయపురంలో గల పంట పొలాలకు సాగవుతాయి. కబ్జాకు గురవుతుండటంతో నీరందండం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గదుల నిర్మాణం చేసి ఏర్పాటు చేసిన షాపుల లోని వ్యర్థాలు అందులో కలుస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్న దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. కలుషితమైన నీటితో సాగుచేసిన పంటలకు అడ్డంకిగా మారిందని పేర్కొంటున్నారు. అక్కడి బా వులు, మోటార్లలోకి ఆ నీరు చేరి కలుషితమైన నీటి తా గుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆర్‌అండ్‌బి స్థలం కబ్జా...**

ఆక్రమణదారులు ఓ పక్క పంట కాల్వ మరోపక్క ఆర్‌అండ్‌బి స్థలాన్ని సైతం కబ్జా చేశారు. అందులో గదులను ఏర్పాటు చేసుకొని అద్దెక్కిచ్చుకుంటున్నారు. ఇవి ఖమ్మం కొరవి రహదారికి పక్కనే ఉండడంతో సత్యనారాయణపురంలో నుంచి వచ్చే గ్రామస్థులకు తీవ్ర అడ్డంకిగా మారాయి.అక్కడి ప్రధానరోడ్డు నుంచి రహదారిపైకి వచ్చే క్రమంలో నిర్మాణాలు అడ్డుగా ఉండి వాహనదారులు త రచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వారితో పాటు కా లి నడకన వచ్చే వృద్ధులు, మహిళలు, విద్యార్థులకు అక్కడి పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయి. రహదారికి కూత వేటుదూరంలో ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు దిగేందుకు స్థలం లే కుండా పోయింది. ఈ నేపథ్యంలో పలు ప్రమాదాలు స ంభవి ంచి ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఉన్నా యి. అనుమతులు లేకుండా అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై మున్సిపాలిటీ అధికారులుదృష్టిసారించాల్సిన అవసరం ఉ ంది.

**పోలీసులకు ఫిర్యాదు చేస్తాము**

**ఇరిగేషన్ఎఇ, మందీప్**

గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అక్కడ జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించాను. నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్న వారు తమకు పట్టా ఉందని పేర్కొన్నారు. దీనిపై రెవిన్యూకు రాయగా...ఇది ఫేక్ పట్టా అని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసి ఆక్రమణలు తొలగింపు చేపిస్తాను. దీనిపై కమిషనర్ వివరణ కోరగా...ఆక్రమణలు ఉంటే ఇరిగేషన్, రెవిన్యూ, పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వడదెబ్బపై ప్రజలకు అవగాహన



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వడదెబ్బ బారీన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా|| పి.శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వైద్యశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని గతేడాది 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని కలెక్టర్ తెలిపారు. లేబర్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, డిఆర్‌డివో, రెవెన్యూ ఆధ్వర్యంలో ఎండ తీవ్రతను ఎదుర్కొనే వల్నరబుల్ ప్రజల వివరాలు సేకరించాలని, అధికంగా ఎండలో పనిచేసే వృత్తుల వారీగా ఆ వివరాలు ఉండాలని కలెక్టర్ తెలిపారు.ఉపాధి హామీ పనులు జరిగే చోట అవసరమైన నీడ, కూలీలకు త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్, ప్రతి తహసీల్దార్, మున్సిపల్, ఎంపిడివో కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి బస్టాప్, రైల్వే స్టేషన్ వద్ద చల్లని త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. నగరంలో ముఖ్యమైన కూడళ్లు, ఆటో స్టాండ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటకు రావడం, వడగాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి అంశాలను ప్రజలకు తెలపాలన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఎటువంటి ప్రథమ చికిత్స అందించాలి, సమీప ఆసుపత్రికి ఎలా తరలించాలి అనే దానిపై ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. అనంతరం వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో డిసిపి నరేష్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఆర్డీవోలు జి. నర్సింహారావు, ఎల్. రాజేందర్, డిపివో ఆశాలత, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, అడిషనల్ డిఆర్‌డివో నూరుద్దీన్, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కె. వెంకటనారాయణ, విద్యాశాఖ సిఎంవో రాజశేఖర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ ధన్యజీవి

### కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు




ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:అనాధలు, అభాగ్యులను, నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని అక్కున చేర్చుకొని వారి జీవితానికి భరోసా కల్పించిన లంబాడా గిరిజనుల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహారాజ్ ధన్యజీవి అని, ఆయన అడుగుజాడల్లో నేటి తరం నడవాల్సిన అవసరం ఉందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సేవాలాల్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం నియోజకవర్గ స్థాయిలో జరిగిన వేడుకలకు కూనంనేని ముఖ్య అతిధిగా హాజరై లంబాడా గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, అనాగరికత కారణంగా లంబాడీ గిరిజనులు చెడు వ్యసనాల్లో కూరుకుపోతున్న రోజుల్లో వారిలో మార్పు తెచ్చేందుకు సేవాలాల్ అలుపెరగకుండా కృషి చేశాడన్నారు. భక్తిభావం, సేవాగుణం కలిగిన సేవాలాల్ నిస్సహాయకులకు సేవ చేస్తూనే చెడుమార్గంలో పయనించే వారికి దిశా నిర్దేశం చేస్తూ సమాజహితం కోసం ఎనలేని కృషి చేశాడన్నారు. సేవాలాల్‌ను స్ఫూర్తిగా తీసుకొని గిరిజన చట్టాలను నీరుగారుస్తూ హక్కులను లాక్కుంటున్న పాలకులపై తిరగబడితేనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కొత్తగూడెం ఆర్‌డివో మధు, తహశీల్దార్‌లు పుల్లయ్య, ప్రసాద్, కృష్ణ, వివేక్, ఎంపిడివోలు విజయభాస్కర్‌రెడ్డి, సుభాషిని, భారతి, సింగరేణి ఎస్టేట్ ఆఫీసర్, తావూరియా కమిటీ నాయకులు భూక్యా శ్రీనివాస్, రమేష్ రాథోడ్, గోవిందు, దస్రు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మండలానికో నమూనా ఇందిరమ్మ ఇండ్లు:కలెక్టర్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రజలందరికీ అందుబాటులో ఉండేవిధంగా మండలానికో నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం తరుణి హాట్ ఆవరణలో ఖాళీ స్థలంలో ఇందిరమ్మ ఇండ్ల నమూనా ఇండ్లు నిర్మించే స్థలాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నమూనా ఇండ్ల నిర్మాణం ప్రతి లబ్దిదారునికి మంచి భరోసా ఇచ్చేవిధంగా ఉండాలన్నారు. మండల ప్రజలు ఇక్కడకు వచ్చి నిర్మించిన ఇంటిని పరిశీలించి వారి స్థలాల్లో నిర్మించుకునేందుకు వీలుగా నమూనా ఇండ్లు ఉండాలని తెలిపారు. సొంత ఇల్లు ప్రతి పేదవాని కల అని అది నెరవేరే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పద్ధతి ప్రకారం నిర్మించేందుకు మేస్త్రీలకు అవసరమైన శిక్షణను ఇంజనీరింగ్ నిపుణులతో అందించేందుకు కలెక్టరేట్‌లో తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, పిఆర్ఈఈ వెంకటరెడ్డి, రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



ప్రజాపక్షం/భద్రాచలం:అధికారులు అనునిత్యం ప్రజలకు అందుబాటు లో ఉంటూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం వాటిల్లకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో విద్యుత్, తా గునీరు, రైషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలిన, రైతుభరోసా దరఖాస్తుల న మోదు ప్రక్రియలపై అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర విద్యాచందన, జెడ్పి సిఇఓ నాగలక్ష్మీ, సంబంధిత జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఎంఇఓలు., ఎంసిఎస్‌లు, డిఇలు, మి షన్ భగీరథ, విద్యుత్ శాఖాధికారులతో ఆయన టెలీకాన్ఫిరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ ప్రజల గృహ, వాణిజ్య అవసరాలకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారు లు ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఆటో జనరేటర్లు అ ందుబాటులోనికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సాగు అవసరాలకు నీరు అందేలా ఇరిగేష న్, మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు. చివరి ఎకరాకు కూడా సా గునీరు అందేలా చూడాలని, జిల్లాలో రైతుభరోస ఫిర్యాదులపై సమగ్ర నివేదికలు మండల, జిల్లా స్థాయిలో అ ందించాలని అధికారులను ఆదేశించా రు. తాగునీటి అవసరాలను దృష్టిలో పె ట్టుకుని పరిష్కారాలు చూడాలని, ఎక్కడా సమస్యతలెత్తకుండా చూడాలన్నారు. మున్సిప ల్ కమీషనర్లు, పంచాయితీ కార్యదర్శులు తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ట్యాంకులను ప్రతీ నెల రెండు సార్లు శుభ్రం చేయాలని, పాడైన మోటార్లకు మరమ్మత్తులు చేయించాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉన్నందున రేషన్ కార్డుల పంపిణీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జరుగుతుందన్నారు. కొత్తరేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సోలార్ పవర్ ప్లాంట్‌లు స్థాపించేందుకు స్థల గుర్తింపి త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగూడెం, భద్రాచలం ఆర్‌డిఓలను కలెక్టర్ ఆదేశించారు.

## ఎల్లయ్య మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన నేరసూల ఎల్లయ్య అనే గిరిజన రైతు అప్పుల బాధ తాళలేక పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎల్లయ్య మృతికి ప్రభుత్వమే బాధ్యతమే వహించాలని చింతకాని మండలం బిఆర్ఎస్ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య డిమాండ్ చేశారు. తన సొంత నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కనీసం పరామర్శించడం లేదని వారు ఆరోపించారు. బుధవారం బిఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెంట్యాల పుల్లయ్య మాట్లాడుతూ ఎల్లయ్య మూడు ఎకరాల మాగాణి భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడని కాలువ ఆధారిత చివరి భూమి కావడంతో నీళ్లు సరిగ్గా రాకపోవడంతో వేసిన వరి ఎండిపోయిందన్నారు. అప్పటికే పెట్టుబడి క్రింద నాలుగు లక్షల రూపాయలు అప్పు చేశాడని భూ యజమానికి కౌలు కట్టాల్సి రావడంతో దిక్కుతోచని స్థితిలో అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని వారు తెలిపారు. ఇప్పటికే చింతకాని మండలంలో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వారు తెలిపారు. ఎల్లయ్య చావుకు ప్రభుత్వమే బాధ్యత వహించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ మాజీ ఎంపిపి సామినేని హరిప్రసాద్, చింతకాని మండల మాజీ వైస్ ఎంపిపి , మాజీ రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు మంకెన రమేష్, మండల నాయకులు శ్రీను, సచ్చు విజయ్, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపి జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల మాట్లాడుతూ ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి ఆయురారోగ్యాలతో ఉంటూ ఖమ్మం ప్రజల అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ఎంపి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జన్మదిన కేక్‌ను అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపి పుట్టిన రోజు సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో, పెద్దతండా, కరుణగిరి మానసిక వికలాంగుల కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, పద్మశ్రీ వనజీవి రామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, మిక్కిలినేని నరేంద్ర, ఎండి ముస్తఫా, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జయంతి బ్రదర్స్ ఉచ్చులో బలవుతున్న అమాయకులు

*కాసులు వారికి, కేసులు వీరికి..

* పోలీస్ కేసులతో సతమతమవుతున్న నిరుపేదలు..




ప్రజాపక్షం/సత్తుపల్లి;అక్రమ దందాకు అలవాటు పడిన జయంతి బ్రదర్స్ కోట్లు కూడా పెడుతుంటే, వారి ఉచ్చులో పడి అమాయకులు బలవుతున్నారు. అక్రమ రేషన్ బియ్యాన్ని పేదల నుండి భారీగా కొనుగోలు చేసి కాసులు కూడా పెడుతున్న జయంతి బ్రదర్స్, కేసులు విషయంలోకి వచ్చేసరికి అమాయకులను బలి చేస్తూ, కాసులు వారికి, కేసులు వీరికి అన్న చందంగా వీరి వ్యవహారం ఉందని ప్రజాస్వామ్యవాదులు మండిపడుతున్నారు. ఇప్పటివరకు పెనుబల్లి, తల్లాడ, కల్లూరు పోలీస్ స్టేషన్లలో అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తూ జయంతి బ్రదర్స్ కు చెందిన వాహనాలు పట్టుబడిన వారిపై ఒక్కటంటే ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, వారి వద్ద కూలీలుగా పని చేస్తున్న పేదలపైనే కేసులు నమోదు అవుతున్నాయని బాధితుల కుటుంబ సభ్యులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు వినికిడి. ఆర్థిక పరిస్థితి, అక్షర జ్ఞానం సరిగా లేని నిరుపేదలు డబ్బు ఆశకు లొంగి అక్రమ వ్యాపారంలో తల దూరుచుతున్నారని, కొందరు ముఠామేస్త్రులుగా, మరి కొందరు డ్రైవర్లుగా పని చేస్తూ తమ కడుపులు నింపుకుంటుంటే, అక్రమ వ్యాపారం చేస్తున్న వారు ఏసీ రూముల్లో కూర్చుని విలాసం ఒలకపోస్తున్నారని, అక్రమ రేషన్ బియ్యం తరలించే క్రమంలో వాహనాలు పట్టుబడితే తమకు సంబంధం లేదని, తమ వాహనాలను సదరు డ్రైవర్లకు లీజుకు ఇచ్చామంటూ తప్పించుకుంటున్నారని, కానీ లీజుకు ఇచ్చినట్లు ఎటువంటి అగ్రిమెంట్లు ఉండటం లేదని అయినా అధికారులు వారి మాటే వింటూ నిరుపేదలు, పొట్టకూటి కోసం పనిచేస్తున్న వారిపై కేసులు పెడుతుండడంతో వాయిదాలకు కోర్టుల చుట్టూ తిరగలేక నానా ఇబ్బందులు పడుతున్నారని. వాహనాలు పట్టుబడిన సమయంలో అంతా తామే చూసుకుంటామంటూ చెబుతున్న అక్రమ వ్యాపారులు కాలక్రమంలో వారిచ్చిన వాగ్దానాలను మరిచి గాలికి వదిలేస్తుండడంతో కేసుల్లో ఇరుక్కున్న వారు ఆర్థికంగా మరింత నష్టపోతున్నారని కేసులు నమోదైన వారి కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. నిరుపేదలకు డబ్బు ఆశ చూపించి అక్రమ వ్యాపారంలో దింపుతున్న జయంతి బ్రదర్స్ వారిని కేసుల్లో ఇరికించి కోర్టుల చుట్టూ తిప్పుతూ పేదల ఉసురు పోసుకుంటున్నారని ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పగటి వేళ కూలికి వెళ్ళితే 12 గంటలు పని చేయాల్సి వస్తుందని, అదే అక్రమ రేషన్ బియ్యం లోడింగ్ కి గాని, అన్ లోడింగ్ కి గాని వెళితే నాలుగు, ఐదు గంటల్లోనే పని పూర్తవడంతో పాటు పైసలు కూడా దండిగా వస్తుండటం, తెల్లవారేసరికి పని పూర్తి అవుతుండడంతో నిరుద్యోగులు, నిరుపేదలు ఈ అక్రమ వ్యాపారం చేసే వారికి ఆకర్షితులవుతూ తమ జీవితాలను చిద్రం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైవర్లుగా, ముఠా సభ్యులుగా పని చేస్తున్న వారిని వదిలి వారి వెనక నుండి నడిపిస్తున్న అక్రమ వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# మంచినీటి ఎద్దడి రానివ్వొద్దు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** వేసవిలో మంచినీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం అవసరమైన ఏర్పాట్లు చేయు చర్యలపై బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మిషన్ భగీరథ, విద్యుత్, ఎంపిడిఒలు, ఎంపిఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మంచినీటి సరఫరా పరిస్థితిని ఎంపిడిఒలు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పైపు లైన్లను క్రమం తప్పకుండా పరిశీలించి, ఎక్కడైనా మరమ్మతుల అవసరం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ, పట్టణాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నా ప్రత్యామ్నయంగా సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్య వస్తే రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని, అట్టి ఫిర్యాదు జిల్లాకు చేరుతుందని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఫీడర్ వారిగా విద్యుత్ వినియోగం వివరాలు నమోదు చేయాలని సూచించారు. వేసవి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గత సంవత్సరంలో సమస్య వచ్చిన గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎక్కడైనా మంచినీటి సమస్య వస్తే ప్రత్యామ్నయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలి. మంచినీటి వృథాను అరికట్టేందుకు సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యుత్‌శాఖ సిఇ మల్చూర్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈఈ నిర్మల, డిపిఒ నారాయణరావు, అన్ని మండలాలఎంపిడిఒలు, విద్యుత్,మిషన్ భగీరథ ఇంజినీరింగ్‌అధికారులుతదితరులుపాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు త్వరగా పరిష్కారం

### రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హన్మకొండ రాంనగర్‌లోని తన నివాసంలో వరుసగా రెండో రోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు హన్మకొండలోని తమ నివాసానికి చేరుకుని తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. వారి సాధకబాధకాలను మంత్రి కొండా సురేఖ సహృదయంతో విన్నారు. వారి సమస్యలు, ఫిర్యాదుల పరాష్కార నిమిత్తం మున్సిపల్, రెవెన్యూ తదితర విభాగాలకు చెందిన పలువురు అధికారులతో మాట్లాడారు. అవసరార్థులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సినవసరం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించనల్నారు. ప్రజలకు ఎల్లవేళలా కొండా దంపతులు అందుబాటులో ఉంటారని మంత్రి వారికి భరోసా ఇచ్చారు.

## వరంగల్ కమిషనరేట్ ఎదుట పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎదుట ఓ మహిళ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన ఓ మహిళపై భూ తగాదా విషయంలో కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా దాడి చేసి గాయపరిచారని ఆరోపించింది. ఈ మేరకు ఫిబ్రవరి 12న సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పట్టించుకోవట్లేదని ఆత్మహత్యాయత్నం చేసింది. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు వెల్లడించాల్సి ఉంది

## బీట్ ఆఫీసర్ తీరుపై విమర్శలు

### చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో రైతు వద్ద డబ్బులు డిమాండ్ చేసిన బీట్ అధికారి తీరుపై మండల వ్యాప్తంగా విమర్శలువెల్లువెత్తుతున్నాయి, మంగళవారం మండలకేంద్రానికి చెందిన ఓర్రైతు అడవిలో నుండి వంట చెరుకు కోసం ఎడ్ల బండిలో ఎండిన కర్రను తీసుకొచ్చాడనే సమాచాం అందడంతో రైతు ఇంటికి వెళ్లి కలప డిపోకు తరలించచడానికి సిద్ధమై కొంత దూరం తీసుకెళ్లాక రైతుతో బేరానికి దిగి డబ్బులు డిమాండ్ చేసి కొంతమేర బేరం కుదుర్చుకుని డబ్బులిస్తే వదిలిపెడ్తానని చెప్పడంతో రైతు ఒప్పుకుని బ్రతిమాలడంతో ఎడ్ల బండిని వదిలిపెట్టినట్లు తెలిసింది.లక్షల విలువ గల అటవీ సంపద దాటిపోతున్నా,గ్రామాల్లో ఎన్నో ప్రధాన సమస్యలు ఉన్నా పట్టించుకోని అటవీ శాఖాధికారులు వంటత చెరుకు కోసం తీసుకొచ్చే వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని,పేద ప్రజల కనీస అవసరాలనుగుర్తించకుండా ఇబ్బందులకు గురి చేయడం సరి కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇపన్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేద ప్రజలను ఇబ్బందులకుగురి చేస్తున్న బీట్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్మార్ట్ సిటీ నిధులు సద్వినియోగం

### కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రా



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** స్మార్ట్ సిటీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రా అన్నారు. దేశ వ్యాప్తంగా స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా ఎంపికైన నగరాల మేనేజింగ్ డైరెక్టర్లు, కమిషనర్లు, అధికారులతో జాయింట్ సెక్రటరీ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్మార్ట్ సిటీ పథకం కింద నిధుల కేటాయింపు, వినియోగంపై ఢిల్లీ నుంచి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నుంచి బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొని స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను మార్చి 2025 నాటికి పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, స్మార్ట్ సిటీ పీఎంసీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జబర్దస్త్ రాజమౌళికి 'ఘన సన్మానం'



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మాజీ ఎఐఎస్‌ఎఫ్ నాయకుడు, జబర్దస్త్ రాజమౌళికి న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా బుధవారం ఆత్మీయ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ముఠఖ్య అతిధులుగా హీరో బోలే షావలి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, జిల్లాసహాయ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి మాట్లాడారు. అనంతరం డాక్టరేట్ పొందిన జబర్దస్త్ రాజమౌళికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, వికాస్, రాణి తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో పారిశుద్ధ్య పరిశుభ్రత



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ఆసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. జాతరకు ఈ మధ్యకాలంలో మినీ మేడారం జాతరను కూడా ఏర్పాటు చేశారు. దాదాపు 6 లక్షల నుండి ఏడు లక్షల వరకు స మ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు వచ్చినట్లు తెలుస్తుంది. వచ్చిన భక్తులకు మినీ మేడారం జాతరలో ఎలాంటి చెత్తా చెదారం ఉండకుండా పరిశుభ్రంగా ఉండాలని డిపిఓ దేవ రాజ్ పారిశుధ్య పనులను ముమ్మరంగా పనులు చేపట్టి జాతరలో చెత్తా చెదారం లేకుండా ఏర్పాటు చేశామని వారు అన్నారు. మినీ మేడారం జాతరకు వచ్చిన భక్తులకు అన్ని సౌ కర్యాలు కల్పించామని వారన్నారు. తిరుగు వారం జాతరకు కూడా భక్తులు పోటేత్తుతున్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య పరిశుభ్రంగా ఉంచామని వచ్చిన భక్తులకు ఎలాంటి దుర్వాసన రాకుండా ఏర్పాట్లు చేశామని వారన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

### జిల్లాలో పలు చోట్ల పరిశీలించిన కలెక్టర్, డిసిపి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ హెచ్చరించారు. బుధవారం జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి యశ్వంతాపూర్ వాగు, రఘునాథపల్లి టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాను ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక వాగుల్లోని ఓంద్రుమట్టి తరలింపును అరికట్టేందుకు వాగుల్లోకి వెళ్లె దారుల్లో ట్రెంచ్‌లు తవ్వి టాక్టర్లు వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేసులు నమోదు చేయాలన్నారు. రఘునాథపల్లి మండలంలోని కోమళ్ల టోల్ గేట్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి కట్టుదిట్టమైన నిఘాతో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం రఘునాథపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశంచారు. ఈ తనీఖీలో కలెక్టర్ వెంట ఆర్‌డిఓ గోపిరాం, తహసీల్దార్ మోసిన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్



**ప్రజాపక్షం/కమలాపూర్:**వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధీలోని అక్రమ ఇసుక రవాణాను నియంత్రించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగంగానే పోలీస్ కమిషనర్ కమిషనరేట్ పరిధీలో ఇసుక తరలించే వాగులను ఆకస్మికంగా సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే పోలీస్ కమిషనర్ బుధవారం కమలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధీలోని అంబాల, నేరెళ్ళ వాగును సందర్శించి ప్రధానంగా రవాణాదారులు ఇసుకను అక్రమంగా తరలించే మార్గాలపై పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అక్రమంగా ఇసుక తరలించే వారి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవడంతో పాటు వారి కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సిపి అధికారులకు సూచించారు.

**చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన సిపి....**

అక్రమ ఇసుక రవాణా కట్టడికై తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కమలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధీలోని అంబాల శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇసుక చెక్ పోస్ట్‌ను వరంగల్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా కమిషనర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సిపి ముందుగా తనిఖీ నిర్వహిస్తున్న తీరును సంబంధిత చెక్‌పోస్ట్ సిబ్బందిని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. తనిఖీలు జరిపే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా తనిఖీ చేసిన వాహన వివరాలను నమోదు చేసుకోవాలని, ఇసుక తరలించే వాహనాలకు అనుమతి పత్రాలు ఉన్నాయో కూడా తప్పనిసరిగా పరిశీలించాలని, నిరంతరం ఇసుక రవాణా వాహనాలపై నిఘా పెట్టాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

## పివి విజ్ఞాన కేంద్రం పెండింగ్ పనులు త్వరగా పూర్తి

### హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** దివంగత మాజీ ప్రధాని పివి నర్సింహారావు విజ్ఞాన కేంద్రం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం భీమదేవరపల్లి మండలం వంగరలోని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పివి నర్సింహారావు విజ్ఞాన కేంద్రం పనులను కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పివి విజ్ఞాన కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం, మ్యూజియం, గ్రీనరీ, పెయింటింగ్, హైమాస్ లైట్ల ఏర్పాటు, ఆర్ట్ గ్యాలరీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. పివి విజాన కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. విజ్ఞాన కేంద్రం ఆవరణలో అధికారులు స్థానికులతో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ శ్రీను, అడిషనల్ డిఆర్‌డిఒ శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక శాఖాధికారి శివాజీ, స్థానిక తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, డిఇ ధన్‌రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ వరంగల్ జిల్లా గవర్నర్‌గా భారతి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వాకర్స్ ఇంటర్నేషనల్ 303 వరంగల్ జిల్లా గవర్నర్‌గా భారతి కురాకుల పూర్తిస్థాయి కేబినెట్ 2025 ప్రమాణ స్వీకరాం చేసిన అనంతరం బుధవారం తొలిసారిగా రంగలీల మైదానం వాకర్స్ అసోసియేషన్ గ్రౌండ్‌ను సందర్శించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వాకింగ్ వల్ల చేకూరే ప్రయోజనాలను వివరించారు. 303 జిల్లా పూర్వ గవర్నర్ పచ్చిమట్ల ఎల్లగౌడ్, కోశాధికారి కస్తూరి రాజుతోపాటు కార్యవర్గ ప్రతినిధులు, చైర్ పర్సన్, వాకర్స్ మిత్రులు హాజరు కాగా గవర్నర్ 303 జిల్లా కురాకుల భారతి, బూర రామచంద్ర, 303 క్యాబినెట్ సెక్రటరీ, కార్యదర్శి, రంగలీలా మైదానం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మల అంబేద్కర్ ఆధ్వర్యంలో వారి చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు మేడిది మధుసూదన్, మహిళా అధ్యక్షురాలు బండి రాజమణి, కదారి కుమార్, గుడిమల్లం సిరంగి, రాజ్‌కుమార్, గూడూరు మల్లేశం, రవియాదవ్, కిరణ్, తాళ్ల కుమార్, రణం శ్రీను, శ్రీపతి కుమార్, వాసూరి శ్రీను, సుధాకర్, వాకర్స్ అసోసియేషన్ మిత్రులంతా పాల్గొన్నారు.

## హాస్టళ్లలో కలెక్టర్, పలు శాఖల అధికారులు రాత్రి బస



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో సహా అదనపు కలెక్టర్లు, పలు శాఖల అధికారులు జిల్లా వ్యాప్తంగా పలు హాస్టళ్లలో బుధవారం రాత్రి బస చేశారు. హాస్టల్ సమస్యలు తెలుసుకోవడంతో పాటు పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో వారిని చైతన్యం చేయడం, హాస్టళ్లలో సమస్యలు తెలుసుకోవడం కోసం ఈ బస జరిగింది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ స్టేషన్‌ఘనపూర్ పరిధిలోని కరుణాపురం వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే హాస్టల్‌లో బస చేశారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ జనగామ మండలంలోని శామీర్‌పేట గ్రామంలో టిజిఎంఆర్‌ఇఐఎస్ బాలుర హాస్టల్‌లో బస చేశారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పాలకుర్తిలో ఎస్‌సి బాలుర హాస్టల్‌లో బస చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని జనగామలోని ఎస్‌సి బాలికల వసతి గృహంలో బస చేశారు. జనగామ ఆర్‌డిఒ గోపిరాం జనగామ మండలం చంపక్‌హిల్స్‌లో గిరిజన సంక్షేమ వసతి గృహంలో బస చేశారు. స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓ వెంకన్న పల్లగుట్ట క్రాస్ రోడ్డులోని టిజిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో బస చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర ఎంజిపిటి బిసి డబ్ల్యూఆర్ఎస్ జనగామలో బస చేయగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్ బచ్చన్నపేటలోని ఎస్‌సి బాలుర వసతి గృహంలో, ఇఇ శ్రీకాంత్ నర్మెటలోని బిసి హాస్టల్‌లో, జిల్లా మత్స్యశాఖ అధికారి రాణాప్రతాప్ జనగామ మండలం శామీర్‌పేటలోని టిజిఎంఆర్‌ఇఐఎస్ బాలురల హాస్టల్‌లో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప స్టేషన్‌ఘనపూర్‌లోని టిజిఎంఆర్‌ఈఐఎస్ పాఠశాల, కళాశాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హాతీరాం జనగామలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో, జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి యశ్వంతాపూర్, రఘునాథపల్లి బిసి సంక్షేమ వసతి గృహంలో ఎస్‌సి కార్పొరేషన్ అధికారి మాధవి కెజిబివి చిల్పూర్‌లో, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జఫర్‌గడ్‌లోని బిసి రెసిడెన్షియల్‌లో డిఆర్‌డిఒ వసంత సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం పాలకుర్తిలో, కొడకండ్ల తహసీల్దార్ చంద్రమోహన్ ఎస్‌సి బాలుర వసతి గృహం కొడకండ్ల, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీదర్‌రావు బిసి బాలుర వసతిగృహం దేవరుప్పలలో బస చేశారు. ఒకే రోజు జిల్లాల్లోని అన్ని హాస్టల్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పలు శాఖల అధికారులు రాత్రి బస చేయడం చర్చనీయాంశంగా మారింది.

**విద్యార్థులు కష్టపడి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి:** విద్యార్థులు కష్టపడి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాష షేక్ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్టేషన్‌ఘనపూర్ పరిధిలోని జ్యోతిరావుపూలే పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పరిస్థితుల్ని క్షుణంగా పరిశీలించారు. మెనూప్రకారం భోజనం,పరిసరాలపరిశుభ్రత పరిశీలించారు.

## నేర రహిత సమాజమే పోలీసుల అంతిమ ధ్యేయం

### ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** నేర రహిత సమాజమేమన అంతిమ ధ్యేయమని, నేరాలను తగ్గించేందుకు పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు సేవలు అందిస్తూ సమన్వయంతో పనిచేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పరిధిలోని పోలీసు అధికారులతో టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల వారీగా నేర నియంత్రణ,కేసుల విచారణ తీరు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను కూలంకుషంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పలు విలువైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ డిఎస్‌పిలు తప్పకుండా తమ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లను తరచూ సందర్శిస్తూ వాటి పనితీరు సమీక్షించాలని, తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని ఎస్‌పి సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో 24గంటలు పెట్రోలింగ్ గస్తీ ఉండాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకునేలా పోలీసు సేవలు అందించాలని ఎస్‌పి సూచించారు. నేరస్తులను పట్టుకోవడంలో నేర పరిశోధనలో సాంకేతిక ఆధారాలను, సిసి టివి కెమెరాలను ఉపయోగించుకోవాలన్నారు.అంత రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని, వారు మళ్ళీ నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.నూతన నేర న్యాయ చట్టాల గురించి అధికారులు సిబ్బంది సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని, గరిష్ట శిక్షా రేటు సాధించేలా కృషిచేయాలని సూచించారు. మహిళా సంరక్షణకోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలని అన్నారు. గంజాయి సరఫరా, వినియోగం మీద ఉక్కుపాదం మోపాలని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని అధికారులకు ఎస్‌పి సూచించారు.అనంతరం జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన పోలీసు సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించారు.

## వంద శాతం ఇంటి పన్నులు వసూలుకు కార్యాచరణ చేయాలి

### మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఇంటి పన్నులు 45 శాతం మాత్రమే వసూలు అయ్యాయని, 100 శాతం వసూలు కోసం కార్యచరణ సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, సూపర్వైజర్ లు సిబ్బందితో కమిషనర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పట్టణంలో పేరుకుపోయిన ఇంటి పన్నులు, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులలో వసూలు విషయంలో అలసత్వం పహిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూపాలపల్లి పట్టణంలో ఇప్పటివరకు పన్నుల వసూలు శాతం 45 శాతం మాత్రమే ఉన్నందున, పన్నుల వసూలు 100 శాతం వసూలు కోసం కార్యాచరణతో అందరు సమిష్టిగా కలిసి పని చేయాలన్నారు. పన్నులు వసూలు మార్చి 31 లోపు 100 శాతం వసూలు చేయాలని, ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రజలు వారి ఇంటి పన్నులు, నల్ల పన్నులు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు బకాయి లేకుండా చూసుకోవాలని, సంబంధిత అధికారులకు సహకరించి పట్టణ అభివృద్ధి కి ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

## నేరెళ్ళ, శంభునిపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

### మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలం నేరెళ్ళ, శంభునిపల్లి గ్రామాల్లో ఆరె కుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలను మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాల్లో ఈటల రాజేందర్ పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈటల నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈటల మాట్లాడుతూ.... కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అలాగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న జరగబోతున్నాయని, బిజెపి పార్టీ తరపున అంజిరెడ్డి, కొమురయ్యలను నిలబెట్టామని, ఇక్కడ టిఆర్ఎస్ పార్టీ నిలబెట్టడానికి సాహసం చేయలేదని, టీచర్లకు డిఎలు ఇవ్వకుండా అనేక రకాల ఇబ్బందులు పెట్టింది కాబట్టి పోటీకి నిలబెట్టే మొహం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఆచితూచి అభ్యర్థిని ప్రకటించారని, నేను ఒకటే చెప్తున్న పట్టాభద్రులకు 310 జీవోలో మన ఉసురు పోసుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఇవాళ ఎవరు గెలిచిన మా పార్టీలోకే వస్తారని చూస్తున్నారని జోస్యం చెప్పారు. ఇవాళ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడే వ్యక్తిని గెలిపించుకోవాలని కోరారు. ఇవాళ నిరుద్యోగ యువతకు ప్రధాని మోదీ అనేక పథకాలు అమలు చేస్తున్నారని, కానీ ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిమ్మకు నిరెత్తకుండా విస్మరిస్తుందని అన్నారు. మీకోసం తపనపడేది, మీ కోసం చట్టాలు చేసే పార్టీ బిజెపి అని తెలిపారు. దేశంలో మోదీ వల్లనే ఎదుగుతుందని, అందరూ ఆలోచించాలని చేయాలని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం జబ్బాపూర్ గ్రామంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో జెండా ఎత్తుతుండగా కరెంట్ షాక్ కు గురై లింగ ప్రశాంత్ అనే యువకుడు మరణించాడు.

## ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

### ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని బిసి సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. బిసి సంఘాల ఆధ్వర్యంలో నర్సంపేట వ్యా ప్తంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉ పాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నర్సంపేట మండలంలో బాలాజీ ఇంజనీరింగ్ క ళాశాల నుండి బిసి సంక్షేమ సంఘం చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, చెన్నారావుపేట గ్రామ మహిళా అధ్యక్షురాలు ముంజ లక్ష్మి లు అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ ను హారతితో ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ నర్సంపేట మండల వ్యాప్తంగా ఉన్న అన్ని హైస్కూల్‌లు, జూనియర్, డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి అక్కడ ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులను కలిసి మొదటి సారి జరుగుతున్న ఈ ఉపాధ్యాయ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నన్ను మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ కుమార్ యాదవ్, బిసి పవర్ రాష్ట్ర అధ్యక్షులు ఆబోతు రాజు యాదవ్, జిల్లా అధ్యక్షులు సోల్తి సారయ్య గౌడ్, డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు జీజుల సాగర్, జిల్లా కార్యదర్శి మరియు చెన్నారావుపేట మండల ఇన్‌చార్జి చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా కార్యదర్శి మరుపల వీరస్వామి, జిల్లా నాయకులు నీలారపు నరేందర్, సాంబరాతి మల్లేశం, చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, గ్రామ అధ్యక్షురాలు ముంజ లక్ష్మి , నల్లబెల్లి మండల నాయకులు నీల సుధాకర్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, మారపాక రమేష్ ముదిరాజ్, శీరంశెట్టి రాజేందర్, కొడకండ్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# కళారంగం

# ఆదివాసీ కళలకు గ్రహణం!

ప్రపంచీకరణ, ఆధునాతన సాంకేతికత తెచ్చిపెడుతున్న అనర్థాలు అన్నీఇన్నీ కావు. అనేకానేక రంగాలతోపాటు, కళలపై కూడా తన దుష్ప్రభావాన్ని చూపుతున్నది. ముఖ్యంగా గిరిజన జానదప కళలు ఛిద్రమవుతున్నాయి. దేశదేశాల సంస్కృతివైభవాలు కనుమరుగవుతున్నాయి. ఆధిపత్య రాజ్యాలకు వంత పాడడమే కళల ప్రయోజనమనే పరిస్థితి నేడు నెలకొంది. దేశం ఏదైనా, సమాజం ఎలాంటిదైనా, శతాబ్దాలుగా కళలే ప్రజలకు విజ్ఞాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి. జానపదాలతో పాటు ఒక కులం లేదా ప్రత్యేక వర్గం వారే ప్రదర్శించే వృత్తి కళారూపాలు బహుళ ఆదరణ పొందాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల గిరిజన సమాజాల్లో జానపద కళా వారసత్వం నేటికీ కొనసాగుతోంది. అలాంటి గిరిజన కళలకు నేడు గ్రహం పట్టింది. కనుమరుగయ్యే ప్రమాదం ఎదుర్కొంటున్న గిరిజన కళల్లో కొన్ని..

**కురవంజ :** అటవీ ప్రాంతంలో నివసించే చెంచులు, కోయలు, కురవాలు ఈ నాట్యం ప్రదర్శిస్తారు. పిల్లనగ్రోవి ఊదుతూ, డమరుకం వాయిస్తూ పాటలు పడుతూ నృత్యం చేస్తారు.

యక్షగానం : భాగవతంలోని కథలను నృత్య రూపంలో ప్రదర్శించడం యక్షగానం. ఇది అతి ప్రాచీన జానపద కళ.



కర్ణాటకలో పుట్టి ఆ తరువాత ఆంధ్రలో వ్యాపించింది. ఈ ప్రదర్శన సాధారణంగా సాయంత్రం వేళ ఉంటుంది. యక్షుడు అంటే ప్రాచీన భారతదేశంలో నివసించే ఆదివాసీ జాతి మనిషి.

**తోలుబొమ్మలాట :** పూర్వం రాజులను ప్రసన్నం చేసుకోవడానికి ఆస్థానాలలోని పండితులు బొమ్మలు తయారు చేసి ప్రదర్శించే వారు. తెల్లటి వస్త్రం తెరగా ఉపయోగించేవారు. దీపం కాంతిలో బొమ్మల నీడ పడే విధంగా చేసి బొమ్మలాట ప్రదర్శిస్తారు. బొమ్మలాడించేవారు పాటలు, పద్యాలు పాడుతూ తెరవెనుక నుంచి మాటలు చెబుతుంటారు. తలలు కూడా కదిలించడం దేశపు తోలుబొమ్మల లక్షణం. సామాజిక సమగ్రత, సంక్షేమానికి పనికొచ్చే వాటిని, స్వతంత్ర సంగ్రామంలో జాతీయ నాయకులను ప్రదర్శిస్తారు.

**కోలాటం :** అన్ని వయస్సుల వారిని అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా కోలాటం ఆడుతుంటారు. రాత్రి సమయం లో ప్రదర్శిస్తారు. హరికథలు, 18 వ శతాబ్దంలో పగటి వేషగాళ్ళు, పిట్టల దొర, వేమయ్యలు, గొరవయ్యలు, జాంబ పురాణం, మాల దాసరుల కథలు తెలంగాణ ప్రాంత శక్తివంతమైన సాంస్కృతిక సౌందర్యానికి ప్రతీకలు. వీటిని పరిరక్షించడానికి కృషి జరగాలి. ఈ జానపద గిరిజన సంగీత రూపాలకు ప్రాచుర్యం కల్పించాలి. తెలుగు ప్రాంత లంబాడీ, గుస్సాడి, డప్పు, కోలాటం, పేరిణి వంటి విభిన్న జానపద కళ ప్రక్రియలకు ప్రసిద్ధి చెందింది. ఈ రూపాలను గోండు, కోయ, మారియా వంటి గిరిజన సంగీత శైలులతో పాటు ప్రదర్శించాలి. ప్రతి ప్రదర్శన ఆయా వర్గాల ప్రత్యేక లయలు, శ్రావ్యత నృత్య రూపాల్లో ఒక సంగ్రహావలోకనం అందిస్తుంది. కచేరీ జానపద మరియు గిరిజన సంగీతకారుల మధ్య సహకారాన్ని కూడా కలిగి ఉంటుంది, వారి విభిన్న శైలుల అందమైన కలయికను అనుమతిస్తుంది. ఈవిశేకరణ సంగీతంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా వివిధ వర్గాల మధ్య ఐక్యత సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తుంది. ప్రేక్షకుల ను మరింత నిమగ్నం చేయడానికి, సంప్రదాయ నృత్యాలలో పాల్గొనడానికి హాజరైనవారిని ఆహ్వానించడం లేదా ప్రాథమిక లయలను నేర్చుకునే లేదా సాధారణ వాయిద్యాల ను వాయించే అవకాశాల ను అందించ దం వంటి ఇంటరాక్టివ్ అంశాలను ప్రదర్శించాలి. ఇది లీనమయ్యే అనుభూతిని సృష్టిస్తుంది, ప్రేక్షకులు జానపద సంగీతం సంస్కృతితో మరింత లోతుగా కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. ప్రతి ప్రదర్శనకు ముందు సంక్షిప్త కథనాలు లేదా పరిచయాలను చేర్చడం అర్థవంతంగా ఉంటుంది, ఇక్కడ సంగీతకారులు వారి సంగీతం యొక్క చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతపై తమ అనుభవాలను పంచుకోవచ్చు. విశిష్ట సంగీత సంప్రదాయాలపై ప్రేక్షకులకు అవగాహన ప్రశంసలను పెంచుతుంది.



ప్రపంచ మేటి చిత్రకారులుగా గుర్తింపు పొందిన విన్సెంట్ వాన్ గాఫ్ (1853–1890), పాల్ గౌగ్విన్ ((1848–1903) కలిసి ఉన్న ఏకైక ఫొటో ఇది. 1887లో, ప్రముఖ పుస్తకాల విక్రయదారుడు, ప్రచురణకర్త రొనాల్డ్ డేవిస్ తీసిన ఈ అరుదైన చిత్రంలో 19వ శతాబ్దానికి చెందిన ఈ ఇద్దరు ప్రభావవంతమైన చిత్రకారులతో పాటు మరికొందరు ప్రముఖులు కూడా ఉన్నారు. వాన్ గాఫ్ పైపుతో కూర్చొని ఉండ గా, ఇతరులు ఆయన చుట్టూ నిలబడ్డారు. ఆ కాలపు మరో ప్రముఖ కళాకారుడు ఎమిలే బెర్నార్డ్ ఎడమవైపు నుంచి రెండో స్థానంలో ఉండగా, గోఫ్ కుడివైపు థియేట్రే లిబ్రే డి పారి స్ స్థాపకుడు ఆంద్రే ఆంటోయిన్ కూర్చున్నా డు. పాల్ గౌగ్విన్ తన వర్ణ దృశ్యాలకు, అసాధారణ శైలికి ప్రసిద్ధి చెందాడు. ఈ చిత్రం లో అతను నిలబడి ఉన్నాడు. దిగ్గజ కళాకా రులు, ప్రముఖుల మధ్య ఆ కాలంలో వృత్తి పరమైన సంబంధాలతోపాటు, వ్యక్తిగత సాన్నిహి త్యం కూడా ఉండేదని ఈ చిత్రం స్పష్టం చేస్తున్నది.

## అరుదైన కళాకారిణి కృష్ణవేణి



శతాబ్ద సంపూర్ణ జీవితం గడిపి, ఈనెల 16వ తేదీ, ఆదివారం కన్ను మూసిన కృష్ణవేణి ఓ అరుదైన కళాకారిణి. ఆమె స్వయంగా నటి. ఎంతో మందిని తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసిన నిర్మాత. పశ్చిమ గోదావరి జిల్లా పంగిడిలో 1924 డిసెంబర్ 24న జన్మించిన కృష్ణవేణి, 1936లో 'సతీ అనసూయ' సినిమాతో, బాలనటిగా తెరంగేట్రం చేశారు. తెలుగులో 15 చిత్రాల్లో నటించారు. తమిళ, కన్నడ భాషా చిత్రాలలోనూ భూమికలు పోషించారు. రంగస్థల నటిగా పేరుతెచ్చుకున్నారు. సినీ నటిగా ఖ్యాతి గాంచారు. సినీ నేపథ్య గాయనిగా కూడా ఆమె రాణించారు. 1940లో మీర్జాపురం జమీందారు రాజా మేకా రంగయ్యతో ఆమె వివాహం జరిగింది. ఆ తర్వాత ఆమె నిర్మాతగానూ మారిన ఆమె, 'మనదేశం' సినిమాతో 'నటరత్న' నందమూరి తారకరామారావును పరిచయం చేశారు. ఆ తర్వాత ఎన్‌టిఆర్ ఎదిగిన తీరు, సినీ రంగాన్ని ఏలిన విధానం అందరికీ తెలిసిందే. 'మన దేశం' చిత్రంతో ఆమె ఎన్‌టిఆర్‌నేగాక, ప్రముఖ నటుడు ఎస్‌వి రంగారావును, గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావును రంగప్రవేశం చేయించారు. 1947లో అంజలీదేవిని నటిగా పరిచయం చేసి, హీరోయిన్‌గా, ఆపై క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఆమె నిలదొక్కుకోవడంలో కీలక భూమిక పోషించారు. 1957లో విడుదలైన దాంపత్యం సినిమాలో సంగీత దర్శకుడు రమేష్ నాయుడును పరిచయం చేసిన ఘనత కృష్ణవేణికే దక్కుతుంది. తన అద్భుత నటనతో ప్రేక్షకుల హృదయాలలో తనకంటూ ప్రత్యేక స్థానం కల్పించుకున్న కృష్ణవేణి, 102 ఏళ్ల వయస్సులో మన నుంచి దూరమైనప్పటికీ, ఆమె కీర్తి ఎప్పటికీ తెలుగు ప్రజలకు ఓ తీపిగుర్తుగా ఉండిపోతుంది.

# మౌర్యులు... నిర్మాణ రంగంలో ఘనులు

మౌర్యుల కాలాన్ని భారత దేశ చరిత్రలో స్వర్ణయుగంగా పేర్కోవాలి. నిర్మాణ రంగంలో మౌర్యులది ప్రత్యేక శైలి. రాజకీయ, మత పరమైన ప్రయోజనాల కోసం రూపొందించిన మౌర్య వాస్తుశిల్పం 'కోర్ట్ ఆర్ట్' విస్తృతంగా ప్రచారం పొందింది. ఈ విధానంలో అనేక నిర్మాణాలు జరిగాయి. గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీస్ మౌర్య సామ్రాజ్య రాజభవనాలను విశేషమైన సృష్టిగా అభివర్ణించాడు. చైనా యాత్రికుడు ఫా హియన్ వాటిని దేవుడు బహుమతిగా ఇచ్చిన స్మారక చిహ్నాలుగా ప్రశంసించాడు. చంద్రగుప్త మౌర్యుని రాజభవనాన్ని పెర్సెపోలిస్ (అచెమెనిడ్ సామ్రాజ్యం యొక్క రాజధాని)లోని అచెమెనిడ్ రాజభవనాలను పోలివుంటుందని అంటారు. కలపను ఇలాంటి నిర్మాణాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. క్రమ్‌హర్‌లోని అశోకుని రాజభవనంతోపాటు, చంద్రగుప్తుని రాజభవనం కూడా ఈ రీతి నిర్మాణాలకు తార్కాణాలు. మౌర్య స్తంభాలు పొడవుగా, స్వేచ్ఛగా నిలబడి, ఏక శిలాగా ఉంటాయి. వీటిని చునార్ వద్ద తవ్విన ఇసుకరాయితో తయారు చేశారు. పాలిష్ మాదిరి మెరిసే లక్షణం ఈ స్తంభాలకు ఉంది. కొన్ని స్తంభాలను రాతిని చెక్కడం ద్వారా నిర్మించారు. ఇవి శిల్పుల నైపుణ్యాలను ప్రదర్శిస్తాయి, ఉత్తర భారతదేశం అంతటా కనిపించే అశోకుని స్తంభాలు ఇందుకు ఉదాహరణ. దేశ జాతీయ చిహ్నంలోని సింహాలు, ఎద్దులు నాటి మౌర్యుల పాలనలో వాటి ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను వివరిస్తాయి. మౌర్యుల శాసనాలు ఎక్కువగా పాళీ, ప్రాకృతం, గ్రీకు, అరామిక్‌లలో కనిపిస్తాయి. వీటిలో ఎక్కువగా బౌద్ధ బోధనలు, న్యాయస్థానాల ఉత్తర్వులను చూడవచ్చు.




అశోకుడు నిర్మించిన స్థూపాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సాధారణంగా, స్థూపాలు బౌద్ధ సూత్రాలను సూచించే స్థూపాకార డ్రమ్, అర్ధగోళాకార దిబ్బ (అండ), హర్మిక (చదరపు రైలింగ్), ఛత్ర (మూడు గొడుగు రూపానికి మద్దతు ఇచ్చే మధ్య స్తంభం) ఉంటాయి. స్థూపం ప్రధాన భాగం కాలిపోని ఇటుకగా ఉంది, అయితే బయటి ఉపరితలం కాలిన ఇటుకలను ఉపయోగించింది. దీనిని ప్లాస్టర్‌తో కప్పి, చెక్క శిల్పాలతో అలంకరించారు. మధ్యప్రదేశ్‌లోని సాంచి స్థూపం, ఉత్తర ప్రదేశ్‌లోని పిప్రహ్వా స్థూపం అత్యంత ప్రసిద్ధమైనవి. బుద్ధుని మరణానంతరం, రాజగృహ, వైశాలి, కపిలవస్తు, అల్లకప్ప, రామగ్రామ, వేతపిడ, పావ, కుశినగర్, పిప్పలివనలో పలు స్థూపాల నిర్మాణం, ప్రతిష్ఠ జరిగాయి. మౌర్యుల కాలంలో, జైన, బౌద్ధ సన్యాసులు గుహలను విహారాలుగా ఉపయోగించారు. అవి అత్యంత మెరుగుపెట్టిన ఇంటీరియర్స్, అలంకార ప్రవేశద్వారాల ద్వారా గుర్తింపు పొందాయి. బీహార్లోని బరాబర్ గుహలు (4 గుహలు) ఇందుకు ఉదాహరణ. కాగా, మౌర్యుల కాలంలో శిల్పాలు యక్ష, యక్షి రూపాల్లో ఉంటాయి. జైన, హిందూ, బౌద్ధ మతాలకు సంబంధించిన కథలు ఇందులో పొందుపరిచారు. 'లోహనిపూర్ యక్ష', 'దిదర్గంజ్ యక్షి' శిల్పాలే నిదర్శనం. నార్తర్న్ బ్లాక్ పాలిష్డ్ వేర్ (ఎన్‌బిపిడబ్ల్యు) గా పిలిచే మౌర్య కాలం నాటి కుండలు నలుపు పెయింట్స్‌తో మెరుస్తుంటాయి. వీటిని ఆ కాలంలో విలాసవంతమైన వస్తువులుగా పరిగణించేవారు.

### మౌర్య రాజవంశం ..

**చంద్రగుప్త మౌర్య (క్రీస్తుపూర్వం 321–297) :** మౌర్య సామ్రాజ్య స్థాపకుడు, నంద రాజవంశాన్ని పడగొట్టాడు మరియు హిందూ కుష్ వంటి ప్రాంతాలను విలీనం చేయడం ద్వారా సామ్రాజ్యాన్ని విస్తరించాడు . క్రీస్తుపూర్వం305–303 మధ్యకాలంలోలో, అతను అదనపు భూభాగాలను పొందడం కోసం సెల్యూకస్ నికేటర్‌తో ఒప్పందం చేసుకున్నాడు. తరువాతి కాలంలో అతను జైనమతం స్వీకరించాడు

చాణక్య , చంద్రగుప్త మౌర్య (క్రీస్తుపూర్వం 322–297), అతని వారసుడు బిందుసార్ పాలనలో ప్రధాన మంత్రి. సామ్రాజ్యం విజయంలో చాణక్యుడు ముఖ్యమైన పాత్ర పోషించాడు.

**బిందుసార ( క్రీస్తుపూర్వం 298–272) :** 'అమిత్రఘట' (శత్రువులను సంహరించేవాడు) అని పిలిచే దక్కన్ వరకు సామ్రాజ్యాన్ని విస్తరించాడు . అజీవిక శాఖను స్వీకరించారు . డీమాచస్ అతని ఆస్థానంలో గ్రీకు రాయబారి.

**అశోకుడు (క్రీస్తుపూర్వం 272–232) :** భారీ ప్రాణనష్టానికి దారితీసిన కళింగ యుద్ధం తరువాత, అతను బౌద్ధమతాన్ని స్వీకరించాడు మరియు తన ధర్మం (నైతిక చట్టాలు) ద్వారా శాంతిని ప్రోత్సహించాడు . 3వ బౌద్ధ మండలిని నిర్వహించి బౌద్ధమతాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేశారు.

**దశరథుడు (232–224 క్రీస్తుపూర్వం) :** సామ్రాజ్య శాసనాలను జారీ చేసిన చివరి మౌర్య పాలకుడు. ప్రాదేశిక నష్టాలను ఎదుర్కొన్నారు.

**సంప్రతి (క్రీస్తుపూర్వం 224–215) :** విచ్ఛిన్నమైన భూభాగాలపై మౌర్య నియంత్రణను తిరిగి స్థాపించి జైనమతాన్ని ప్రోత్సహించారు.

**శాలిషుక ( క్రీస్తుపూర్వం 215–202) :** ప్రతికూల ఖ్యాతితో కలహాల పాలకుడిగా ప్రసిద్ధి చెందాడు.

**దేవవర్మన్ (క్రీస్తుపూర్వం 202–195) :** సంక్షిప్త పాలన, పురాణాలలో ప్రస్తావించబడింది.

**శతధన్వన్ (క్రీస్తుపూర్వం 195–187) :** బాహ్య దండయాత్రల కారణంగా కోల్పోయిన భూభాగాలు.

**బృహద్రథ (క్రీస్తుపూర్వం 187–185) :** చివరి మౌర్య చక్రవర్తి, పుష్యమిత్ర శుంగ చేత హత్య చేయబడ్డాడు , మౌర్య రాజవంశం ముగింపును సూచిస్తుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం /పాల్వంచ :** పేద ప్రజలు, కష్ట జీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. బుధవారం మండల పరిధిలోని సూరారం గ్రామంలో సిపిఐ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐది వందేళ్ల చరిత్ర అన్నారు. మరో వందేళ్లు ప్రజాక్షేత్రంలో మనగలుగుతామన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించేందుకు పురుడుపోసుకున్న పార్టీకి ప్రతినిధులుగా పనిచేయడం అదృష్టంగా కార్యకర్తలు భావించాలన్నారు. పాల్వంచ మండలంలో సిపిఐకి ఎదురులేదని, ఇది ప్రజలకు అందించిన సేవల ఫలితమేనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ పటిష్ట కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల పోటీచేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి పంచాయితీలో సిపిఐకు ప్రాతినిధ్యం వచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం 15 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా లింగంపల్లి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా సోడే మహేష్, గుగులోత్ నరేష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, మన్యం వెంకటేశ్వర్లు, బోళ్ల కృష్ణ, జక్కుల లింగేశ్వర్, జక్కుల సత్యనారాయణ, గుగులోత్ భిక్షం, రమణబోయిన వీరయ్య, లింగంపల్లి నాగేశ్వరరావు, రాకేష్, సాదినేని శివరామకృష్ణ, వెంకటనారాయణ, సీతారాములు, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల ఆశయసాధనకు కృషి

సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** అమరుల ఆశయసాధనకు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ సీనియకః నాయకులు నాగన్న జీవితమంతా ఉద్యమంలో ఉన్నారన్నారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నాగన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మోస్రా మండలం చింతకుంట గ్రామానికి చెందిన ఈరపురం నాగయ్య ఉమ్మడి వర్ని మండలంలో నిజాంసాగర్ భూ పోరాటంలో, పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించే పోరాటంలో, వ్యవసాయ కార్మికులు, దళితులు, దివ్యాంగుల సమస్యలపై పోరాటాలలో పాల్గొన్నారన్నారు. నాగన్న జీవితమంతా ప్రజాఉద్యమంలో ఉందని ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం రాజయ్య, అడ్డికే రాజేశ్వర్, రంజిత్‌కుమార్, రాధాకుమార్, ఫిరోజ్ పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు రాయితీలు..పేదలపై భారాలు

## కేంద్రబడ్జెట్‌కు నిరసనగా వామపక్షాల ఆందోళనలు

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం జరిగిన కార్యక్రమానికి న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సిపిఐ(ఎం), న్యూడెమోక్రసీ నాయకురాలు నలిగంటి రత్నమాల, గంగుల దయాకర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఎంసిపిఐ(యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఎస్‌యుసిఐ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ.. పేదలపై భారం వేశారని ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంకు 50 శాతం నిధులు పెంచాలని, జిడిపి లో విద్య, వైద్య రంగాలకు మూడు శాతం నిధులు అదనంగా ఇవ్వాలని, ప్రజాపంపిణీ వ్యవస్థకు సబ్సిడీలు పెంచాలని, పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు తగ్గించాలని, తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండి బషీర్, ఆడెపు సదయ్య, పనస ప్రసాద్, ఐతం నగేష్, టి.భవాని, దుర్గయ్య, ఇనుముల శ్రీనివాస్, రంజిత్, గన్నారపు రమేష్, గంద్రతి హరిబాబు, ప్రశాంత్, మాలి ప్రభాకర్, దేశెట్టి సమ్మయ్య, మధు, సురేష్, వాణి, ఉదయశ్రీ పాల్గొన్నారు.







**నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్లేకార్డులతో నల్లబ్యాడ్జీలను ధరించి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో నిరసన చేశామన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు కార్పొరేటర్ వ్యక్తులకు అనుకూలంగా ఉందన్నారు. బోధన్–బీదర్ రైల్వే మార్గం ఊసే లేదని, పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పనులను సంవత్సరానికి 200 రోజులకు పెంచుతూ రూ.600లు కూలీ చెల్లించే బడ్జెట్ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, ఆకుల పాపయ్య, వనమాల కృష్ణ, ఖాజా, గంగాధర్, రాజేశ్వర్, రాజయ్య, పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, సుధాకర్, వెంకన్న, సాయన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**పాల్వంచ :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామన్య, మధ్యతరగతి వర్గాలకు, పేదలకు మేలుచేసే బడ్జెట్ కాదని, కార్పొరేట్ శక్తులకు, సంపన్న వర్గాల మేలు చేసే బడ్జెట్ మాత్రమేనని వామపక్షాల నాయకులు విమర్శించారు. వామపక్షాల జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం సిపిఐ, సిపిఐ(ఎం), ఎంఎల్ ఆధ్వర్యంలో పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు బండి నాగేశ్వరరావు, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, వై.వెంకటరామయ్య, జకరయ్య, వైఎస్ గిరి, లాల్‌సింగ్, కొంగర అప్పారావు, ఖాసీం, భిక్కు లాల్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, కృష్ణ, రాము, సిపిఐ(ఎం) ప్రజా సంఘాల నాయకులు దొడ్డ రవి, తులసీరాం, సత్య, రాణి, సోమలింగం, ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**భద్రాచలం :** కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ సిపిఐ, సిపిఐ(ఎం), ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం స్వామి, ఏజే రమేష్, ప్రజాపంథానాయకురాలు కెచ్చల కల్పన, సిపిఐ నాయకులు మారెడ్డి శివాజీ, సాధనపల్లి సతీష్, మహేష్, కుమారి, సిపిఐ(ఎం) నాయకులు ఎంబి నర్సారెడ్డి, జిఎస్ శంకర్ రావు, బిబిజి తిలక్, వైవి రామారావు, పి సంతోష్, మాస్‌లైన్ నాయకులు శివకుమార్, జ్యోతి, నాగరాజు, రాఘవయ్య, శ్రీనివాస్, భూపేంద్ర, అజయ్, నారాయణ, రత్నం, రాధ తదితరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నదని, బడ్జెట్ గణాంకాలను సవరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వార్ల వెంకటయ్య, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల జాతీయ కమిటీల పిలుపులో భాగంగా అంబేద్కర్ చౌరస్తాలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, సిపిఐ నాయకులు కృష్ణాజి, శివశంకర్, వెంకటయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.







# యాసంగి పంటలకు సాగునీరివ్వండి

## రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆది సాయన్న



**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** రైతులకు వెంటనే యాసంగి పంటలకు సాగునీరు అందించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆది సాయన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 2వ మండల మహాసభ పెండ్యాల సమ్మయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆది సాయన్న మాట్లాడుతూ మండలంలో గోదావరి జలాలతో రైతులకు యాసంగి పంటలకు నీటిని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. రైతు భరోసా, రుణ మాఫీ చేస్తామని చెప్పి అరకొరగా చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రతి నియోజకవర్గానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయే పరిస్థితి ఏర్పడుతుందని, త్వరితగతిన సాగునీటిని అందించి పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎండి యాకూబ్ పాషా, ఉపాధ్యక్షులుగా మంద బుచ్చయ్య, ఎండి జాఫర్, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా బుల్లె దూడయ్య, ఎర్రం యాదగిరి, కోశాధికారిగా గడ్డి పెద్దరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. మహాసభలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సోమయ్య, బికెఎంయు జిల్లా నాయకులు చంద్రయ్య, సిపిఐ మండల కార్యదర్శి జువారి రమేష్, ఎండి యాకూబ్ పాషా, బుల్లె దూడయ్య, మంద బుచ్చయ్య, సాయిలు, సతీష్, పెద్దరాజు, మధు, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలుశిక్ష

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా మల్యాల పోలీస్ స్టేషన్ పరిదికి చెందిన మైనర్ బాలికను నిందితుడు చెట్పల్లి నారాయణ@ టోపీ నారాయణ అనే వ్యక్తికి అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి నీలిమా బుధవారం తీర్పు చెప్పారు. పోక్సో చట్టం కింద మల్యాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయగా మల్యాల సిఐ రమణమూర్తి కేసును విచారించారు. న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. నిందితుడికి 20 సంవత్సరాల కారగారశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. అంతేగాక బాధిత బాలికకు 2 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారెవరు శిక్ష నుండి తప్పించుకొలేరన్నారు. కేసు పరిష్కారానికి కృషి చేసిన పిపి రామకృష్ణరావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ రమణమూర్తి, ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు సాగర్ రాజు ,కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** బైండవర్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తికి లక్ష రూపాయల జరిమానా విధించినట్టు పెద్దపల్లి ఎక్సైజ్ సిఐ నరేందర్ తెలిపారు. వివరాలకు వెళితే పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలా వనపర్తి గ్రామానికి చెందిన క్యాతం నరేష్ అనే వ్యక్తి గుడుంబా విక్రయిస్తుండగా ధర్మారం తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టగా, లక్ష రూపాయలు జరిమాన విధించారని, సదరు నిందితుడు బైండోవర్ ఉల్లంఘనకు పాల్పడి, మళ్లీ గుడుంబా విక్రయిస్తుండగా తమ సిబ్బంది పట్టుకుని తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టినట్టు తెలిపారు. అక్రమంగా గుడుంబా అమ్మిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియం అద్భుతం




**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ విద్యార్థులు బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో సైన్స్ మ్యూజియంను సందర్శించారు. అన్ని ప్రదర్శనలు ఆసక్తితో తిలకించారు. ఖగోళ శాస్త్రంలోని ప్లానిటోరియం విద్యార్థులను ఎంతగానో ఆకర్షించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ దీక్షిత్ తెలిపారు. ఉపాధ్యాయులు రాజమౌళి, హరిత, శ్రీకాంత్, ఉమారాణి పాల్గొన్నారు.

## కుంగ్‌ఫూ, కరాటేలో అద్భుత ప్రదర్శన

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో రాష్ట్ర స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన పెద్దపల్లి జిల్లా విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 16న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ లో జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ, కరాటే ఛాంపియన్షిప్ 2025 పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. గోదావరిఖనికు చెందిన 20 మంది విద్యార్థిని విద్యార్థులు మాస్టర్ ఎం.రాజేశం ఆధ్వర్యంలోఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. వివిధ కేటగిరీలలో 10 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు సాధించారన్నారు. కరాటే కుంగ్ ఫు మాస్టర్ ఎం.రాజేశం , విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/వేములవాడ :** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా పిలుపు నిచ్చారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలోని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్ రూమ్, డార్మెట్రీ, తరగతి గదులు, మెనూ చార్ట్ పరిశీలించి, ఆహార పదార్థాలను సిద్ధం చేస్తుండగా, నాణ్యతను పరిశీలించారు. సిలబస్ ఎక్కడి వరకు పూర్తయింది అనే వివరాలను ఆరా తీశారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో విద్యను అభ్యసించాలని సూచించారు.అనంతరం శాత్రాజుపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలను తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఇసుక రీచ్ ల నుంచి అన్ని పత్రాలను వెంట పెట్టుకొని ఇసుకను తరలించాలని కలెక్టర్ సూచించారు. వేములవాడ లో ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆపి వే బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర పత్రాలను తనిఖీ చేశారు. తహసిల్దార్ మహేష్ కుమార్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంద్ విజయవంతం చేయండి




**ప్రజా పక్షం/వేములవాడ టౌన్:** ఫిబ్రవరి 19 వ తేదీ నుండి 23 వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల జేఏసీ నాయకులు బంద్ కు పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 19 నుండి 23వ తేదీ వరకు ఐదు రోజులపాటు బిల్డింగ్ పెయింటింగ్ కార్మికుల సమస్యలు వాటి పరిష్కార కోసం బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటి యజమానులు ఇంజనీర్లు బిల్డర్స్ భవన నిర్మాణ కార్మిక సంఘాలు కార్మికులు బందుకు సహకరించాలని కోరారు.

## గుడుంబా ప్యాకెట్ల పట్టివేత

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** నాటుసార తయారు చేసినా, గుడుంబా అమ్మినా చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ పోలీసులు హెచ్చరించారు.బుధవారం సిరిసిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్‌కుమార్ అద్వర్యంలో ఎల్లారెడ్డిపేటలో ఆకస్మిక దాడులు వేర్వేరుగా నిర్వహించగా నారయణపూర్ గ్రామం లో అనరాసి నర్సింహులు వద్ద పదకొండు, రమమ్మవద్ద పద్నాలుగు ప్యాకెట్లు సీసీఎస్ పోలీసుల బృందం స్వాధీనం చేసుకుంది. ఈ విషయం పై ప్రజా పక్షం వివరణ కోరగా మీడియాకు సమాచారం వెల్లడించారు.ఈ దాడుల్లో సిసిఎస్ పోలీసుల బృందం పాల్గొన్నారన్నారు.

# వసతిగృహాల సమస్యలపై శ్రద్ధ

### సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** గురుకుల విద్యాలయాల సంక్షేమ వసతి గృహలల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అధికారులకు సూచించారు.బుధవారం నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది గ్రామంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల వసతి గృహన్ని సందర్శించి పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వమిస్తున్న సమీకృత వసతి గృహల సముదాయ భవనాన్ని పరిశీలించి హాస్టల్‌లో 235 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కల్పిస్తున్న అవాస భోజన సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు మోను ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు.హాస్టల్‌కు అవసరమైన సంపు నిర్మాణానికి ఈడబ్ల్యూడిసి అధికారులచే ఎస్టిమేషన్ చేసి పంపించాలని ఏ సమస్యలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇంచార్జీ జిల్లా ఎస్పీ అభివృద్ధి అధికారి ఎంబీ హమీద్ ఉన్నారు.

### ట్యాక్స్ కలెక్షన్ మార్చి 15లోగా పూర్తి చేయాలి

**సిద్దిపేటప్రతినిధి:** వచ్చే ఆర్థిక సంవత్సరం మున్సిపాలిటీలల్లో బడ్జెట్ తయారీలో అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోని రూపొందించాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి మున్సిపల్ అధికారులకు సూచించారు.బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరేన్స్ మందిరంలో జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు వచ్చే ఆర్థిక సంవత్సరం మున్సిపల్ బడ్జెట్ తయారీపై జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్, మెప్మా,మున్సిపల్ ఇంజనీర్ అధికారులతో సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ బడ్జెట్ ప్రిపరేషన్‌లో అన్ని అంశలను దృష్టిలో పెట్టుకుని రూపొందించాలని మున్సిపల్ ఆదాయ వనరులైన ఆదాయ,ఆస్తి ఇతర గ్రాండ్‌లను దృష్టిలో పెట్టుకోనివచ్చిన ఆదాయంలో మున్సిపల్ సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లు,వాటర్ సప్లై,శానిటేషన్ పనులతో పాటు బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్ పెట్టాలని సూచించారు. వచ్చే వేసవి కాలం దృష్యా అన్ని మున్సిపాలిటీలల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి మిషన్ భగీరథ కాకుండా ప్రభుత్వ పంపు సెట్లను రిపేర్లు చేసి రెడీగా ఉంచుకోవాలని తెలిపారు.

## ప్రసన్న హరికృష్ణకు మద్దతు

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** నిరుద్యోగులకు విద్యార్థులకు బలహీనవర్గాల ప్రజలకు ఉచిత సేవలు అందిస్తూ వారి హక్కుల కొరకు పోరాటం చేస్తున్న ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పులి ప్రసన్న హరికృష్ణకు రాజన సిరిసిల్ల జిల్లా గౌడ్ అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(గోపా)పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని గోపా రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు తీగల మల్లిఖార్జున్ గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో సమావేశం నిర్వహించి ప్రసన్న హరికృష్ణకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.కరీంనగర్ జిల్లా గోపా అధ్యక్షులు అమరగాని నర్సయ్యగౌడ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్రిపల్లి చక్రవర్తిగౌడ్ ముఖ్య అతిథులుగామాట్లాడారు. నిరుద్యోగుల కోసం 19 సంవత్సరాల ఉద్యోగ జీవితాన్ని తృణ ప్రాయంగా వదిలిన ఘనత ప్రసన్న హరికృష్ణదిఅన్నారు. గోపా రాజన్న సిరిసిల్ల జిల్లా గౌరవ సలహాదారు గుగ్గిల్ల జగన్ గౌడ్, సిరిసిల్లపట్టణఅధ్యక్షులునాగుల శ్రీనివాస్‌గౌడ్, కరీంనగర్‌జిల్లాకోశాధికారి పరకాల మురళి గౌడ్,దూలంఅంజయగౌడ్, విక్కుర్తి ముత్తయ్యగౌడ్, తీగల నాగార్జునగౌడ్ ఉన్నారు.

## పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి:** వచ్చే నెలలో నిర్వహించనున్న ఇంటర్, పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసారి ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఇంటర్ పరీక్షల పర్యవేక్షణ ఉంటుందన్నారు. చీఫ్ సూపరిండెంట్ మినహా ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదని తెలిపారు. ప్రశ్నాపత్రాలను కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతరులు పరీక్ష కేంద్రాల్లో ఉండరాదని, గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ కేంద్రాలకు అనుమతించరాదని ఆదేశించారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో పరీక్షలు జరిగే తేదీల్లో ప్రత్యేక బస్సులను నడపాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష వేళల్లో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమయానికి పరీక్ష కేంద్రానికి చేరేలా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూడాలని పోలీసులను కోరారు. వైద్యశాఖ అధికారులు పరీక్ష కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 5 నుంచి 22 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని, ప్రథమ సంవత్సరం 17799, ద్వితీయ సంవత్సరానికి 17763 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మాట్లాడుతూ వచ్చే నెల 21 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మొత్తంగా 12516 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్‌వో వెంకటేశ్వర్లు, డిఎంహెచ్‌వో వెంకటరమణ, ఆర్టీసీ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారులున్నారు.

# ప్రతి విద్యార్థికీ కనీస విద్యా ప్రమాణాలు

### పెద్దపల్లికలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/రామగిరి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారురామగిరి మండలం పన్నూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, రత్నాపూర్ గ్రామంలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల, నాగేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,అంగన్వాడీ కేంద్రం, రామయపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అంగన్వాడి కేంద్రం , బేగంపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసిల్దార్ కార్యాలయం, పన్నూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, లను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన మేర వాటర్ హీటర్లు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం మూడు వైపుల కాంపౌండ్ వాల్ ఏర్పాటు, డ్యూయల్ డెస్క్ లకు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లలకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని, ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమమైన బోధన పద్ధతులను అనుసరించాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలను సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్.సి.డి స్క్రిన్నింగ్ 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్.సి.డి. సర్వే చేసిన ప్రతి ఒక్కరికి అబా నెంబర్ జనరేట్ చేయాలని అన్నారు.మాతా శిశు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిపేలా తల్లులను ప్రోత్సహించాలని, పిల్లలకు టీకాలు సరిగా అందులో ఉండేలా చూడాలని, ఆర్.బి.ఎస్.కే ద్వారా పిల్లలకు వైద్య పరీక్షలు సక్రమంగా జరపాలని, అనేమియా నిర్మూలనకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని, అనేమీయాతో బాధపడుతున్న వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు. రామగిరి మండలం మేడిపల్లి లో పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు జారీ చేసిన ప్రాథమిక భూసేకరణ నోటిఫికేషన్ సంబంధించి ఎంజాయ్మెంట్ సర్వే చేసి రికార్డ్ నమోదు చేయాలని సూచించారు. జాతీయరహదారి పెండింగ్ ట్రెంచ్ కటింగ్ పూర్తి చేయాలని, ఎవరికైనా పేమెంట్స్ పెండింగ్ ఉంటే పూర్తి చేయాలని అన్నారు. ఆర్డీవో సురేష్, తహసిల్దార్ సుమన్, ఎంపీడీవో శైలజా రాణి, ఎంఈఓ కొమురయ్య, ఎంపీఓ ఉమేష్, డాక్టర్ రవిసింగ్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సి.హెచ్.ఓ భరత్ కుమార్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డికి సిపిఐ మద్దతు



**ప్రజాపక్షం/రామడుగు:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ వూట్కూరి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐజిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. మం డల కేంద్రంలోవిలేకరుల సమావేశంలో సృజన్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 27న కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సిపిఐ మద్దతు తెలుపుతుందని, పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. లక్షలాది మంది విద్యార్థులకు నరేందర్‌రెడ్డి కార్పోరేట్ స్థాయి విద్యను అందించారని కొనియాడారు. సిపిఐ మండల కార్యదర్శి గొడిశాల తిరుపతిగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులుమచ్చరమేష్, నాయకులు ఎగుర్ల మల్లేశం, నరేష్, కుమార్ ఉన్నారు.

## ఎంఎల్‌సిగా నరేందర్‌కు అవకాశం కల్పించాలి

### ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగస్తుల కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గత శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా మీరందరూ నాకు అండగా నిలిచి ఒక ఆత్మస్థైర్యాన్ని నింపి మా ప్రాంత వాస్తవుడు మా సమస్యలు తెలిసినవాడు మా విశ్రాంతి ఉద్యోగస్తుల సమస్యల గురించి స్పందించగలిగే అనుభవం ఉన్నటువంటి వారు అని నాకు అవకాశం కల్పించారనీ,అందుకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా జీవితంలో నేను ఏ హోదాలో ఉన్న ప్రజా సేవకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడే విధంగా నా కర్తవ్యం నిర్వహించానని తెలిపారు.ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీ పదవీకాలంలో శాసనమండలిలో ప్రతి సమస్యపై ప్రసంగించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేశానన్నారు.ఆ స్థానాన్ని భర్తీ చేసే అభ్యర్థి విద్య వేత్త నరేందర్ రెడ్డి అయితేనే న్యాయం జరుగుతుందన్నారు. విశ్రాంతి ఉద్యోగస్తుల సమస్యలపై తాను రాబోయే శాసన మండలి సమావేశాల్లో మరోసారి చర్చిస్తాననీ,ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననీ తెలిపారు. ఓపీఎస్ సర్వీస్ నిబంధనలు పీఆర్ సీ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి 2023 రావలిసినప్పటికి ఇంకారాలేదని తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పిఆర్‌సిఇవ్వడం జరిగిందనీ మిగిలినవి ఇవ్వడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. నిరుపేద వర్గాల వారందరికీ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ లో 10 లక్షల వరకు వైద్యం అందిస్తమన్నారు.సంవత్సర కాలం గడుస్తున్న 317 జీవో పరిష్కారం కాలేని విషయం వాస్తవం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలోనే 50వేలకు పైగా ఉద్యోగాలు కల్పించిందన్నారు.

## ప్రాధాన్యత ఓట్లు సూచించే అధికారం 'జాజుల'కు ఎక్కడిది?

### బిసి కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్



**ప్రజాపక్షం/కరీంనగర్:** గ్రాడ్యుయేట్ ఎ మ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యత ఓట్లు సూచి ంచే అధికారం బిసి సంక్షేమ సంఘం జాతీయ నేత జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు ఎక్కడిదని బిసి కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ప్రశ్నించారు. బిసిలందరూ ఆయనకు గుత్తాదిపత్యమా? బిసి అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ కేవలం తన సామాజిక వర్గానికి చెందిన ప్రసన్న హరి కృష్ణను మద్దతిస్తూ గెలిపించాలని కోరడం మిగిలినవారిని అవమాన పరచడమే అవుతుందన్నారు. కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిసి ఉద్యమాలు నడిపే జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు ఒక సామాజిక వర్గానికే పరిమితమై బిసి వాదాన్ని తలకెత్తుకోవడం తగదన్నారు. ప్రసన్న హరికృష్ణకు జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు మధ్య జరిగిన ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రసన్న హరికృష్ణ తన ఉద్యోగ జీవితంలో 18 సంవత్సరాలు చదువు చెప్పాల్సిన కాలేజీ పిల్లలను గాలికి వదిలేసి తన సొంత ఎజెండాను అమలు చేసి తన దృష్టంతా పుస్తకాల రచన మీదనే పెట్టి కోట్ల రూపాయలు గడించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచారన్నారు. కోట్లు సంపాదించి రాజకీయాలకు వచ్చి ప్రజా సేవ చేస్తామంటే బిసిలు నమ్మరన్నారు. ఏనాడైనా బిసి ఉద్యమాలలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడా? అని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు చేసిన సేవలేమీలేవని,ఆయన చేసిన సర్వీసు అంతా వ్యాపారమేనని ఆరోపించారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర సంఘంగా ఒక అభ్యర్థికి మద్దతు పలికితే వారి ఆద్వర్యంలో నడిచే జిల్లా కమిటీలు బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇవ్వడంలోనే ఐక్యత లోపించిందన్నారు.బిసిలలో చీలికలు తెచ్చి కుట్రలు చేసే వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.బిసి కుల సం ఘాల ఐక్యవేదిక నాయకులు పొన్నం అనిల్ గౌడ్, తుల భాస్కర్‌రావు, గొట్టం మహేష్, విద్యానగర్, భారతం అఖిల్, జగదీష్ ఉన్నారు.

## నాపై అసత్యప్రచారం చేస్తే కఠినచర్యలు

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చేలా అసత్య ప్రచారాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై వివిధ కేసులు ఉన్నట్లుగా సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, తనపై ఎటువంటి కేసులు లేవని, తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సామాజిక మాధ్యమాలు పోస్టు చేస్తున్న వారిపై అసత్యాలను ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటానని, ఇప్పటికే కొంత మందిపై కేసులను నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అసత్య ఆరోపణలు కట్టుకథలు ఆధారంగా మీడియా సామాజిక మాధ్యమాలలో వార్తలను ప్రచారం చేయవద్దని అవనసరంగా కేసులలో ఇరుక్కోవద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎన్నికల సంఘమే నిబంధనలు ఉల్లంఘిస్తున్నా చర్యలేవీ?



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్,ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్నికలలో నామినేషన్ నుంచి నిబంధనలు ఉల్లంఘిస్తూనే ఉన్నారని మాజీ మేయర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికార కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుండగా అనేక ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. నామినేషన్‌లో మంత్రుల కాన్వాయ్‌తో పాటు 50 మందిని లోనికి అనుమతించడం మొదలు పెడితే తాజాగా అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఫోన్‌నెంబర్ల జాబితాతో వెబ్‌సైట్‌కు అనుమతించడం వరకు అక్రమాలేనన్నారు. కరీంనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారుల ప్రమేయం లేకుండా డేటా ఎలా లీకవుతుందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఒక మాదిరిగా.. అధికార పార్టీ అభ్యర్థికి మరోమాదిరిగా వెబ్‌సైట్ ఉండడంలో ఆంతర్యమేమిటి ప్రశ్నించారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం అమ్ముడుపోయిందని ఆరోపించారు. ఓటరు పేరు, పోలింగ్ బూత్, ఫోన్ నెంబర్‌తో సహా వెబ్‌సైట్ ఎలా ఇస్తారని మండిపడ్డారు. గోప్యతకు భంగం కలిగించేలా ఎన్నికల కమిషన్ వ్యవహరించిందని ఆరోపించారు.వెంటనే ఉన్నతాధికారులు సంబంధిత ఎన్నికల అధికారులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

## నరేందర్‌రెడ్డి గెలుపే ధ్యేయం




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సిపిఐ బలపరుస్తున్న కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు కమ్యూనిస్టు శ్రేణులు పనిచేయాలని సిపిఐ నగర సమితి పిలుపునిచ్చింది. ఈమేరకు గురువారం సిపిఐ కార్యాలయంలో కరపత్రం విడుదల చేశారు. సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నరేందర్‌రెడ్డి ట్యూషన్ మాస్టర్ నుంచి విద్యావ్యవస్థలను నెలకొల్పే స్థాయికి ఎదిగాడంటే తన ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి ఉత్తర తెలంగాణలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకై అహర్నిషలు పాటుపడతాడని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల విడుదలకై కృషి చేస్తారని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకువచ్చేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వంతో మాట్లాడి నూతన నియామకాలకై ప్రయత్నించే వ్యక్తి అన్నారు. అందరికీ అందుబాటులో ఉండే నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. నిరుద్యోగ సమస్యలు పట్టించుకోని బిజెపిని ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు గౌడ్, న్యాలపట్ల రాజుగౌడ్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం ముమ్మరం

### ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/ గొల్లపల్లి :** కాంగ్రెస్ బలపరిచినటీచర్ఎమ్మెల్సీఅభ్యర్థిడా. వూట్కూరి నరేందర్ రెడ్డి ని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని వైశ్య భవనంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా బుధవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టపడి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని,ధర్మపురి నియోజకవర్గ పట్టబద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి 2వ నెంబరు పైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలంలోపే దాదాపు 56 వేల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ బీమా సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి , యూత్ అధ్యక్షులు పూరం శెట్టి గౌతం ,సత్యనారాయణ గౌడ్ ,చిర్ర గంగాధర్ ,నేరెళ్ల మహేష్ ,కట్ట లక్ష్మణరావు ,రాపల్లి గంగన్న పాల్గొన్నారు.

## బైకుల స్కాం బట్టబయలు



ప్రజాపక్షం/ఆర్మూర్ : దొంగ ద్విచక్ర వాహనాల కేసు రోజురోజుకి రాజకీయ రంగు అలుముకుంటున్న వేళ పోలీసులు ద్విచక్ర వాహనాల కేసును చేదించారు. బుధవారం ఆర్మూర్ పోలీసు స్టేషన్ పరిధిలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. తొమ్మిది మంది నేరస్తులను అరెస్టు చేసి 27 వాహనాలను స్వాధీన పరుచుకున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో షాహిద్ అలీ అతని స్నేహితుడు సయ్యద్ ఒమర్ కలిసి అడ్రస్ ప్రూఫ్ సరిగా లేని వ్యక్తుల యొక్క ఐడి కార్డులను సృష్టించి వాటి ద్వారా హైదరాబాదులోని సయ్యద్ ఒమేర్ యొక్క బైక్ షోరూం లో అతని డౌన్ పేమెంట్ కట్టి హీరో ఫిన్ కార్ప్ లిమిటెడ్ ఫైనాన్స్ ద్వారా లోన్లు తీసుకొని హీరో కంపెనీకి చెందిన బైకులను కొనుగోలు చేసిన తర్వాత ఒకటి రెండు నెలలు ఈఎంఐ కట్టి ఫైనాన్స్ కంపెనీ వారిని మోసంచేసి అతను కొనుగోలు చేసిన వాటిని అతని అనుచరులు షాబీర్ ఖాన్ (రాజేంద్రనగర్), మహమ్మద్ యాసీన్ (కామారెడ్డి), కల్లెం యోగేష్‌రెడ్డి (మిర్దపల్లి), బంటు ప్రశాంత్ (రాంపూర్), కొమ్ముల వెంకట్‌రెడ్డి (అంకాపూర్), నరేష్ (సిరికొండ), కాటిపల్లి శ్రీకాంత్ (మైలారం), అను ఏజెంట్‌ల ద్వారా ఆర్మూర్, డొంకేశ్వర్, సిరికొండ, దర్పల్లి, మాక్లూర్ మండల ప్రజలకు అమ్మడం జరిగిందని ఇందుకుగాను అమ్మిన ఒక్కో ద్విచక్రవాహనంపై ఏజెంట్లకు 3 వేల నుంచి 5 వేల రూపాయల వరకు కమిషన్ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈకేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్ఐ లు గోవింద్, మహేశ్, ఇంద్రకరణ్ రెడ్డి, తిరుపతి, రాములు, సిబ్బంది అశోక్, శ్రీనివాస్, ఆనంద్‌లను ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు.

## డబ్బు కోసం స్నేహితుని హత్య




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: విలాసలకు అలవాటు పడి ఓ యువకుడు డబ్బు కోసం మిత్రుడినే హత్య చేశాడు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే నాగారం 80 క్వార్టర్స్‌కు చెందిన సతీష్‌గౌడ్ జల్సాలకు అలవాటు పద్దాడు. ఇదే క్రమంలో భార్య లావణ్య ఐదేళ్ల క్రితం అతడిని వదిలేసి తల్లి వద్దకు వెళ్లిపోయింది. నాగారం బ్రాహ్మణ కాలనీకి చెందిన సందీప్, సతీష్‌గౌడ్ స్నేహితులు, జల్సాలకు అలవాటు పడిన సతీష్ డబ్బుల కోసం తన స్నేహితుడు సందీప్ వద్ద ఉన్న ఆటో, మొబైల్ ఫోన్ కొట్టేయాలని ప్రణాళిక వేశాడు. సందీప్‌కు హతమారిస్తే వాటిని దక్కించుకోవచ్చని స్కెచ్ వేశాడు. ఇందులో భాగంగా ఇద్దరూ కలిసి ఈనెల 15న ఆటోలో కిరాయికి వెళ్లగా వచ్చిన డబ్బులతో మద్యం తాగారు. చంద్రాయన్‌పల్లి సమీపంలోని చెరువు వద్ద మూత్ర విసర్జన కోసం సందీప్ దిగగా సతీష్‌గౌడ్ వెనుక నుండి తోసేశాడు. అతను మృతి చెందాడనినిర్ధారించుకున్న తర్వాత మృతదేహాన్ని తీసుకవచ్చి ఎండుగడ్డి వేసి తగులబెట్టాడు. అనంతరం ఆటో, మొబైల్ ఫోన్ తీసుకుని, హైదరాబాద్‌కు పరారయ్యాడు. తిరిగి బుధవారం నిజామాబాద్‌కు వస్తుండగా మాధవనగర్ వద్ద పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఏసిపి తెలిపారు. నిందితునికి వనస్థలిపురంలోని మర్డర్ కేసు నిజామాబాద్ జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు ఉన్నవని ఏసీపీ వెల్లడించారు. సమావేశంలో సిఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ నిధుల విడుదలకు పంచాయతీ కార్యదర్శుల వినతి



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ : మండలంలోని గ్రామపంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని కోరుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆల్బర్ట్‌కు బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా గ్రామపంచాయతీల అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకావట్లేదని, దీంతో పలు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేసి, నిధులు లభించని గ్రామ పంచాయతీలకు నేరుగా విడుదల చేయాలని కోరారు. అలాగే సాధారణ నిధులను ట్రెజరీకి అనుసంధానం చేయకుండా, నేరుగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, రాకేష్, చంద్రయ్య, మధుకర్, అర్చన, గణేష్, శ్రీకాంత్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒకరి పింఛన్.. మరొకరికి

### మాసాయిపేట కెనరా బ్యాంకు సిబ్బంది నిర్వాకం!



ప్రజాపక్షం/వెల్దుర్తి: మెదక్ జిల్లా మాసాయిపేట గ్రామానికి చెందిన షేషన్ పెంటమ్మ (63) కు చెందిన వృద్ధాప్య పింఛను మాసాయిపేట గ్రామంలో గల కెనరా బ్యాంక్ సిబ్బంది మాసాయిపేట గ్రామానికి చెందిన బంగ్లా కాడి రాజమ్మ (62) అనే వృద్ధురాలికి గత ఆరు నెలలుగా ఇస్తున్నారు. ఈ విషయమై బుధవారము బాధితురాలు పెంటమ్మ బ్యాంకు గేటు ముందు తన పింఛన్ కార్డును చూపుతు బ్యాంకు వారు తనకు చేసిన అన్యాయం గురించి వచ్చి పోయే వారికి వివరించారు. తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న బ్యాంక్ మేనేజర్ నవీన్ రెడ్డి, పెంటమ్మ ద్వారా లిఖితపూర్వకంగా ఫిర్యాదు తీసుకొని విచారణ జరిపి బాధ్యులైన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలు పెంటమ్మకు న్యాయం చేస్తామని చెప్పారు.

## టిప్పర్ ఢీ కొని యువకుడి మృతి

ప్రజాపక్షం/కొండాపూర్ : కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ చౌరస్తా దగ్గర టిప్పర్ మోటర్ సైకిల్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం మద్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మారెపల్లి గ్రామానికి చెందిన గంజాయి ప్రకాష్, తండ్రి వెంకటయ్య వయస్సు 25 సంవత్సరాలు వృత్తి వ్యవసాయం,కూలీ బుదవారం మద్యాహ్నం మల్కాపూర్ చౌరస్తా నుండి మల్కాపూర్ గ్రామానికి వెళుతుండగా బైక్ టిప్పర్ ఢీకొని టప్పర్ టైర్ల కింద పడి ప్రకాష్ అక్కడి కక్కడే చనిపోయాడు. బైక్ పై వెనుక కూర్చున్న వ్యక్తికి తీవ్ర రక్తస్రావం జరిగి గాయాల పాలు అయ్యాడు. సంఘటన స్థలానికి వచ్చిన కొండాపూర్ ఎస్సై హరి శంకర్ గౌడ్ గాయాల పాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. ప్రకాష్ మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంలో ఉన్నటువంటి టిప్పర్ ను స్వాదీనం చేసుకుని విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు.

# ఉత్తర తెలంగాణను నిర్లక్ష్యం చేస్తున్న బిజెపి సర్కార్

### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ప్రజాపక్షం/గజ్వేల్: ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీగానే నిలిచిపోగా, ఉత్తర తెలంగాణను కేంద్రంలోని బిజెపి సర్కార్ నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లకు తరలిస్తుందని గ్రాడ్యుయేట్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, సమన్వయకర్త గుత్తా అమిత్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ విమర్శించారు. బుధవారం నియోజకవర్గ స్థాయి సన్నాహక, ఆత్మీయ సమావేశం డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఏడాది లోనే 55వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి అదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి విద్యావేత్త, నరేందర్ రెడ్డిని గెలిపించి సమస్యల పరిష్కారానికి బాటలు వేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున నిరుద్యోగులు, యువత, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం జరుగుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మేధావి వర్గానికి చెందిన వారిని ఒప్పించి ఓటు వేయించుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందాలతో ముందుకెళ్తుండగా, ఇందుకు బిఆర్ఎస్ తమ అభ్యర్థిని నిలపకపోవడం నిదర్శనమని, ఈ విషయంపై వారిని చైతన్యం చేయాలని అన్నారు. దేశాన్ని అప్పుల పాలు చేస్తూ కులం, మతం, ప్రాంతం, వర్గాల పేరిట విడదీస్తూ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్న బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. చారిత్రాత్మక, సాహసోపేత నిర్ణయాలతో సీఎం రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చక్కటి ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన బీసీ, ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తుండగా, రాష్ట్రంలో చేపట్టిన కుల గణన, ఎస్సీ వర్గీకరణ అమలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ తదితర అంశాలను ఆ పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నట్లు ఎద్దేవా చేశారు. ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్రానికి సీఎం రేవంత్ రెడ్డి రూ లక్షా 50 వేల కోట్ల పెట్టుబడులు సాధించగా, ఎన్నో సంస్థలతో ఎంఓయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. మాజీ సీఎం కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ కు ప్రత్యేకత ఉందని, ఆయనను ఎదుర్కోవడం ఆశామాషి కాదని పేర్కొంటూ నేరుగా పోరాటం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి పార్టీ అండగా ఉండడంతో పాటు వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీ, పెండింగ్ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆంక్షా రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు గాడిపల్లి భాస్కర్, కృష్ణ, నాచగిరి మాజీ చైర్మన్లు లక్ష్మా రెడ్డి, పాల్గొన్నారు.

## హైదరాబాద్ కంపు మాకొద్దు



ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ పర్యావరణాన్ని కలుషితం చేసి పచ్చని అడవిలో చిచ్చు పెడుతున్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే నిర్మాణ పనులను నిలిపి వేయాలని అఖిలపక్ష నాయకులు అన్నారు. డంపు యాడు నిర్మాణం చేపట్టొద్దని నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపం వద్ద అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష బుధవారం మూడవ రోజుకు చేరింది. హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపడితే భవిష్యత్తు భావితరాలకు ముప్పు వాటిల్లుతుందని ఇట్టి డంపింగ్ యార్డ్ ను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు ఏకమై డంపింగ్ యార్డు నిర్మాణాన్ని చేపట్టనియ్యవద్దని వారు పిలుపునిచ్చారు. అదే విధంగా ఈ రిలే నిరాహార దీక్షకు భారీగా తరలివచ్చిన మహిళలు దీక్షలో పాల్గొని మద్దతు ఇచ్చారు. డంపింగ్ యార్డ్ కువ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు సారా రవి గౌడ్, తాళ్ల జనార్దన్ గౌడ్, దావూద్, ఆంజనేయులు గౌడ్, రాజేందర్ సాగర్, మహిళలు పాల్గొన్నారు

# ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: ఎన్నికల విధులను నిజాయితీ నిష్పక్షపాతంగా నిర్వహించాలని టీచర్స్, ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఎక్కా నోడల్ అధికారులు ఆదేశించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఈ నెల 27 న నిర్వహించే మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ శాసన మండలిఎన్నికల పోలింగ్ నిర్వహణపై ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఎక్కా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఎన్నికల విధులు నిర్వహించే వివిధ నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నోడల్ అధికారులు ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతిది రికార్డు నమోదు చేయాలని, సంబంధిత ఆర్డీవోలు తాసిల్దారులు పర్యవేక్షణ చాలా అవసరమని అన్నారు. 100 ఓటర్ స్లిప్పులను పంపిణీ జరగాలని, పోలింగ్ అధికారులు ర్యాండ్ మైజేషన్ పద్ధతిలో పోలింగ్ సిబ్బందికి కేటాయించాలన్నారు. ఈవీఎంలు ఉండవు కాబట్టి బ్యాలెట్ పత్రాలు ద్వారా బ్యాలెట్ బాక్స్ లలో ఓటు వేయాలని తెలిపారు. నోటా ఉండదని అన్నారు. పోలింగ్ అధికారులుగా రెవిన్యూ అగ్రికల్చర్ పంచాయతీ రాజ్ శాఖల అధికారులు ఉంటారు. కాబట్టి వీరికి పోలింగ్ నిర్వహణపై సమగ్ర శిక్షణ అవసరం అని తెలిపారు. ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ టీచర్స్ ఎన్నికల విధి విధానాలపై క్షుణ్ణంగా వివరించారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా, ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు21 ఉండగా, 1347 మంది ఓటర్లు, తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పటిష్ట భద్రత కల్పిస్తూ ఎన్నికల నిర్వహణకు సహకరిస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, సంబంధిత ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



ప్రజాపక్షం/కోటగిరి: మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నిర్వహకులకు సూచించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలించారు. స్కూల్‌లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్న తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా..? అని పరిశీలించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుండగా, సరిపడా ఫ్యాకల్టీ ఉన్నారా..? అని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ ముబీన్ ను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను సందర్శించి, బియ్యం నిల్వలు, కూరగాయాల నాణ్యతను, సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. వంట నూనె, పాలు, కోడిగుడ్ల నాణ్యత పరిశీలించి కలెక్టర్ కాల పరిమితి ముగిని వాటిని వినియోగించవద్దని సూచించారు. పాఠశాల సముదాయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రతలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్‌కు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆయా శాఖల స్థానిక అధికారులు తదితరులు ఉన్నారు.

## ఛత్రపతి శివాజీ లౌకిక పాలకుడు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతి-నిధి: ఛత్రపతి శివాజీ లౌకిక పాలకుడని హిందూ రాజుగా పాలకులు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 395వ జయంతి సందర్భంగా రైల్వేస్టేషన్ లోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కేవలం హిందూ రాజుగా మాత్రమే చిత్రీకరించే విధంగా పాలకులు ప్రయత్నిస్తున్నారని, ఛత్రపతి శివాజీ లౌకిక పాలకుడు అన్ని మతాలకు సమానంగా చూస్తూ పాలన చేయడం జరిగిందన్నారు. ఈ బృందంలో సీపీఐ నాయకులు పి.సుధాకర్, రాజేశ్వర్, రాజయ్య, రంజిత్, ఫిరోజ్‌అలీ, రాధాకుమార్ పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణకు పాటుపడుదాం

ప్రజాపక్షం/ కాగజ్ నగర్ : కాగజ్ నగర్ పట్టణంలోని శివాజీ చౌక్‌లో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హిందూ జాగరణ్ మంచ్, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిర్పూర్ ఎంఎల్ఏ డా. పాల్వాయి హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ హరీష్ బాబు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, హైందవ ధర్మాన్ని కాపాడేందుకు శివాజీ చేసిన పోరాటం చిరస్మరణీయమైందని, దేశ రక్షణ కోసం ఆయన చూపిన తెగువ మనందరికీ ఆదర్శం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ మహారాజ్‌కు నివాళులర్పించారు.



# ఇంటిపన్ను ,తాగు నీటిపై సమస్యలపై సమీక్ష

### కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి: జిల్లా కలెక్టరేట్ మీడియా సమావేశ మందిరంలో మండల స్పెషల్ ఆఫీసర్లు ,మండల పరిషత్ అధికారులు ,ఎంపిడివోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో వేసవి తాగునీటి సమస్యల నివారణ ,ప్రాపర్టీ టాక్స్ , వసూళ్లు ,రేషన్ కార్డుల పరిశీలన ,వసతి గృహాల తనిఖీలు ఇందిరమ్మ హౌసింగ్ పనులు పురోగతి వంటి అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో త్రాగునీటి వనరులను ముందుగానే గుర్తించి ,ఎక్కడ నీటి ఎద్దడి ఎక్కువగా ఉందో అటువంటి ప్రాంతాల్లో తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో త్రాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, మండల ,గ్రామ స్థాయిలో సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సరఫరాకు అవసరమైన పైప్‌లైన్ మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం గుణాత్మక మైన విద్య అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి డిపిఓ సాయి బాబా, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంబందిత జిల్లా అదికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

### కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టడానికి అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు. బుధవారం హవేలి ఘనపూర్ మండల కేంద్రంలో మెదక్ ఆర్‌డిఓ రమాదేవి, తాసిల్దార్ సింధు రేణుకతో కలిసి కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టేందుకు భూమిని గుర్తించే ప్రక్రియ లో భాగంగా ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, సంబంధిత నివేదికలు తయారుచేసి వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని, కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహాసిల్దార్ సింధూ రేణుక, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలి




ప్రజాపక్షం/మందమర్రి: సింగరేణి కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ముఖ్యంగా కార్మికుల సొంతింటి కలను నిజం చేసేందుకు అనుకూలమైన చర్యలు, పెర్క్స్‌పై ఆదాయపన్ను (ఇన్‌కమ్ ట్యాక్స్) రద్దు తదితర హామీలను అమలు చేయాలని కోరారు. బుధవారం మందమర్రి బ్రాంచ్ ఎఐటియుసి అత్యవసర సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి సంవత్సరం గడిచినా కార్పొరేట్ స్థాయిలో స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు నిర్వహించకపోవడం బాధాకరం అని అన్నారు. డైరెక్టర్లు అందుబాటులో లేరన్న కారణంతో సమస్యల పరిష్కారాన్ని వాయిదా వేస్తున్నారన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కలను నిజం చేసేందుకు మిగులు ఉన్న క్వార్టర్ల కేటాయింపు, 300 గజాల స్థలంతో పాటు రూ. 20 లక్షల వడ్డీ లేని రుణం అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి సింగరేణి సిఎండికి వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఇల్లు లేని కార్మికులకు క్వార్టర్లు కేటాయించాలని, సింగరేణి ప్రాంతంలో రాజకీయ జోక్యంతో కొంతమంది అక్రమంగా క్వార్టర్లను ఆక్రమిస్తున్నారని, ఈ అక్రమాలను తక్షణమే అరికట్టాలని కోరారు. అక్రమంగా క్వార్టర్లను ఆక్రమించినవారిని యాజమాన్యం ఖాళీ చేయించి, నిజమైన హక్కుదారులకు కేటాయించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి ఎల్లప్పుడూ పోరాడుతుందని, కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి ఉపాధ్యక్షులు భీమనాథుని సుదర్శన్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, ఏరియా నాయకులు బానయ్య, రమణ, రాజేశ్వరరావు, రాజేశం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులందరికి జీవన భృతి పెంచాలి

ప్రజాపక్షం /నందిపేట్: బీడీ పరిశ్రమలోపనిచేసే కార్మికులందరికి ఎలాంటి ఆంక్షలు షరతుల లేకుండా నాలుగువేల జీవన భృతి అమలు చేయాలని, కొత్తగా ప్రావిడెంట్ ఫండ్ నెంబరు వచ్చిన వారికి జీవన భృతి మంజూరు చేయాలని కార్మిక సంఘాలు నెలరోజులుగా ర్యాలీలు ధర్నాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. తెలంగాణ రాష్ట్రంలోఏడు లక్షల మంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 98 శాతం మంది బీడీలు చుట్టే కార్మికులు ఉన్నారు. బీడీ ప్యాకర్లు 6 వేల మంది ఉన్నారు. బీడీ కమిషన్ ఏజెంట్లు 8 వేల మందికిపైగా ఉన్నారు. వీరందరికి ఇతర పరిశ్రమల కార్మికుల కంటే బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికి చేతి నిండా పని లేదు. సగం రోజులకు మాత్రమే పని దొరుకుతుంది. కొన్ని కంపెనీలు నెలలోనాలుగు నుండి పది రోజులు మాత్రమే పని దినాలు ఇస్తున్నాయి. ఈ పరిస్థితిలలో దిన దిన గండంగా బీడీ కార్మిక కుటుంబాలు గడపడం తలకు మించిన భారమైంది. అదేవిధంగా బీడీ ప్యాకింగ్ చేసే కార్మికులకు ఉత్పత్తి తగ్గడం వల్ల చేతి నిండా పని లేక వారికి వచ్చే వేతనాలు సగానికి పైగా తగ్గాయి. కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. అప్పట్లో ప్రభుత్వం బీడీ కార్మికులకు రూ. 2016 జీవన భృతిగా మంజూరు చేసింది. ఈ పరిస్థితులలో 2023 నవంబర్ నెలలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికి చేయూత పథకం కింద నాలుగు వేల రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కానీ నెలలు గడుస్తున్నా జీవన భృతి జాడ లేదు. ఇచ్చిన హామీ అమలు చేయాలని బీడీ కార్మికులు కోరుతున్నారు. మా మొర పట్టించుకోండి ముఖ్యమంత్రి సారు. ఎందుకు మమ్ములను నిర్లక్ష్యం చేస్తున్నారు అంటు కార్మికులు బాధతో చెప్పుకుంటున్నారు. సిఎం సారు మీరు ఇచ్చిన మాట ప్రకారం కొత్త బీడీ కార్మికులకు జీవన భృతి మంజూరు చేస్తు భృతిని పెంచాలని కోరుతున్నారు.



# క్రీడ

# మనిషా? పక్షా?



**న్యూఢిల్లీ :** న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ గ్లేన్ ఫిలిప్స్ కళ్లు చెదిరే క్యాచ్‌తో ఔరా అనిపించాడు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా ఆతిథ్య పాకిస్థాన్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లోనే అద్భుతంగా ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ క్యాచ్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. నెటిజన్లు ఫిలిప్స్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. టోర్నీ ఆఫ్ ది క్యాచ్‌గా నిలుస్తుందని కొనియాడుతున్నారు. ఓయ్ ఫిలిప్స్.. నువ్వు మనిషివా? పక్షివా? అని ప్రశ్నిస్తున్నారు. 'తొలి మ్యాచ్‌లోనే నీ విన్యాసాలు మొదలు పెట్టావా?'అని కామెంట్ చేస్తున్నారు. గ్లేన్ ఫిలిప్స్ సెన్సేషనల్ క్యాచ్‌కు పాకిస్థాన్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్(3) నిరాశగా పెవిలియన్ చేరాడు. న్యూజిలాండ పేసర్ విల్ ఓ రూర్కీ వేసిన 10వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఆఖరి బంతిని ఓ రూర్కీ.. వైడ్‌గా షార్ట్ బాల్ వేయగా రిజ్వాన్ కట్ షాట్ ఆడాడు. కానీ పాయింట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న గ్లేన్ ఫిలిప్స్ ఎడమ వైపు డైవ్ చేసి బంతిని ఒంటి చేత్తో అద్భుతంగా అందుకున్నాడు. ఈ క్యాచ్‌ను చూసి మహమ్మద్ రిజ్వాన్ నోరెళ్లబెట్టాడు. నిరాశగా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 330 పరుగుల భారీ స్కోర్ చేసింది. విల్ యంగ్(113 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 107), టామ్ లాథమ్(104 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 118 నాటౌట్) శతకాలతో చెలరేగగా.. గ్లేన్ ఫిలిఫ్స్((39 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) విధ్వంసకర హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. పాకిస్థాన్ బౌలర్లలో నసీమ్ షా(2/63), హ్యారీస్ రౌఫ్(2/80) రెండేసి వికెట్లు తీయగా.. అబ్రర్ అహ్మద్ ఓ వికెట్ పడగొట్టాడు. ఆఖరి 10 ఓవర్లలోనే న్యూజిలాండ్ 113 పరుగులు చేయడం గమనార్హం. మిడిల్ ఓవర్లలో పాకిస్థాన్ బౌలర్లు తేలిపోయారు. ముఖ్యంగా స్పిన్నర్లు వికెట్లు తీయలేకపోయారు. మిడిల్ ఓవర్లలో పాకిస్థాన్ బౌలర్ల వైఫల్యం న్యూజిలాండ్‌కు కలిసొచ్చింది.

## పాక్ గడ్డపై ఎగిరిన భారత జెండా!




శత్రు దేశం పాకిస్థాన్ గడ్డపై ఎట్టకేలకు భారత మువ్వెన్నల పతాకం రెపరెపలాడింది. కరాచీ స్టేడియం వేదికగా ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఘనంగా ప్రారంభమైంది. ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ సందర్భంగా కరాచీ స్టేడియం పైకప్పుపై ఈ టోర్నీలో బరిలోకి దిగిన 8 దేశాల జెండాలను ఎగరవేసారు. అయితే రెండు రోజుల క్రితం జెండా వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. కరాచీ, లాహోర్ మైదానాల్లో భారత్ జెండాను పీసీబీ ఎగరవేయలేదు. మిగతా ఏడు జట్ల జెండాలను ఎగరవేసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై భారత అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. పీసీబీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ తన నీచ బుద్ధిని బయటపెట్టుకుందని మండిపడ్డారు. ఈ టోర్నీ కోసం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించకపోవడంతోనే పిసిబి జెండాను ఎగరవేయలేదని ఆ దేశ నెటిజన్లు, జర్నలిస్ట్‌లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పిసిబి కూడా స్పందించింది. 'ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడేందుకు పాకిస్థాన్‌కు భారత్ రావట్లేదు. కరాచీ, రావల్పిండి, లాహోర్ స్టేడియాల్లో మ్యాచ్‌లు ఆడుతున్న జట్ల జెండాలను మాత్రమే ఎగరవేశాం. భారత్ తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. బంగ్లాదేశ్ కూడా ఇంకా పాకిస్థాన్‌కు రాలేదు. ఆ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత్‌తో ఆడనుంది. కాబట్టి భారత్, బంగ్లాదేశ్ జెండాలను ఇంకా ఎగరవేయలేదు. పాకిస్థాన్‌కు వచ్చిన మిగతా జట్ల జాతీయ పతాకాలను మాత్రమే ఎగరవేసాం. ఈ జెండాల గురించి పీసీబీ అధికారికంగా స్పందించాల్సిన అవసరం లేదు.'అని ఆ బోర్డు వర్గాలు మీడియాకు తెలిపాయి.



**ఎట్టకేలకు ఎగిరిన భారత జెండా..**

ఈ వ్యవహారంపై బిసిసిఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. టోర్నీలో భాగమయ్యే అన్ని దేశాల జెండాలను ఎగరవేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బిసిసిఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా భారత జెండా ఎగరవేయాలని పేర్కొన్నారు. ఇక తొలి మ్యాచ్ సందర్భంగా భారత జెండాను ఎగరవేసి ఈ వివాదానికి పిసిబి ముగింపు పలికింది. ప్రస్తుతం కరాచీ స్టేడియం ఎగురుతున్న భారత జెండా వీడియో, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆటగాళ్ల భద్రతను కారణంగా చూపిస్తూ పాకిస్థాన్‌లో పర్యటించేందుకు బిసిసిఐ అభ్యంతరం చెప్పిన విషయం తెలిసిందే. దాంతో ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేలా బిసిబిని ఐసిసి ఒప్పించింది. ఇందుకుగానూ బిసిసిఐ పిసిబిల మధ్య ఓ ఒప్పందం జరిగింది. భారత్ వేదికగా జరిగే ఐసీసీ టోర్నీల్లోనూ తమ మ్యాచ్‌లను తటస్థ వేదికగా నిర్వహించాలని పిసిబి కోరగా.. అందుకు బీసీసీఐ అంగీకరించింది.



## జయంతి సందర్భంగా ఛత్రపతి శివాజీ పోస్టర్

గత యేడాది చివరిలో ఛత్రపతి శివాజీ చిత్రంలో తాను నటిస్తున్నట్టు కన్నడ స్టార్ హీరో రిషభ్ శెట్టి ప్రకటించాడు. తాజాగా శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని మరో పోస్టర్ ను రిలీజ్ చేశాడు. 'కాంతార' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు కన్నడ స్టార్ హీరో రిషభ్ శెట్టి. అంతేకాదు... జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగానూ అవార్డును అందుకున్నాడు. ప్రస్తుతం 'కాంతార' ప్రీక్వెల్ తో పాటు, 'జై హానుమాన్' చిత్రాలను చేస్తున్నాడు. వీటితో పాటు గత యేడాది 'ద ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' చిత్రాన్ని చేయబోతున్నట్టు తెలిపాడు. ఫిబ్రవరి 19 ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కావడంతో ఈ సందర్భంగా ఆ సినిమా నుండి నయా పోస్టర్ ను విడుదల చేశారు. సందీప్ సింగ్ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకోబోతోందని తెలుస్తోంది. మూవీని అనౌన్స్ చేసిన రోజునే రిషభ్ శెట్టి దీనిని 2027 జనవరి 21న విడుదల చేస్తున్నట్టుగా తెలిపాడు. తాజాగా అష్టభుజాదేవి భారీ విగ్రహం ముందు వీరఖడ్గంతో శివాజీ ఉన్న పోస్టర్ ను రిలీజ్ చేశారు.

## జాతి రత్నం కూడా ఈ రేస్ లోనే?

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో ప్రామిసింగ్ ఎంటర్టైన్మెంట్ అందించే యువ హీరో నవీన్ పొలిశెట్టి కూడా ఒకరు. మరి నవీన్ హీరోగా ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ అలాగే జాతి రత్నాలు సినిమాతో మంచి ఫేమ్ తను అందుకోగా ఆ తర్వాత స్టార్ నటి అనుష్కతో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో మరో బిగ్గెస్ట్ హిట్ అందుకున్నాడు. అయితే తాను హీరోగా నటిస్తున్న మరో అవైటెడ్ సినిమానే అనగనగా ఒక రాజు. మంచి ఎంటర్టైన్మెంట్ ప్రోమో, టీజర్ లతో ఆకట్టుకున్న ఈ సినిమా పట్ల ఆడియెన్స్ లో మంచి బజ్ ఉంది. అయితే ఈ సినిమాపై లేటెస్ట్ రూమర్స్ ఇపుడు వినిపిస్తున్నాయి. దీనితో ఈ సినిమా కూడా వచ్చే ఏడాది సంక్రాంతి రేస్ లో రిలీజ్ కి రాబోతుంది అని తెలుస్తోంది. ఆల్రెడీ ఈ రేస్ లో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, మెగాస్టార్ చిరంజీవి లాంటి అగ్ర తారల సినిమాలు కూడా ఉన్నాయి. మరి చూడాలి నవీన్ సినిమాపై ఎలాంటి క్లారిటీ వస్తుంది అనేది.

# రీల్

## నాని హిట్ 3 ట్రీట్ కి డేట్ లాక్!

నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో సాలిడ్ యాక్షన్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం హిట్ 3 కూడా ఒకటి. తాను పరిచయం చేసిన యువ దర్శకుడు శైలేష్ కొలనుతో చేస్తున్న ఈ ఇంట్రెస్టింగ్ సినిమాటిక్ యూనివర్స్ చిత్రం పట్ల మంచి హైప్ నెలకొనగా ఇపుడు ఈ సినిమా రిలీజ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే అంతకంటే ముందు సినిమా టీజర్ కోసం మరింత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే దీనిపై ఇపుడు అధికారిక అప్డేట్ వచ్చేసింది. దీనితో ఈ ఫిబ్రవరి 24న రాబోతున్నట్టుగా ఇపుడు యూఎస్ డిస్ట్రిబ్యూటర్స్ కన్ఫర్మ్ చేసేసారు. దీనితో హిట్ 3 టీజర్ అతి త్వరలోనే రానుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తుండగా ఈ సినిమా నిర్మాణంలో నాని భాగం కాగా ఈ మే 1 న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కి రాబోతుంది.






## పంట దున్నేసినఅధికారులు.. కుప్పకూలిన రైతు

**భోపాల్ :** చేతికి అందివచ్చిన పంటను అ ధికారులు నాశనం చేశారు. ట్రాక్టర్లతో చే నును ధ్వంసం చేశారు. రైతు, అతడి భార్య వేడుకున్నప్పటికీ అధికారులు వినిపించుకోలేదు. దీంతో కోతకు వచ్చిన పంట నాశ నం కావడం చూసి తట్టుకోలేక ఆ రైతు కుప్పకూలిపోయాడు. మధ్యప్రదేశ్‌లోని వి దిష జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సి రోంజ్‌లోని కేతన్ ఆనకట్ట ప్రాంతంలో సు మారు 20 ఎకరాల్లోని పంటను అధికారు లు ధ్వంసం చేశారు. చేనులో ట్రాక్టర్ నడి పి కోత దశకు వచ్చిన పంటను నాశనం చే శారు. రైతు మూల్‌చంద్, అతడి భార్య ఎంత ప్రాధేయపడినా అధికారులు కనికరించలేదు. పంట నాశనం కావడం చూసి షాక్ తో రైతు మూల్‌చంద్ కుప్పకూలిపోయాడు. తమ చర్యను అధికారులు సమర్థించుకున్నా రు. మరోవైపు గత ఏడాది అక్టోబర్‌లో ఆ భూమికి జరిమానా కూడా కట్టినట్లు రైతు మూల్‌చంద్ తెలిపా డు. దాని రశీదు కూడా తన వద్ద ఉంద ని చెప్పాడు. అయినప్పటికీ అధికారులు వినిపించుకోకుండా తన పంటను నాశనం చేశారని రైతు వాపోయాడు. రైతు పంటను ధ్వంసం చేసిన అధికారుల తీరుపై విమర్శలతోపాటు రాజకీయంగా ఇది దుమారం లేపింది.

## కులగణనను సద్వినియోగం చేసుకోండి

### గతంలో పాల్గొనని వారికి మంత్రి పొన్నం విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన మేధావులు బలహీన వర్గాల నాయకులు, ప్రొఫెసర్లు వివిధ స్థాయిల్లో ఉన్న అందరి విజ్ఞప్తి మేరకు కుల గణన లో నమోదు చేసుకొని వారికి మరో అవకాశం ఇచ్చామని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 16 వ తేదీ నుండి 28 వ తేదీ వరకు ఇప్పటి వరకు కుల సర్వే లో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు నమోదు చేసుకోవాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.మూడు పద్ధతుల్లో కుల సర్వే లో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇచ్చామని తెలిపారు.కుల సర్వే కి ఆనాడు విజ్ఞప్తి చేసిన వారు, విమర్శలు చేసిన వారు ఈ సారైన సర్వే లో భాగస్వామ్యులు అయ్యే విధంగా చూడాలని తెలంగాణ మేధావులకు విజ్ఞప్తి చేశారు. బాధ్యత గల ప్రతిపక్షంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కుల సర్వే ఎజెండా తీసుకోవాలని, కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు గానీ సర్వేలో పాల్గొని పార్టీ పక్షాన బలహీన వర్గాల పక్షాన సానుకూలంగా ఉన్నామని చెబుతూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలా కాకుండా విమర్శలకే పరిమితమైతే తెలంగాణ బలహీన వర్గాలు చూస్తూ ఊరుకోబోవని హెచ్చరించారు.

## ప్రజావ్యతిరేకమే

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. పద్దుల్లో విద్యా, వైద్య రంగాలను నిర్వీర్యం చేశారని, సామాన్యులు, పేదలకు, వెనుకబడిన వర్గాలను కేంద్రం విస్మరించిందని, పద్దతిలేని ఈ బడ్జెట్‌ను మార్చాలన్నదే వామపక్షాల ప్రధాన డిమాండ్ అన్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి దారులకు రాయితీలు కల్పిస్తూ పేదలపై పన్నుల భారాన్ని మోపారని మండిపడ్డారు. కేంద్రానికి వస్తున్న రాబడిలో 95 శాతం పేదల కష్టార్జితమేనని, సంపన్నులు చెల్లించేది 3 శాతం మాత్రమే అన్నారు. దేశంలో ఉన్న 200 మంది శతకోటీశ్వరులపై నాలుగు శాతం సంపద పన్ను విధించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర హామీ ఇవ్వాలని, బీమా రంగంలో ఎస్‌డిఐని పూర్తిగా విరమించుకోవాలని, ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలని అన్నారు. ఉపాధిహామి పథకానికి నిధులు పెంచాలని, పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు రద్దు చేయాలని, కార్మికులు, పేదలు, వ్యవసాయం, విద్యా, వైద్యం వంటి రంగాలకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో మార్పులు చేయకుంటే వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు, ఎన్‌డి చంద్రన్న వర్గం జిల్లా నాయకులు కందగట్ల సురేందర్, ఎన్‌డి మాస్‌లైన్ జిల్లా నాయకులు పి.సతీష్ మాట్లాడారు.



హైదరాబాద్‌లో..

### చేతికి సంకెళ్లతో వినూత్న నిరసన

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణా పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపై బుధవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో వామపక్ష పార్టీల చేతికి సంకెళ్లతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షత వహించగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మా ట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణపట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. ఎపి పునర్విభజన చట్టం అమలును బిజెపి నిర్లక్ష్యం చేసిందని, నిర్లక్ష్యానికి గురైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులోని తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించలేదన్నా రు. సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్‌లో మరోసారి తెలంగాణాకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. అన్యాయంపై రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్.జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి,కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, బత్తిని సదానందం, మాలోతు శంకర్‌నాయక్, సుదర్శన్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, రొంటాల రమేష్ దేవా, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, నిమ్మల మనోహర్, నాయకులు ఎస్.వాసుదేవరెడ్డి, ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వీరన్న నాయక్, జి.రాములు,సాంబయ్య, ఆర్ఎస్పీ జిల్లా నాయకులు కె. శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## పన్నులపై వెనక్కి తగ్గం

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనకు ముందు పరస్పరం పన్నులు విధానాన్ని ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ 'మీరు ఎంత పన్ను విధిస్తే... మేము కూడా అంతే విధిస్తాం అని మోదీతో చెప్పాను. మోదీ ఏదో చెప్పబోతే... లేదు అది నాకు నచ్చదన్నాను. మీరు ఎంత సుంకం వేస్తే మేము కూడా అంతే వేస్తాం అని తేల్చిచెప్పేశా' అని ట్రంప్ అన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వాటిలో కొన్నింటిపై భారత్ అధిక సుంకాలు విధిస్తుందని చెప్పారు. ముఖ్యంగా ఆటోమొబైల్ రంగంలో 100శాతం సుంకాలను విధిస్తుందన్నారు. ఈ విషయంలో మస్క్ కూడా ట్రంప్‌తో ఏకీభవించారు. 'నేను 25శాతం పన్ను అంటే... వారు చాలా ఎక్కువ అని అంటారు. అందుకే ఇకపై మాట్లాడటాలు ఉండవు... వాళ్లు ఎంత విధిస్తే... సమాంతర పన్ను అమెరికా విధిస్తుంది... దీంతో వాళ్లే పన్నులు ఆపేస్తారు' అని ట్రంప్ అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటన్నారు. అయితే ఇందుకోసం భారత్‌ను నిందించడం లేదు కానీ ఇదొక భిన్నమైన వాణిజ్య విధానమని ట్రంప్ వ్యాఖ్యానించారు. అత్యధిక పన్నులు, కఠినమైన వాణిజ్య ఆంక్షలు ఉండటం వల్ల భారత్‌కు ఏదైనా విక్రయించడం చాలా కష్టమని చెప్పారు. పన్నులు, సుంకాల విషయంలో ఏ దేశానికి మినహాయింపులు ఉండబోవని, ఇది చాలా న్యాయమైన పద్ధతి అన్నది తన నమ్మకమని ట్రంప్ అన్నారు. ట్రంప్ 2019లో తొలిసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పుడు భారత్ ఆయనను టారిఫ్ కింగ్‌గా పేరు పెట్టిన విషయం తెలిసిందే.

### డబ్బున్న దేశం భారత్..మానిధుల అవసరం లేదు

భారత్ దగ్గర చాలా డబ్బు ఉందని ట్రంప్ అన్నారు. ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా డబ్బులు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. 'వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు అమెరికా ఎందుకు ఇవ్వాలి... ఆ నిధి అవసరం భారత్‌కు ఏమున్నది. ఆ దేశం వద్ద డబ్బు చాలానే ఉంది. మన దేశంపై దృష్టి పెట్టడం అవసరం. అమెరికన్ ఓటర్ల పరిస్థితి ఎలా ఉంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. సుంకాలు విషయంలో అమెరికా భారత్‌ను చేరుకోలేదు. నాకు భారతీయులపై ఆ దేశ ప్రధానిపై గౌరవం ఉంది కానీ వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా? మన పన్ను చెల్లింపుదారుల డబ్బు ఆ దేశానికి ఎందుకు ఇవ్వాలి?' అని అధ్యక్షుడు ప్రశ్నించారు. ఇదిలావుంటే, ఇతర దేశాలకు ఇచ్చే నిధుల్లో కోత విధిస్తూ ఎలన్ మస్క్ నేతత్వంలోని డోజ్ విభాగం జాబితా ప్రకటించిన క్రమంలో ట్రంప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు ఇచ్చే నిధులను రద్దు చేసినట్లు అమెరికా ప్రకటించింది. బంగ్లాదేశ్, నేపాల్‌కూ నిధులు ఆపేసింది.

### అంతరిక్ష వ్యవహారాల్లో మస్క్‌కు నిర్ణయాధికారం ఉండదు

అంతరిక్ష వ్యవహారాల్లో ఎలన్ మస్క్ జోక్యం కానీ, సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉండబోదని ట్రంప్ స్పష్టంచేశారు. మస్క్ నిర్వహిస్తున్న వ్యాపారాలతో సంబంధమున్న శాఖలకు ఆయన దూరంగా ఉంటారని చెప్పారు. డోజ్ నిర్వహణకు మస్క్ కంటే తెలివైన వ్యక్తి కావాలని అనుకున్నా కానీ అది సాధ్యపడగా ఆయనకే బాధ్యతలు అప్పగించాల్సి వచ్చిందని అన్నారు. వివిధ శాఖల్లోని వధా ఖర్చును మస్క్ తగ్గిస్తారన్న నమ్మకం తనకు ఉందని ట్రంప్ అన్నారు. అయితే మస్క్ కేవలం ఉద్యోగి అని, శ్వేతసౌధంలో సీనియర్ సలహాదారుల మాదిరిగా ప్రభుత్వపరమైన నిర్ణయాలను తీసులేరి శ్వేతసౌధం వ్యవహారాల డైరెక్టర్ జోషువా ఫిషర్ తెలిపారు. మస్క్ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ న్యూమెక్సికో పెట్టిన కేసుపై ఈ మేరకు వివరణ ఇచ్చారు.

## పాస్‌పోర్ట్ రెన్యూవల్ చేయించుకున్న మాజీ సిఎం కెసిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తన పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేయించుకున్నారు. పాస్‌పోర్ట్ రెన్యువల్ నిమిత్తం కెసిఆర్ సికింద్రాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయానికి బుధవారం వెళ్లారు . అనంతరం కెసిఆర్ తెలంగాణ భవన్‌లో జరిగిన బిఆర్ఎస్ కార్యవర్గ విస్తృత సమావేశంలో పాల్గొన్నారు. కాగా త్వరలోనే కెసిఆర్ అమెరికాలోని తన మనుమరాలు అలేఖ్య, సింగపూర్‌లో విద్యాభ్యాసం చేస్తున్న కెటిఆర్ కొడుకు హిమాన్షు వద్దకు వెళ్తారనే ప్రచారం జరుగుతోంది. కాగా బిఆర్ఎస్ సిల్వర్ జుబ్లీ కార్యక్రమానికి ముందే కెసిఆర్ విదేశీ పర్యటన ఉండే అవకాశాలు ఉన్నట్టు పలువురు అంచనా వేస్తున్నారు.

## ఉన్నతస్థాయి బృందం

(మొదటి పేజీ తరువాయి)

ఇతర సీనియర్ అధికారులు రష్యా తరపున చర్చల్లో పాల్గొన్నారు. లావ్‌రోవ్ కూడా దాదాపు రుబియో అభిప్రాయాలనే వెల్లడించారు. ఇది ఆరంభం మాత్రమేననీ, చేయవలసింది ఎంతో మిగిలి ఉందనీ చెప్పారు. ''మేం కేవలం వాళ్ళు చెప్పినవి వినడమే కాదు, మేం పరస్పరం ఒకరి అభిప్రాయాలను మరొకరం శ్రద్ధగా విన్నాం'' అన్నారు. ట్రంప్ సన్నిహితుడైన అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్జ్, మధ్యాసియాలో ప్రత్యేకదూత స్టీవెన్ విట్‌కోఫ్, రష్యా తరపున లోవ్‌రోవ్‌తోపాటు పుతిన్‌కు సన్నిహితుడు, రష్యా జాతీయ భద్రతా సలహాదారు యూరీ ఉషకోవ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. కానీ ఉక్రేన్ తరపున ఏ ఒక్క అధికారీ చర్చల్లో పాల్గొనలేదు. చర్చలకు రావాలని ఎలాంటి ఆహ్వానం అందలేదని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పష్టం చేశారు. తమదేశ భాగస్వామ్యం లేకుండా జరిగే ఈ చర్చలను అంగీకరించబోమని, తమకు హానిచేసే ఫలితాలను ఒప్పుకోమని ఇప్పటికే స్పష్టం చేశారు. యూరప్ దేశాలు కూడా ఈ చర్చల ప్రారంభానికి ముందునుండీ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. తమను పక్కకు నెట్టేశారని, నాటో,ఉక్రేన్ లేకుండా జరిగే చర్చలకు ఎలాంటి విలువా ఉండబోదని యూరోపియన్ యూనియన్ స్పష్టం చేసింది.

**రష్యా—అమెరికా మధ్య కొత్త బంధం!**

ఉక్రేన్‌లో యుద్ధ నివారణ పేరుతో జరిగిన చర్చల్లో రష్యా—అమెరికా మధ్య కొత్త బంధానికి తెరలేచింది. రెండు దేశాలు దౌత్య, ఆర్థికపరమైన సహకారాన్ని, సంబంధాలను మెరుగుపరచుకునేందుకు కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఈ రెండు దేశాలమధ్య సంబంధాలు క్షీణస్థాయికి చేరుకున్నాయి. ఉక్రేన్‌లోని క్రిమియా ప్రాంతాన్ని 2014లో రష్యా ఆక్రమించుకుందని అమెరికా ఆరోపించడంతో సంబంధాలు క్షీణించాయి. ఉక్రేన్‌తో పూర్తిస్థాయి యుద్ధం (2022 ఫిబ్రవరి 24) మొదలయ్యాక అంతంతమాత్రంగా ఉండే సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రష్యాపై అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు ఆర్థిక, సాంఘిక ఆంక్షలు అమలు చేశాయి. దౌత్యవేత్తలను బహిష్కరించుకున్నాయి. ''ఉక్రేన్‌లో యుద్ధం ముగిసిపోతే ఇక తలుపులు పూర్తిగా తెరచుకున్నట్టే''' అని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో అన్నారు. ఆయనతోపాటు రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవ్‌రోవ్ కూడా పత్రికాగోష్ఠిలో మాట్లాడారు. ఈ సమావేశం ఎంతో సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగిందని విట్‌కాఫ్ చెప్పారు. చర్చల్లో పాల్గొన్నవారంతా మంచి ఫలితాలు సాధించాలనే అభిప్రాయాలు వ్యక్తం చేశారన్నారు. రెండు సంవత్సరాల క్రితం జి—20 సదస్సు సందర్భంగా లోవరోవ్, నాటి అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ కాసేపు మాట్లాడుకున్నారు. కానీ అప్పటికి ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్నాయి.

**రష్యాపై యూరప్ మరిన్ని ఆంక్షలు**
**24వ తేదీ నుండి అమలు**

బ్రస్సెల్స్: రష్యాపై యూరప్ దేశాలు మరిన్ని ఆంక్షలు విధించాయి. ఉక్రేన్, యూరప్‌లను పిలవకుండా యుద్ధ సమస్య పరిష్కారానికి సమావేశం జరపడాన్ని యూరప్ దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో యూరప్‌లోని 27 దేశాల దౌత్యవేత్తలు రష్యాపై మరిన్ని ఆంక్షలు విధిస్తున్నట్లు బుధవారంనాడు ఒక ప్రకటన వెలువడింది. ఈ కొత్త ఆంక్షల ప్రకారం 50 మంది రష్యా అధికారులపై, అక్రమంగా రవాణా అవుతున్న రష్యా సరుకుపై గురిపెడతారు. ఈనెల 24వ తేదీతో ఉక్రేన్‌లో యుద్ధానికి మూడు సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ సందర్భంగా ఆ రోజు నుండి రష్యాపై కొత్త ఆంక్షలు అమలులోకి వస్తాయని యూరోపియన్ యూనియన్ ఉన్నతస్థాయి దౌత్యవేత్త స్పష్టం చేశారు.

గత మూడేళ్ళుగా రష్యాపై అనేక విడతలుగా ఆంక్షలు అమలులోకి వచ్చాయి. రియాద్ సమావేశంలో ఉక్రేన్,యూరోపియన్ యూనియన్ జోక్యం లేకపోవడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఇప్పటివరకూ 2,300 సంస్థలు, అధికారులు, ప్రభుత్వ ఏజన్సీలు, బ్యాంకులకు ఈ ఆంక్షలవల్ల నష్టం కలిగింది. రవాణా నిషేధం, ఆస్తుల స్తంభన,వాణిజ్యంపై ఆంక్షలు సహా 16వ విడత ఆంక్షలను యూరప్ దౌత్యవేత్తలు ధృవీకరించారు. రష్యా నౌకల సరుకును ఆంక్షలు తప్పించుకోవడంకోసం వేరేపేరుతో రవాణా అవుతున్నాయి. చమురు, గ్యాస్ రవాణా జరుగుతోంది. ఉక్రేన్ నుండి దొంగిలించిన గ్యాస్‌ను కూడా అక్రమ మార్గంలో రవాణా చేస్తున్నారు. ఇలా 70 నౌకలు షాడో ఫ్లీట్ పేరుతో అక్రమంగా రవాణా అవుతున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com